

వినియోగదారుల సమస్యల పరిష్కారంలో

# నిర్లక్ష్యానికి తావులేదు

**ప్రతి కాల్‌కు స్పందించాలి.. ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించాలి : ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్**

విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి సంస్థ కాల్ సెంటర్‌ను ఆకస్మికంగా మంగళవారం 8వ పేజీలో

నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ట్రిపుల్ ఐటీకి

# 40 మంది ఎంపిక కావడం హర్షణీయం



**విద్యార్థులకు త్వరలోనే ప్రత్యేక సత్కారం -అభినందనలు తెలిపిన శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు**

నర్సీపట్నం, జూన్ 16, ప్రభాతవార్త

ఇటీవల విడుదలైన ఫలితాల్లో ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ)లో సీట్లు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఏకంగా 40 మంది విద్యార్థులు ఎంపిక కావడం చాలా సంతోషకరం అన్నారు. తన రాజకీయ జీవితంలో ఒకే నియోజకవర్గం నుంచి ఇంత మంది ఎంపిక కావడం ఇదే తొలిసారి అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయం వెనుక విద్యా ర్థుల కృషితో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. నియోజక వర్గంలోని నర్సీపట్నం మండలం నుంచి 30 మంది, నాతవరం నుంచి ఏడుగురు, గొలుగొండ నుంచి ఇద్దరు, మాకవరపాలెం నుంచి ఒకరు ఎంపికయ్యారని ఆయన వివరించారు. వీరందరూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి పది మందికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. త్వరలోనే ఈ 40 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరిస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతం నుంచి మరింత మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# మధురవాడకు మహార్దశ



(ప్రభాతవార్త-విశాఖపట్నం)

**రూ.725 కోట్లతో తాగునీటి ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్**

**24 గంటల తాగునీటి సరఫరా దిశగా కీలక అడుగు.. లక్షలాది మందికి ప్రయోజనం**

విశాఖ నగర పరిధిలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మధురవాడ (జోన్-2), పరిసర ప్రాంతాల ప్రజలకు శాశ్వత తాగునీటి భద్రత కల్పించేందుకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం భారీ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాంతానికి 24 గంటల పాటు నిరంతరాయంగా తాగునీటిని సరఫరా చేసే లక్ష్యంతో రూపొందించిన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.725.18 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఆధునిక తాగునీటి వ్యవస్థకు మార్గం సుగమమైంది. మధురవాడ, కొమ్మాది, ఎండాడ, కారాపాక, పరిసర ప్రాంతాల్లో జనాభా వేగంగా పెరుగుతుండటంతో తాగునీటి అవసరాలు కూడా గణనీయంగా పెరిగాయి. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరా అంతరాయాలు, తక్కువ ఒత్తిడితో నీటి పంపిణీ వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కొత్త ప్రాజెక్టు అమలులోకి వస్తే ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. అంతేకాకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సాంకేతికతతో నీటి నిల్వ, శుద్ధి, పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేయనున్నారు. ఈ మెగా ప్రాజెక్టు కోసం నిధులను మూడు వేర్వేరు వనరుల ద్వారా సమీకరించనున్నారు. కేంద్ర ప్రభుత్వ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) నుంచి రూ.172.37 కోట్లు అందనున్నాయి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) తన వాటాగా రూ.190.21 కోట్లు భరిస్తుంది. మిగిలిన రూ.362.60 కోట్లను గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (జివిఎస్‌సీసీఎల్) టర్మ్ లోన్ రూపంలో సమకూర్చనుంది. ఈ ప్రాజెక్టు అమలుతో మధురవాడ ప్రాంత 8వ పేజీలో

# ఘనంగా కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవాలు





నర్సీపట్నం, ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నర్సీపట్నం ధర్మసాగరం స్టార్ హోమ్స్ లో విజయోత్సవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సభను కూటమి నాయకులు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు హాజరుకాగా, నర్సీపట్నం టీడీపీ పట్టణ అధ్యక్షులు చింత కాయల రాజేష్, ప్రధాన కార్యదర్శి లాలం మురళి, బీజేపీ రాష్ట్ర కన్వీనర్ గాదె శ్రీనివాస్, జనసేన నియోజక వర్గం ఇంచార్జ్ సూర్యచంద్ర, జడ్పీటీసీ రమణమ్మ తది తర నాయకులు పాల్గొని ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, పరిశ్రమలు లేక రాష్ట్రం తీవ్రం గా వెనుకబడిందని, ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదు ర్కొన్నారని ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేశారు. కానీ, 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన కేవలం రెండేళ్ల వ్యవధిలోనే కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని హర్షం వ్యక్తం చేశారు. పదిహేడేళ్ల పాటు పార్టీ కోసం కష్టపడిన చింతకాయల విజయ్ సేవలను అధిష్టానం గుర్తించి రాజ్యసభ పదవిని కట్టబెట్టడం, కష్టపడే ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీలో తగిన గౌరవం దక్కుతుందనడానికి ప్రతీక అని లాలం కాశి నాయుడు అన్నారు. సమావేశంలో చింతకాయల రాజేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే రాష్ట్రం అభివృద్ధి బాటలో దూసుకువెళ్తోందని అన్నారు. సూపర్-6 పథకాల్లో భాగంగా 'తల్లికి వందనం' కింద 67 లక్షల మంది విద్యార్థులకు రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని, 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచితంగా ఏపీఎస్ఆర్టీసీ బస్సు ప్రయాణం, 'దీపం' పథకం ద్వారా సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. సామాజిక పింఛన్లను రూ.4 వేలకు పెంచడంతో పాటు, మత్స్యకారులకు ఏటా రూ.20 వేలు, ఆటో డ్రైవర్లకు రూ.15 వేల చొప్పున 8వ పేజీలో



# రేరా ట్రైబ్యునల్ టెక్నికల్ సభ్యురాలిగా విద్యుల్లత!

**ప్రతిభకు పట్టంకట్టనున్న ప్రభుత్వం -పట్టణాభివృద్ధి రంగ అనుభవానికి మరో గౌరవమే..**



(ప్రభాతవార్త-విశాఖపట్నం)

పట్టణ ప్రణాళిక, నగరాభివృద్ధి రంగాల్లో విశేష అనుభవం కలిగిన సీనియర్ అధికారి విద్యుల్లతకు రాష్ట్ర ప్రభుత్వం మరో 8వ పేజీలో

# పర్యాటక హబ్‌గా కైలాసగిరి

**మరిన్ని ఆకర్షణీయ ప్రాజెక్టులకు ప్రతిపాదనలు : వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్**



8లో

పర్యాటక రంగ విశిష్టతను తెలుపుతూ..

# యోగా ప్రాముఖ్యతను చాటుతూ..

**ముడసర్లోవ ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో భారీ యోగా కార్యక్రమం -భాగస్వామ్యమైన ఎంపీ, జిల్లా కలెక్టర్, ఇతర ఐఏఎస్ అధికారులు, అసోసియేషన్ల ప్రతినిధులు**



8లో

# ముస్సోరీ హోమ్‌స్టేలో యువతి మృతి

**విశాఖకు చెందిన ఐటీ ఉద్యోగిని గాయత్రి -గదిలో రక్తపు మరకలు, మద్యం సీసాలు -పోస్టుమార్టం నివేదికపై ఉత్కంఠ -అనుమానాస్పద మృతిపై పోలీసుల దర్యాప్తు**

విశాఖపట్నం, జూన్ 16 ప్రభాతవార్త

వివాహం జరిగిన నూతన జంట హనీమూన్‌లో విషాదం చోటు చేసుకుంది. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరీలో ఓ హోమ్‌స్టేలో విశాఖకు చెందిన ఐటీ ఉద్యోగిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన కలకలం రేపింది. మృతురాలు పీ. రాధా గాయత్రి (27)గా గుర్తించారు. ఆమె గురుగ్రామ్‌లోని ఓ ఐటీ సంస్థలో పనిచేస్తుండగా, ప్రస్తుతం ఢిల్లీలోని కిద్వాయి నగర్ ఈస్ట్‌లో నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గాయత్రి తన భర్త సౌమ్య శ్రీచరణ్‌తో కలిసి విహారయాత్ర నిమిత్తం ముస్సోరీకి వెళ్లింది. శ్రీచరణ్ పుణెలోని ఓ ఐటీ సంస్థలో 12వ పేజీలో

# క్షణం క్షణం భయం.. గమ్యం చేరడం గగనం!

**గాజువాకలో 'ట్రాఫిక్' నరకం! -గమ్యం చేరాలంటే గంటల కొద్దీ నిరీక్షణ -జింక్ ప్రధాన ద్వారం, వంటిల్లు జంక్షన్లలో నిలిచిపోతున్న వాహనాలు -రోడ్లపైనే వ్యాపారాలు.. కేటాయించిన పార్కింగ్ స్థలాల్లో తోపుడు బండ్లు -చలానాలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లపైనే పోలీసుల శ్రద్ధ.. -రెగ్యులేషన్ గాలికొదిలేశారు! -నిలదీస్తున్న స్థానికులు, ప్రజా సంఘాలు**



8లో

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిబింబిస్తూ

# రెండేళ్ల ప్రభుత్వ విజయోత్సవ వేడుకలు

**19న ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధిపై జిల్లా స్థాయి కార్యక్రమాలు -ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్**



8లో

# భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అంతర్జాతీయ కనెక్టివిటీ కల్పించాలి

**ఫ్రాంక్‌ఫర్ట్, లండన్, దుబాయ్, కౌలాలంపూర్, బ్యాంకాక్‌లకు నేరుగా విమానాలు ప్రారంభించాలి -సీఎం చంద్రబాబుకు ఏపీ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ వినతి**



విశాఖపట్నం, మే 25, ప్రభాతవార్త :

ఉత్తరాంధ్ర భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి కీలకంగా మారనున్న భోగాపురం అంతర్జాతీయ విమానా శ్రయాన్ని ప్రపంచ స్థాయి అంతర్జాతీయ గేట్‌వేగా తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ ఛైర్మన్‌కు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రికి సంఘం ప్రతినిధులు విన్నవించారు. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా 8వ పేజీలో

# అగనంపూడి జోన్‌లో పరిపాలన గాడి తప్పిందా..?

**బయోమెట్రిక్ లేకుండా సిబ్బంది ఇష్టారాజ్యం.. పెండింగ్ ఫైళ్లతో ప్రజల అవస్థలు -జీవీఎంసీ కమిషనర్ జోక్యం చేసుకోవాలంటూ స్థానికుల విజ్ఞప్తి**

8లో

## వినియోగదారుల సమస్యల పరిష్కారంలో ..

7వ పేజీ తరువాయి ..

తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాల్ సెంటర్ పనితీరు, వినియోగదారుల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ఫిర్యాదుల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో ఏఈ లు వ్యవహరిస్తున్న తీరును ప్రత్యేకంగా పరిశీలించారు. పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న కొన్ని ఫిర్యాదులపై కాల్ సెంటర్ నుంచే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి వివరణ కోరారు. వినియోగదారుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్‌లు 24ఐ7 అందుబాటులో ఉండి కాల్ సెంటర్ నెంబర్ 1912 కు వచ్చే ప్రతి కాల్‌కు తప్పనిసరిగా స్పందించాలని ఆదేశించారు. కాల్స్‌కు స్పందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించినా, వినియోగదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంలో విఫలమైనా బాధ్యులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో ఏఈలు అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని, ఆలస్యం లేదా నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యంతో తీసుకుని వేగంగా పరిష్కరించి వినియోగదారుల సంతృప్తిని సాధించాలని సూచించారు. కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్‌లు వినియోగదారులతో మాట్లాడుతున్న తీరును సీఎండీ స్వయంగా పరిశీలించారు. పలువురు వినియోగదారులతో జరిగిన కాల్ రికార్డులను విని స్పందించిన ఆయన, మరింత మర్యాదపూర్వకంగా, సహనంతో మాట్లాడాలని సూచించారు. వినియోగదారుల సమస్యలను పూర్తిగా అర్థం చేసుకుని సరైన సమాచారం అందించడంతో పాటు, సంస్థ ప్రతిష్ఠను పెంపొందించే విధంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు, బలమైన గాలుల కారణంగా విద్యుత్ సరఫరాలో మరిన్ని అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎండీ ఆదేశించారు. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటూ నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో ఆపరేషన్స్ డైరెక్టర్ టి.వి. సూర్యప్రకాశ్, సీజీఎం పి. సోలమన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మధురవాడకు ..

7వ పేజీ తరువాయి ..

ప్రజలకు రోజంతా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. నీటి కోసం నిల్వ చేసుకోవాల్సిన అవసరం తగ్గడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి. అలాగే వేగంగా విస్తరిస్తున్న నివాస కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల అవసరాలకు కూడా ఈ ప్రాజెక్టు అండగా నిలవనుంది. నగర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఇది ఒకటిగా నిలవనుంది. విశాఖను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునిక నగరంగా తీర్చిదిద్దే క్రమంలో ఈ తాగునీటి ప్రాజెక్టు ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత లక్షలాది మంది ప్రజలు నాణ్యమైన తాగునీటి సేవలను నిరంతరాయంగా పొందే అవకాశం కలగనుంది.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ..

7వ పేజీ తరువాయి ..

ప్రాంతాలకు కలిపి 1.7 కోట్లకు పైగా జనాభాకు భోగాపురం విమానాశ్రయం తొలి అంతర్జాతీయ ద్వారంగా నిలవనుందని సంఘం పేర్కొంది. విమానాశ్రయం విజయవంతం కావాలంటే ప్రారంభం నుంచే అంతర్జాతీయ ప్రయాణికుల మరియు కార్గో సేవలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. సంఘం అధ్యక్షులు డాక్టర్ కె. కుమార్ రాజా, ఉపాధ్యక్షులు డీఎస్ వర్మ, డాక్టర్ ఓ. నరేష్ కుమార్ సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) హబ్‌గా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. గూగుల్, మెటా, రిలయన్స్ జియో, అదానీ, సిఫీ, ఆర్‌ఎమ్‌జెడ్ గ్రూప్, ఎయిర్‌ట్రంక్ వంటి ప్రముఖ సంస్థలు భారీ పెట్టుబడులతో డేటా సెంటర్లు, ఎఐ కంప్యూటింగ్ సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా ఆర్సెలర్ మిట్టల్ ప్రతిపాదించిన భారీ ఉక్కు పరిశ్రమ, పూడిమడకలో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, అనకాపల్లి–శ్రీకాకుళం ప్రాంతాల్లో ఫార్మా, బల్క్ డ్రగ్ పార్కులు, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ రంగాల్లో వస్తున్న పెట్టుబడులు, బ్యాటరీ స్టోరేజ్, ఈవీ పరిశ్రమల అభివృద్ధి వల్ల అంతర్జాతీయ వ్యాపార ప్రయాణాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో భోగాపురం నుంచి నేరుగా అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మూడు సంవత్సరాలపాటు వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) అందించాలని కోరారు. మొదటి దశలో ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ), లండన్ (యూకే), దుబాయ్ (యూఏఈ), కౌలాలంపూర్ (మలేషియా), బ్యాంకాక్ (థాయ్‌లాండ్), కొలంబో (శ్రీలంక) నగరాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. యూరప్‌లో లక్షలాది తెలుగు ప్రజలు నివసిస్తున్నారని, లండన్, ఫ్రాంక్‌ఫర్ట్ మార్గాలు ఐటీ, ఫైనాన్స్, విద్య, ఫార్మా, పారిశ్రామిక రంగాలకు కీలకమని తెలిపారు. దుబాయ్‌కు ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంతాల నుంచి భారీ గల్ఫ్ ప్రయాణికుల డిమాండ్ ఉందని, కౌలాలంపూర్, బ్యాంకాక్ మార్గాలు దక్షిణాసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ప్రాంతాలకు అనుసంధాన కేంద్రాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రయాణికుల సేవలతో పాటు కార్గో విమాన సేవలు కూడా అత్యవసరమని అసోసియేషన్ అభిప్రాయపడింది. డేటా సెంటర్లు, ఫార్మా, సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, ఇంజినీరింగ్ రంగాలకు సంబంధించిన అత్యవసర పరికరాలు, విడిభాగాలు, నమూనాల రవాణాకు ఫ్రాంక్‌ఫర్ట్, దుబాయ్, కౌలాలంపూర్, బ్యాంకాక్ నగరాలకు ప్రత్యేక కార్గో విమానాలు అవసరమని తెలిపింది. భోగాపురం విమానాశ్రయం పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరాలంటే అనుబంధ రహదారి మౌలిక సదుపాయాలు కూడా వేగంగా పూర్తికావాలని కోరింది. విశాఖపట్నం––భోగాపురం––శ్రీకాకుళం ఆరు లేన్ల కోస్టల్ కారిడార్‌ను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, గాజువాక నుంచి మధురవాడ వరకు పెండింగ్‌లో ఉన్న ఫ్లైఓవర్లను త్వరితగతిన నిర్మించాలని విజ్ఞప్తి చేసింది. అంతర్జాతీయ వ్యాపార ప్రయాణికులు, పెట్టుబడిదారులు, ఐటీ, డేటా సెంటర్ నిపుణులు గంటలోపు విమానాశ్రయానికి చేరుకునేలా రవాణా సదుపాయాలు ఉండాలని సూచించింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, విశాఖలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్లు, ఎ ఐ , గ్రీన్ హైడ్రోజన్, ఫార్మా, పారిశ్రామిక రంగాలు కలిసి ఉత్తరాంధ్రను దేశంలోనే ప్రముఖ ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దగలవని అసోసియేషన్ అభిప్రాయపడింది. అంతర్జాతీయ కనెక్టివిటీ కల్పించడం ద్వారా విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, ఉద్యోగావకాశాలు, ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయని పేర్కొంది. భోగాపురం విమానాశ్రయ ప్రారంభానికి ముందే రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పౌర విమానయాన శాఖ, జీఎంఆర్ సంస్థలు కలిసి ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థలతో చర్చలు ప్రారంభించాలని, భోగాపురాన్ని ప్రపంచ విమానయాన పటంలో నిలిపే దిశగా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

## పర్యాటక హబ్‌గా కైలాసగిరి

విశాఖపట్నం జూన్ 16,ప్రభాతవార్త

విశాఖ పర్యాటక మణిహారమైన కైలాసగిరిని పర్యటక హబ్‌గా తీర్చిదిద్దేశీదుకు తగిన ప్రతిపాదనలు చేయటం జరిగిందని విఎంఆర్ డి ఎ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, ఓఎస్‌డి శ్రీ కృష్ణ నాయక్ కార్యదర్శి శ్రీ మురళీ కృష్ణతో కలిసి కైలాసగిరిని సందర్శించారు. ఈ సందర్భంగా కైలాసగిరిపై అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న నిర్మాణాలను పరిశీలించారు. ఇక్కడ దుకాణ సముదాయం నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు చేయాలని సూచించారు. త్రిశూల్ వరకు వెళ్లేందుకు వీలుగా బ్యాటరీ కారులను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలానే పర్యాకులను ఆకట్టుకునేలా ప్రపంచ ప్రఖ్యాత చెందిన నమూనాలను ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అనంతరం ఆయన కైలాసగిరి వ్యాపారులతో సమావేశమయ్యారు. గ్లాస్ బ్రిడ్జి, త్రిశూల్ ఏర్పాటుతో కైలాసగిరి కింద పైకి వచ్చే సందర్శకుల సంఖ్య పెరిగిందని, అదేవిధంగా పర్యాటకులను విశేషంగా ఆకర్షించేలా మరిన్ని ప్రాజెక్టులు రానున్నాయని పేర్కొన్నారు. అందువల్ల కైలాసగిరికి మంచి పేరు తీసుకువచ్చేలా వ్యవహరించాలని సూచించారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఈ జేసి పి సింగ్, డిఈ శంకర్రావు, శ్రీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవాలు

7వ పేజీ తరువాయి ..

ఆర్థిక సాయం అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఆయన ఉద్ఘాటించారు. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా మెగా డీఎస్సీ ద్వారా 15,941 టీచర్ పోస్టులు, 5,757 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ చేపట్టామని రాజేష్ వివరించారు. అమరావతి రాజధాని పనులను వేగవంతం చేయడంతో పాటు, రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు తీసుకొచ్చామన్నారు. అనకాపల్లి జిల్లాలో రూ.5,400 కోట్లతో రెన్యూ ఎనర్జీ సంస్థ, భారీ పెట్టుబడితో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. అలాగే, మాకవరపాలెంలో రూ.1,500 కోట్లతో జేసీబీ విడి భాగాల తయారీ డూజోక్కో కంపెనీ, రూ.10 కోట్లతో కాఫీ ఫుడ్ ప్రాసెసింగ్ వంటి పరిశ్రమలు రావడం ద్వారా స్థానికంగా వందలాది మందికి ఉపాధి కలుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధిపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రత్యేక దృష్టి సారించారని రాజేష్ కొనియాడారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలోనే నియోజకవర్గంలో రూ.532 కోట్ల అంచనాతో పలు అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టారన్నారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీల కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేరా ట్రైబ్యునల్ టెక్నికల్ సభ్యురాలిగా విద్యుల్లత!

7వ పేజీ తరువాయి ..

కీలక బాధ్యత అప్పగించనుంది. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రేరా) ట్రైబ్యునల్ టెక్నికల్ సభ్యురాలిగా ఆమెను నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ)గా పనిచేస్తున్న విద్యుల్లత స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్) తీసుకోనుంది. తన సుదీర్ఘ ప్రభుత్వ సేవా కాలంలో ఆమె పట్టణాభివృద్ధి, నగర ప్రణాళిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి కీలక విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేసి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాజకీయాలకు అతీతంగా విధి నిర్వహణలో నిబద్ధత, పనితీరు, ఫలితాలపై దృష్టి సారించే అధికారిగా విద్యుల్లతకు మంచి పేరుంది. క్లిష్టమైన పట్టణాభివృద్ధి ప్రాజెక్టులు, ప్రణాళికా అంశాల్లో ఆమె చూపిన చొరవకు సహచర అధికారులు, ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు లభించాయి. రేరా ట్రైబ్యునల్‌లో టెక్నికల్ సభ్యురాలిగా ఆమె నియామకం జరిగితే, రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన వివాదాల పరిష్కారం, సాంకేతిక అంశాల పరిశీలన, పట్టణ ప్రణాళికకు సంబంధించిన కేసుల్లో ఆమె అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పరిపాలనలో సమర్థత, వృత్తిపరమైన నైపుణ్యానికి ప్రతీకగా నిలిచిన విద్యుల్లతకు ఈ బాధ్యత దక్కడం ఆమె సేవలకు లభించిన మరో గౌరవంగా భావిస్తున్నారు. రేరా ట్రైబ్యునల్ పనితీరు మరింత సమర్థవంతంగా మారడంలో ఆమె పాత్ర కీలకంగా ఉండనుందని అధికార వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

## తమలపాకుల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

(ఎస్. రాయవరం, జూన్ 16, ప్రభాత వార్త )



మండలం లోని పెనుగొల్లు గ్రామంలో ఇటీవల అకస్మాత్తుగా వచ్చిన ఈదురు గాలులకు నష్టపోయిన తమలపాకుల విషయం తెలుసుకున్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మంగళవారం బాధిత రైతులతో కలిసి పరిశీలించారు.ఇంత పెద్ద ఎత్తున నేలమట్టం అయి నష్టపోయిన తమలపాకుల తోటలను పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎం.అప్పలరాజు మాట్లాడుతూ రైతులు ఎకరానికి రెండున్నర లక్షల రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి,పంట ఫలసాయం చేతికి వచ్చే సమయంలో ఈవిధంగా తోటలు నేలమట్టం అవ్వడం చాలా బాధాకరం అన్నారు. తమలపాకుల తోటలను చిన్న పిల్లలను చూసి నట్లు అత్యంత జాగ్రత్తగా పెంచాలని, మిగతా పంటలు మీద పోల్చితే పెట్టుబడులు ఎక్కువగా అవుతున్నాయని తెలిపారు. ఈ విధంగా నష్టపోయిన తమలపాకుల రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే తీవ్రంగా నష్టపోయి భవిష్యత్తులో తమలపాకుల తోటలు పెంచలేరని తెలిపారు, ప్రస్తుతం పెట్టిన పెట్టుబడి పోయి, ఫలసాయం రాక, భూమి గల రైతులకు కౌలు కట్టలేక తమలపాకుల రైతులు వ్యవసాయం నుండి దూరం అయ్యే పరిస్థితిలు ఏర్పడుతున్నాయన్నారు.వెంటనే ప్రభుత్వం స్పందించి క్షేత్ర స్థాయిలో ఏ రైతుకు, ఎంత పంట నష్టపోయిన గుర్తించి నష్టపరిహారం ఎకరాకు యాభై వేల రూపాయలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.తమలపాకుల తోటలు కు ఉచిత పంటలు భీమా సౌకర్యం, రైతులకు రుణ సౌకర్యం, ఎరువులు సరఫరా అందచేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఏ.తాతాజీ, జీ.నూకరాజు, కె.గోవింద్,బి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక రంగ విశిష్టతను తెలుపుతూ..

విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించు కుని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగా వేడుకల్లో భాగంగా మంగళవారం ముడసర్లోవలోని ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో భారీ యోగా కార్యక్రమం నిర్వహించారు. పర్యాటక రంగ విశిష్టతను తెలుపుతూ.. యోగా ప్రాముఖ్యతను చాటి చెబుతూ జిల్లా యంత్రాంగం ఇప్పటికే రుషికొండ బీచ్, నావెల్ డాక్ యార్డు పరిధిలో కార్యక్రమాలు నిర్వహించింది. మంగళవారం గోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి అన్ని వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఏపీ ఆయిల్ అండ్ సీడ్స్ గ్రోవర్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సతీష్ కుమార్, జిల్లా అధికారులు, హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, గోల్ఫ్ క్లబ్ ప్రతినిధులు, పర్యాటక రంగానికి చెందిన ప్రముఖులు, విద్యార్థులు పాల్గొని యోగాసనాలు వేశారు. అనంతరం యోగా గురువులకు, ప్రజ్ఞ యోగా ప్రదర్శించిన చిన్నారులకు ఎంపీ, జిల్లా కలెక్టర్, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

### గతేడాది స్ఫూర్తితో 21న జరిగే కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలి : జిల్లా కలెక్టర్

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న అతికొద్ది గోల్ఫ్ కోర్సులలో ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ ఒకటని, ప్రస్తుతం దేశంలోనే ప్రముఖ గోల్ఫ్ కోర్సులలో ఒకటిగా గుర్తింపు పొందుతోందని గుర్తు చేశారు. అద్భుతమైన ఈ పర్యాటక ప్రదేశాన్ని మరింతగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించామని స్పష్టం చేశారు. గత ఏడాది ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో లక్షల మంది పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. ఈ ఏడాది కూడా యోగా వేడుకలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 21న విశాఖ బీచ్ రోడ్డులో వేలాది మంది ప్రజల భాగస్వామ్యంతో భారీ యోగా ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగా ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవడంతో పాటు విశాఖలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా యంత్రాంగం తరఫున పిలుపునిచ్చారు.

### యోగా ప్రయోజనాలను, పర్యాటక విశిష్టతలను తెలియజేయాలి :ఎంపీ శ్రీ భరత్

విశాఖపట్నం ఎంపీ శ్రీ భరత్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ వంటి అద్భుతమైన వేదికలో యోగా నిర్వహించడం ఆనందదాయకమన్నారు. యోగా ప్రాముఖ్యతను ప్రజల్లో చాటడంతో పాటు విశాఖపట్నంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను ప్రపంచానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ దేశంలోనే అత్యుత్తమ 18 హోల్ గోల్ఫ్ కోర్సులలో ఒకటిగా అభివృద్ధి చెందిందని, అంతర్జాతీయ ప్రమాణాలతో క్లబ్ హౌస్ నిర్మాణం పూర్తయిందని పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి గోల్ఫ్ క్రీడాకారులు ఇక్కడికి వస్తున్నారని, విశాఖపట్నం పర్యాటక ఆకర్షణను మరింత పెంచే సామర్థ్యం ఈ గోల్ఫ్ క్లబ్‌కు ఉందన్నారు. యోగా ప్రయోజనాలతో పాటు విశాఖలోని అందమైన పర్యాటక ప్రాంతాలను కూడా ప్రజలకు విస్తృతంగా పరిచయం చేయటంలో మీడియా కీలక పాత్ర పోషించాలని ఎంపీ కోరారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్ సెక్రటరీ ఎస్.వి.ఆర్.రాజు, వైస్ ప్రెసిడెంట్ టి.ఎస్. వర్మ, జనరల్ మేనేజర్ బ్రిగేడియర్ సత్య, లివింగ్ హార్ట్ స్కూల్‌కు చెందిన అరుణ కుమారి, డీఆర్డీఏ పీడీ, టూరిజం అధికారిణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రతిబింబిస్తూ...

విశాఖపట్నం, జూన్ 16 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, అలాగే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న "రెండేళ్ల నమ్మకం– అభివృద్ధి, సంక్షేమం" జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 19న ఏయూ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమ ఏర్పాట్లపై కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్ మీటింగు హాలులో సమీక్ష నిర్వహించారు. విశాఖ రీజియన్‌కు కేటాయించిన "పెట్టుబడులు ఉ పారిశ్రామిక వృద్ధి" అంశంపై ఈ కార్యక్రమం జరుగుతున్నందున, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసేలా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. వేదిక వద్ద ప్రోటోకాల్ నిబంధనలకు అనుగుణంగా డయాస్, సీటింగ్ ఏర్పాట్లు, వీఐపీ, వీవీఐపీ గ్యాలరీలు, స్వాగత ఏర్పాట్లు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. "పెట్టుబడులు ఉ పారిశ్రామిక వృద్ధి" అంశాన్ని ప్రతిబింబించేలా వివిధ శాఖల స్టాల్స్ ఏర్పాటు చేయాలని, జిల్లాలో గత రెండేళ్లలో జరిగిన పారిశ్రామిక అభివృద్ధి, ఆకర్షించిన పెట్టుబడులు, కల్పించిన ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ విజయాలను ఆకర్షణీయంగా ప్రదర్శించాలని సూచించారు. వేదిక వద్ద పారిశుద్ధ్యం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లు, వైద్య సేవలు, అగ్నిమాపక భద్రత, నిరంతర విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. గత రెండేళ్లలో ప్రభుత్వం సాధించిన ప్రధాన విజయాలు, విశాఖపట్నం జిల్లాలో అమలైన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలపై సమగ్ర సమాచారాన్ని సిద్ధం చేసి కార్యక్రమంలో ప్రదర్శించాలని చెప్పారు. కార్యక్రమానికి సంబంధించిన ప్రతి ఏర్పాటును ముందుగానే పూర్తి చేసి, శాఖల మధ్య సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, ఇన్చార్జి డీఆర్వో టి. గోవిందు, ఆర్డీవో దిలీప్ చక్రవర్తి, ఇతర శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అగనంపూడి జోన్‌లో పరిపాలన గాడి తప్పిందా..?

అగనంపూడి, ప్రభాతవార్త




ప్రజలకు మరింత చేరువగా పాలన అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అగనంపూడి జోనల్ కార్యాలయం ప్రస్తుతం తీవ్ర విమర్శల పాలవుతోంది. జోన్ ఏర్పాటు వల్ల అభివృద్ధి వేగవంతమవుతుందని, ప్రజా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు వ్యవస్థ లేకపోవడంతో కొంతమంది సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా హాజరుకావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు ఎప్పుడు వస్తున్నారు, ఎప్పుడు వెళ్తున్నారు అన్నదానిపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల కార్యాలయ పనితీరు దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు. జోనల్ కమిషనర్ స్థాయిలో పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన ఫైళ్లు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. టౌన్ ప్లానింగ్ విభాగంలో పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడం, ఇతర శాఖల్లోనూ ఖాళీలు అధికంగా ఉండటం వల్ల సాధారణ పనులకే ప్రజలు పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అగనంపూడి ప్రధాన రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ వంటి ప్రాథమిక సమస్యల పరిష్కారంలోనూ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వార్డు స్థాయిలో పర్యటనలు లేకపోవడం, సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించకపోవడం వల్ల ప్రజా సమస్యలు పేరుకుపోతున్నాయని అంటున్నారు. జీవీఎంసీ ఆదాయానికి కీలకమైన రెవెన్యూ విభాగం పనితీరుపైనా అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సిబ్బంది పనితీరును సమీక్షించి గాడిలో పెట్టాల్సిన అధికారులు స్పందించడం లేదని, దీంతో పరిపాలనా వ్యవస్థపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ కమిషనర్ అగనంపూడి జోనల్ కార్యాలయాన్ని సందర్శించి, వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలంటే జోనల్ కార్యాలయ పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

## పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

### అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎంపీ సీఎం రమేష్



పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎంపీ సీఎం రమేష్

అనకాపల్లి జూన్ 16 :(ప్రభాత వార్త) పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసి రావాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సీఎం రమేష్ అధికారులకు సూచించారు. అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయంలో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డా. సీఎం రమేష్ మంగళవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో వరుస సమీక్షా సమావేశాలు నిర్వహించారు.జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ ప్రాజెక్టులు, భవిష్యత్ మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై బీఎస్ఎన్ఎల్, రైల్వే, రెవెన్యూ, ఎన్‌హెచ్ఏఐ తదితర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల ఏర్పాటు, నెట్‌వర్క్ విస్తరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎటువంటి అంతరాయం లేకుండా పూర్తి స్థాయి మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులోకి వచ్చేలా అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనకాపల్లి నుంచి రాజమండ్రి దివాన్ చెరువు వరకు ప్రతిపాదిత సిక్స్– లైన్ జాతీయ రహదారి ప్రాజెక్టుపై ఎన్‌హెచ్ఏఐ అధికారులు , ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు.

## క్రీడల మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

### ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్



ఎలమంచిలి, జూన్ 16, ప్రభాతవార్త:

నియోజకవర్గంలో 28.50 కోట్ల క్రీడ మౌలిక సదుపాయాల ఏర్పాటుకు సానుకూలంగా చర్యలు తీసుకోవాలని భారత క్రీడా ప్రాధికార సంస్థ డీజీని కోరిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్. నియోజకవర్గంలోని యువతలో దాగివున్న క్రీడా ప్రతిభను వెలికితీయడంతో పాటు గ్రామీణ, తీర ప్రాంత క్రీడాకారులకు అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా సదుపాయాలు అందుబాటులో తీసుకురావాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ న్యూఢిల్లీలో భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయి) డైరెక్టర్ జనరల్ హరిరంజన్ రావు ఐఏఎస్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని అచ్యుతాపురం మండలం దెబ్బ పాలెం గ్రామంలో క్రీడా మౌలిక సదుపాయాల కొరత కారణంగా స్థానిక క్రీడాకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. క్రీడలను ప్రోత్సహించడం, యువతను ఆరోగ్యవంతమైన జీవన శైలి వైపు మళ్ళించడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ఆధునిక క్రీడా వసతులు అవసరమని అన్నారు. ఈ నేపథ్యంలో క్రీడా ప్రాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ ద్వారా కే లో ఇండియా పథకం కింద ఆన్లైన్ ఎండిఎస్డి పోర్టల్ లో సమర్పించిన నాలుగు ప్రధాన క్రీడా మౌలిక సదుపాయాలు ప్రాజెక్టులకు మొత్తం 28.50 కోట్ల అంచనా కి కేంద్ర ప్రభుత్వ తక్షణ పరిపాలన అనుమతులు మంజూరు చేసి అవసరమైన నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టులు అమలులోకి వస్తే నియోజకవర్గమే కాకుండా మొత్తం అనకాపల్లి జిల్లా సమగ్ర క్రీడా కేంద్రం గా అభివృద్ధి చెందుతుందని వేలాది మంది యువ క్రీడాకారులకు అత్యధిక శిక్షణా సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని సుందరపు విజయకుమార్ తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన భారత క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ జనరల్ హరిరంజన్ రావు ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## కేంద్రమంత్రి చంద్రశేఖర్‌ను కలిసిన ఎమ్మెల్యే సుందరపు

ఎలమంచిలి, జూన్ 16, ప్రభాతవార్త:



ఢిల్లీలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను మంగళవారం ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గల పెండింగ్ సమస్యలపై కేంద్ర మంత్రిత్వ చర్చించారు. దీనిపై కేంద్రమంత్రి నియోజకవర్గంలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## శిథిలమైన 'ఎర్రిగెడ్డ' వంతెన.. ప్రాణాలు పోయాకే అధికారులు కళ్లు తెరుస్తారా?

### ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది..? అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



బుచ్చయ్యపేట, జూన్ 16, ప్రభాతవార్త:

బుచ్చయ్యపేట మండలంలోని సీతయ్యపేట నుండి పెదపూడికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ఎర్రిగెడ్డ వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. సీతయ్యపేట –తోటకూరపాలెం – కన్నూరుపాలెం మీదుగా పెదపూడికి వెళ్లే ఈ మార్గం నిత్యం వందలాది మంది ప్రజలు, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు వినియోగించే కీలక రహదారి. అయితే ప్రస్తుతం వంతెన పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారడంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.వంతెనపై అనేక చోట్ల పగుళ్లు ఏర్పడటంతో పాటు కాంక్రీట్ పెచ్చులు ఊడిపోవడం, రక్షణ గోడలు దెబ్బతినడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వంతెన మరింత బలహీనపడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ఈ మార్గంలో ప్రతిరోజూ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో వంతెన పరిస్థితి స్పష్టంగా కనిపించక ప్రమాదాలకు ఆస్కారం మరింత పెరుగుతోంది. ఇప్పటికే పలుమార్లు స్థానికులు సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు."ప్రమాదం జరిగి ప్రాణాలు పోయిన తర్వాత స్పందిస్తారా..? లేక ముందుగానే చర్యలు తీసుకుంటారా ..?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భారీ ప్రమాదం జరిగేలోపు అధికారులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేపట్టాలని, అవసరమైతే కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు ప్రారంభించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ శిథిల వంతెనపై సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. లేకపోతే ఏ క్షణమైనా జరిగే ప్రమాదానికి బాధ్యత ఎవరిదనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

## అనితకు క్షమాపణ చెప్పాలంటూ గుడివాడ ఫ్లెక్సీపై కోడిగుడ్లు దాడి

చోడవరం, జూన్ 16, ప్రభాతవార్త:



రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పై, రాష్ట్ర మాజీ మంత్రి వైసిపి నాయకుడు గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచితమైన వ్యాఖ్యలను ఖండిస్తూ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం చోడవరంలో తెలుగుదేశం శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కొత్తూరు జంక్షన్ లో అమర్నాథ్ ఫ్లెక్సీ పై కోడిగుడ్లతో దాడి చేశారు. అమర్నాథ్ బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని దేశం శ్రేణిలు హెచ్చరించారు. చోడవరం నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు మండల పార్టీ అధ్యక్షులు కనిశెట్టి మచ్చిరాజు, టౌన్ పార్టీ అధ్యక్షులు చిన్న, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ నాగ గంగాధర్, పెద్ద అచ్చిబాబు, ఎంపీటీసీ కొట్టాపు రూపా దేవి చిన్న, టిడిపి యువసేన సకురు కోటేశ్వరరావు, గర్ల్స్ హై స్కూల్ చైర్మన్ సత్య సత్తిబాబు, ఈర్లి శ్రీనివాస్, నౌడు సుధాకర్, వరప్రసాద్, టిడిపి యువసేన అధ్యక్షులు గూనూరు ఎర్ర అప్పలనాయుడు, ప్రదీప్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హోం మంత్రికు అమర్నాథ్ తక్షణమే క్షమాపణ చెప్పాలి



( ఎస్. రాయవరం, ప్రభాతవార్త)

మండలంలోని తిమ్మాపురం శివారు కోనవానిపాలెం గ్రామంలో మంగళవారం తెలుగు మహిళలుహోంమంత్రి అనితపై వైసీపీ నేత గుడివాడ అమరనాథ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ,అమరనాథ్ ఫ్లెక్సీని కోడిగుడ్లతో కొట్టి నిరసన వ్యక్తం చేసిన అమర్నాథ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.గుడివాడ అమర్నాథ్ తక్షణమే క్షమాపణలు చెప్పాలన్నారు. కార్యక్రమం లో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మల్లపురెడ్డి రమాకుమారి, మాజీ ఎంపీపీ కే.వెంకటలక్ష్మి, మండల మహిళా అధ్యక్షులు మున్నిషాబేగం, కొమ్మిరెడ్డి నాగలక్ష్మ, జిల్లా టీడీపీ సెక్రటరీ గుడబంటి శాంతమ్మ, దుబాసి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌కు వాటర్ ఫిల్టర్, రేడియం స్టిక్కర్స్ అందజేసిన "హెటిరో"

(నక్కపల్లి, ప్రభాతవార్త )



సి ఎస్ ఆర్ నిధుల్లో భాగంగా సర్కిల్ పోలీస్ స్టేషన్ అవసరాలు గుర్తించి వాటర్ డిస్పెన్సర్ తో పాటు 20 బండిల్స్ రేడియం స్టిక్కర్స్ రోడ్డు భద్రత లో భాగంగా ఉపయోగపడేటట్లు హెట్టిరో చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి ఆదేశాల మేరకు సీఐ జూరెడ్డి మురళికి సంస్థ ప్రతినిధులు మంగళవారం అందజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహనదారులు గ్రహించే విధంగా ఈ రేడియం స్టిక్కర్స్ ఉపయోగపడతాయని అదే విధంగా వాటర్ ఫిల్టర్ స్టేషన్ కి వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అటువంటి సహకారాన్ని అందించిన యాజమాన్యానికి స్టేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు సన్ని బాబు , సాహిబా అంజుమ్, హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావు ,పలువురు కానిస్టేబుల్ లు ఉన్నారు.

## గాజువాకలో 339 ముసాయిదా పోలింగ్ కేంద్రాలు సిద్ధం

గాజువాక, జూన్ 16,ప్రభాతవార్త



గాజువాక నియోజకవర్గంలో 339 ముసాయిదా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు ఓటరు నమోదు అధికారి దయానిధి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. గతంలో 309 బూత్‌లు ఉండగా, 1200 కంటే ఎక్కువ ఓట్లు ఉన్న 107 రద్దీ బూత్‌లను గుర్తించామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం.. ఓటర్లకు 2 కిలోమీటర్ల పరిధిలోనే అందుబాటులో ఉండేలా మరో 30 కొత్త బూత్‌లను ప్రతిపాదిస్తూ ముసాయిదా రూపొందించినట్లు చెప్పారు. జూలై 21 తర్వాత ఈ జాబితాను విడుదల చేస్తామన్నారు. ఇప్పటికే బిఎల్‌ఓల ద్వారా 10 వేల మందికి పైగా ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేశారని తెలిపారు. సమావేశంలో ఏఈఆర్ఓ త్రినాథ్, డిప్యూటీ తహసీల్దార్ రవికాంత్ బిజేపి తరపున కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, టిడిపి తరపున సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు,జనసేన తరపున రౌతు గోవింద్,పల్లా రమణ,పప్పు రాజారావు,లక్కరాజు సోమరాజు( సోంబాబు) కాంగ్రెస్ తరపున జెర్రిపోతుల ముత్యాలు, ఎలక్షన్ డిటి సూర్యకళ,ధనలక్ష్మి,వైసీపీ, బియస్పి, సిపియం,తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ ఓటరు ఫారాల పంపిణీ

గాజువాక, జూన్ 16,ప్రభాతవార్త



గాజువాక అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా బాలచెరువు ప్రాంతంలోని 291వ నెంబర్ పోలింగ్ బూత్ పరిధిలో మంగళవారం ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. బీజేపీ గాజువాక అసెంబ్లీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగ రావు, కో-కన్వీనర్, సదరు బూత్ బీఎల్ఏ-2 జిలకర్ర భువనేశ్వరి దేవి కలిసి స్థానిక బూత్ లెవెల్ అధికారి నూర్‌తో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సరిచూస్తూ ఫారాలను అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించారు.

## పరదేశమ్మ అమ్మవారిని దర్శించుకున్న తిప్పల దేవాన్‌రెడ్డి

గాజువాక, జూన్ 16,ప్రభాతవార్త



జీవీఎంసీ 76వ వార్డు స్వతంత్ర నగర్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న శ్రీశ్రీశ్రీ పరదేశమ్మ గ్రామ దేవత పండుగ మహోత్సవాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస్ దేవాన్‌రెడ్డి పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షులు మంత్రి శంకర్ నారాయణ, పార్టీ నాయకులు గాలి బాబురావు, మిరియాల కామేష్, దాసరి రమణ, కటారి అప్పారావు, అప్పలనాయుడు, అచ్యుత్ రెడ్డి, ఎండా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 12వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

ఆరిలోవ జూన్ 16 ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం స్థానిక 12వ వార్డు ఆరిలోవలో మంగళ వారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబుతో పాటు జోనల్ కమిషనర్ శివప్రసాద్ కలిసి పూజా కార్యక్రమాలతో శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు నడుస్తుందని ఇందులో భాగంగా ఆరిలోవ దుర్గా నగర్ లో సిసి రోడ్లు తో పాటు బిటిఆర్ నగర్‌లో రిటైనింగ్ వాల్ నిర్మాణం కొరకు 80 లక్షల పైనే జీవీఎంసీ నిధులతో పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఒమ్మి సన్యాసిరావు, వార్డు అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు, వార్డ్ ఇంచార్జ్ గాడి సత్యం, వార్డ్ ప్రధాన కార్యదర్శి పోతిన భరత్, దువ్వి సంతోష్ కుమార్, పరదేశి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## 13వ వార్డు సాయినగర్‌లో మహా అన్నదానం

ఆరిలోవ, జూన్ 16, ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డు, సెక్టర్ - 4 సాయి నగర్ లో వెలసియున్న శ్రీ విఘ్నేశ్వర, దత్తాత్రేయ సహిత శ్రీ సమర్ధ సద్గురు సాయినాథ్ దేవాలయం యొక్క 8వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా టిడిపి యువ నాయకులు వెలగపూడి ప్రతాపరుద్ర హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనస్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహా అన్నదానం కార్యక్రమం ఆయన చేతులు మీదుగా ప్రారంభించి భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు శ్రీ మహాలక్ష్మి, విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి పొత్రకండ ధర్మారావు, వార్డు మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, సువ్వాడ శ్రీదేవి, ఎస్ ఆర్ వి వి ప్రసాద్, మాసాబత్తుల శ్రీను, కల్లూరి వెంకటేష్, కనకల శ్రీను, బొమ్మిడి వెంకటరమణ, ఆలయ కమిటీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం

గాజువాక, జూన్ 16,ప్రభాతవార్త



విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో మరణించిన కాంట్రాక్టు కార్మికుడు, టీడీపీ కార్యకర్త గోక్యాడ సూరిబాబు (52) కుటుంబానికి పార్టీ సంక్షేమ నిధి నుంచి రూ.5 లక్షల ప్రమాద బీమా అందజేశారు. సీతానగరంలోని సూరిబాబు నివాసానికి మంగళవారం స్థానిక కూటమి నాయకులు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో దేశ చరిత్రలోనే తొలిసారిగా మృతుడి కుటుంబంలో ఒకరికి 'పర్మినెంట్ ఉద్యోగం' ఇచ్చేలా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో 90 రోజుల్లోనే ఉద్యోగ నియామకం పూర్తి చేసి, 45 రోజుల్లో బీమా నగదు అందజేస్తామని వార్డు నాయకులు నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్య తదితరులు పేర్కొన్నారు.

## విద్యార్థులను శిక్షించొద్దు : గుప్తేశ్వరరావు

గాజువాక,జూన్ 16,ప్రభాతవార్త



అధ్యాపకులు విద్యార్థులను శిక్షించకుండా, వారి మనసు మార్చి స్వీయ ప్రేరణతో చదువుకునేలా చేయాలని ప్రముఖ విద్యావేత్త గుప్తేశ్వరరావు అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో అధ్యాపకులకు రెండు రోజులుగా నిర్వహించిన శిక్షణా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ.. విలియం గ్లాసర్ 'ఎంపిక సిద్ధాంతం' ప్రకారం విద్యార్థులకు క్లాస్‌రూమ్‌లో తగినంత ప్రేమ, గుర్తింపు, స్వేచ్ఛ లభించినప్పుడే వారిలో అంతర్గత ప్రేరణ కలిగి చదువులో రాణిస్తారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జూనియర్, డిగ్రీ, నర్సింగ్ కళాశాలల ప్రిన్సిపల్స్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, సిస్టర్ క్యాస్లిన్ 80 మంది అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుప్తేశ్వరరావును కళాశాల యాజమాన్యం సత్కరించింది.

## సురేశ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ భరత్

గాజువాక,జూన్ 16,ప్రభాతవార్త



ఒమన్ తీరంలో భారతీయ నౌకపై జరిగిన దాడిలో మృతి చెందిన పట్నాల సురేశ్ కుటుంబాన్ని ఎంపీ భరత్ మంగళవారం పరామర్శించారు. సురేశ్ భార్య భార్గవిని కలసి వివరాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. మృత దేహాన్ని స్వదేశానికి వేగంగా తీసుకొచ్చేం దుకు ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోం దని, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్య కూడా ఉన్నారు.

## 21న యోగా వేడుకలకు అందరూ ఆహ్వానితులే..

### జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్

విశాఖపట్టణం జూన్ 15 ప్రభాత వార్త



ఈ నెల 21వ తేదీ ఉదయం 6.00 నుంచి 7.00 గంటల వరకు విశాఖపట్టణం ఆర్కేబీచ్ వేదికగా జరిగే 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని తప్పక విచ్చేసి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ విజ్ఞప్తి చేశారు. మీడియా ప్రతినిధులు, జిల్లాలో ఉండే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పని చేసే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, రక్షణ దళాల్లో సేవలందించే ఉన్నతాధికారులు, ఉద్యోగులు, పోర్టు, రైల్వే, పోస్టల్ విభాగాల్లో పని చేసే ఉద్యోగులు, విద్యా సంస్థల నిర్వాహకులు, బోధకులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, సీనియర్ సిటిజన్లు, యోగా నిపుణులు, స్వయం సహాయ సంఘాల మహిళలు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిస్తూ మంగళవారం ఆయన ఆహ్వానం పలికారు.

## అమర్నాథ్ గౌడ్‌కు ఘన నివాళి

గాజువాక,జూన్ 16,ప్రభాతవార్త



వైకాపా నాయకుల పెట్రోల్ దాడిలో బలైన బాలుడు అమర్నాథ్ గౌడ్‌కు గాజువాక నియోజక వర్గ తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘన నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో బీసీ సెల్ అధ్యక్షుడు తమీర శివప్రసాద్ అధ్యక్షతన అమర్నాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో మహిళలు, వెనుకబడిన వర్గాలు, ఎస్సీ, ఎస్టీలపై అనేక అరాచకాలు, హత్యలు జరిగాయని మండిపడ్డారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఆ పార్టీ నాయకులు బలహీన వర్గాలను వేధిస్తూనే ఉన్నారని, వారికి రాజకీయంగా భూస్థాపితం చేయాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దొడ్డి సత్యారావు, సింగూర్ అనంత్, వియ్యపు కొండబాబు, పోతిన వెంకట్రావు, సింగంపల్లి దేవుడు, దువ్వి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

### 21న ఆర్కేబీచ్ వేదికగా నిర్వహించే కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి- సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం జూన్ 16 ప్రభాతవార్త



12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం-2026 సంద ర్భంగా జిల్లాలో నిర్వహించ తలపెట్టిన యోగాంధ్ర వేడుకలను విజయ వంతంగా జరిపించేందుకు అన్ని శాఖలు సమన్వయం తో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో పలు థీమాటిక్ యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ ఇప్పటికే జూన్ 11న నావల్ డాక్‌యార్డ్‌లో మాజీ సైనికులు, రక్షణ సిబ్బంది కోసం యోగా కార్యక్రమం, జూన్ 12న రుషికొండ బీచ్‌లో పర్యాటక యోగా, జూన్ 16న ముడసర్లోవ ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో మరో యోగా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రధాన కార్యక్రమాన్ని జూన్ 21న ఆర్‌కే బీచ్‌లో కాళీమాత ఆలయం నుంచి విక్టరీ ఎట్ సీ వరకు ఉదయం 6.00 నుంచి 7.00 గంటల మధ్యలో భారీ స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనిలో పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి నోడల్ అధికారులు, వేదిక ఇన్‌చార్జ్‌లు వారి బాధ్యతలను పక్కాగా నిర్వర్తించాలని చెప్పారు. సమీకరణ, ప్రచారం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రత, వైద్య సేవలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత శాఖలకు సూచించారు. యోగాను ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాల్లో జిల్లావాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, ఇన్ఛార్జి డీఆర్వో టి. గోవిందు, ఆర్డీవో దిలీప్ చక్రవర్తి ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకగ్రీవంగా గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఎన్నికలు

పద్మనాభం,జూన్16,ప్రభాతవార్త



మండలంలో వెంకటాపురం, రేవిడి, చిన్నాపురం, విజయానందపురం గ్రామాలలో ఉన్న గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల ఎన్నికలు మంగళవారం ఏకగ్రీవం అయ్యాయని మండల పశువైద్య అధికారి భాస్కరరావు చెప్పారు. చిన్నాపురం సంఘానికి అధ్యక్షునిగా ఎన్ అప్పలరాము, ఉపాధ్యక్షుడుగా పి ఆదినారాయణ, కార్యదర్శిగా కె పెంటయ్య, రేవిడి సంఘానికి అధ్యక్షుడిగా ఎ రాము, ఉపాధ్యక్షుడుగా జి.సన్యాసి, కార్యదర్శిగా పి.రాజారావు, వెంకటాపురం సంఘానికి అధ్యక్షుడిగా జి బంగారరాములు, ఉపాధ్యక్షుడుగా పి సన్నిబాబు, కార్యదర్శిగా ఎన్ శ్రీను, విజయానందపురం అధ్యక్షుడిగా పి అప్పలనాయుడు, ఉపాధ్యక్షుడుగా ఎస్ పరదేశి, కార్యదర్శిగా పి సన్యాసిరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. ఈ మేరకు వారికి పత్రాలు అందజేసారు.

## గ్రామాభివృద్ధికి అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించాలి..

పద్మనాభం, జూన్ 16,ప్రభాతవార్త



మండలంలో ఉన్న గ్రామ పంచాయతీల అభివృద్ధికి పక్కా ప్రణాళికలను రూపొందించాలని ఎంపీపీ కె.రాంబాబు అధికారులను కోరారు. మం గళవారం మండల పరిషత్ సమావేశ మంది రంలో జిపిడిపి అభివృద్ధి ప్రణాళిక ముసాయిదాపై ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. గ్రామ రాబడిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు పక్కా ప్రణాళికలను తయారు చేసుకోవాలని ఆయన అన్నారు. అనంతరం గ్రామాభివృద్ధి ప్రణాళికపై గ్రామ కార్య దర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండిఒ బి.చిన్నారావు, ఈఒఆర్డి బివి రమణ పాల్గొన్నారు.

## సంక్షేమం...ప్రగతిలో ఏపీ సరికొత్త చరిత్ర

గాజువాక,జూన్ 16 ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వ రెండేళ్ల నమ్మకమైన పాలనతో దేశంలో ఏపీ బ్రాండ్ విలువ మళ్లీ పెరిగిందని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే పీలా గణబాబు అన్నారు. శ్రీహరిపురంలో నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం- అభివృద్ధి-సంక్షేమం' కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 16,525 మందికి ప్రతి నెలా రూ.7.32 కోట్ల పెన్షన్లు, 'తల్లికి వందనం' కింద 23,250 మంది తల్లుల ఖాతాల్లో రూ.30.25 కోట్లు జమ చేశామన్నారు. గోపాలపట్నం, ములగాడ పరిధిలోని 8,000 మందికి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలు సిద్ధం చేశామని, త్వరలోనే సీఎం చేతుల మీదుగా అందిస్తామని చెప్పారు. కూటమి చొరవతో గూగుల్, టీసీఎస్ వంటి ఐటీ దిగ్గజాలు విశాఖకు వచ్చాయని, తాత్కాలిక భవనంలో రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## వేధింపులపై విద్యార్థినులకు అవగాహన

గాజువాక,జూన్ 16,ప్రభాతవార్త



మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ మహిళా జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థినులకు హార్బర్ సబ్ డివిజన్ 'శక్తి' బృందం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డా. శంఖ బ్రత బాగ్చి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థినులకు సైబర్ నేరాలు, పోక్సో, యాంటీ ర్యాగింగ్ చట్టాలు, ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో 'శక్తి యాప్' ద్వారా పోలీసుల సహాయం ఎలా పొందాలో వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి. శ్రీను, శక్తి టీమ్ ఇన్‌చార్జ్ కె. ఇంద్రావతి పాల్గొన్నారు.

## పద్మనాభం మండలంలో రైతుసేవా కేంద్రాలకు చేరిన వరి విత్తనాలు

పద్మనాభం,జూన్ 16, ప్రభాతవార్త



పద్మనాభం మండలంలో పలు గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలకి పలు రకాల వరి విత్తనాలు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం వరి విత్తనాలను రైతులకు అందు బాటులో ఉంచడం ముందుస్తుగా ఉంది.దీంతో రైతులు కూడా నారు మడులను దుక్కులు దున్ని సిద్ధం చేస్తున్నారు. అయితే వరి విత్తనాలు ధరలు త్వరలోనే ప్రకటిస్తారని మండల వ్యవసాయ అధికారి సింహాచలం చెప్పారు. అలాగే భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అనుమతితో త్వరలోనే విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన అన్నారు. అయితే ప్రైవేటు దుకాణ దారులు కూడా మండలంలో పలు గ్రామాలలో విక్రయాలు విత్తనాలను సిద్ధం చేసారు.

## మహిళా మంత్రిని కించపర్చిన మాజీ మంత్రి అమరనాథ్‌పై చర్యలు తీసుకోవాలి..

పద్మనాభం, జూన్ 16,ప్రభావార్త



రాష్ట్ర హోంమంత్రి వి అనితను అసభ్యకరమైన పదజాలంతో స్త్రీ జాతిని అవమానించే విధంగా మాట్లాడిన మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ పై కేసునమోదు చేయాలని రాష్ట్ర కాపు కార్పోరేషన్ డైరెక్టర్ కె.లీలావతి, భీమిలి ఎఎంసి డైరెక్టర్ వి.నందిని,కృష్ణాపురం ఎంపిటీసీ కె లక్ష్మి మంగళ వారం పద్మనాభం సిఐ శ్రీధర్‌కి ఫిర్యాదు అందజేసారు. దళిత మహిళా మంత్రి అనితను అవమా నించడం నైతికంగా తప్పుని,మేకప్ వేసుకొని, వాడేసిన కార్లపై తిరుగుతున్నారని వ్యక్తిగతంగా హేళనచేసి మాట్లాడటం సరైనది కాదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ట్రస్ట్ సభ్యులు కె.దామోదరరావు,నాయకులు ఎర్రినాయుడు, గంగరాజు, పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ విఘ్నేశ్వర, దత్తాత్రేయ,శ్రీ సద్గురు సాయినాథ్ ఆలయ వార్షిక వేడుకలు

ఆరిలోవ, జూన్ 16, ప్రభాతవార్త



స్థానిక 13వ వార్డు ఆరిలోవ సాయి నగర్ ఉన్న శ్రీ విఘ్నేశ్వర,శ్రీ దత్తాత్రేయ,శ్రీ సద్గురు సాయినాథ్ ఆలయ వార్షిక వేడుకలు వైభవంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మహోత్సవాలకు విశిష్ట అతిథిగా తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావుతో పాటు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.వి.నారాయణ హాజరయ్యారు. వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్ కమిటీ సభ్యులు మేళతాలాలతో సాధర స్వాగతం పలికారు. వారికి ఆలయ పూజారి గోత్రనామాలతో పూజ నిర్వహించారు.రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్య దర్శి వానపల్లి ఈశ్వరరావు,రాష్ట్ర బిసి విభాగం కార్యదర్శి సత్యాల సాగరిక,వానపల్లి మంగరాజు, బేతా దుర్గా రావు,సురేష్,ప్రసంగి వాసు, బీబీ, కొండమ్మ సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం జయప్రదం చేయండి

### విశాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, అరుణ కుమారి

విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త



అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం జయప్రదం చేయండి అని విశాఖపట్నం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ అరుణ కుమారి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం అల్లిపురం చేరువలో పి భూపేష్ నగర్‌లో యాక్షన్ ఎయిడ్ సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్ నేతృత్వంలో గృహ కార్మికుల నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా జూన్ 16న గృహ కార్మికుల దినోత్సవం నిర్వహించాలని ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ ప్రకటించింది అన్నారు. గృహ కార్మికుల సమస్యలు ఏమి ఉన్నా పరిష్కారించడానికి చట్టాలు ఉన్నాయి అని వివరించారు. గృహ కార్మికు లందరూ ఈశ్రమ్ కార్డులు పొందాలని కోరారు. కార్మికులకు రక్షణగా లేబర్ డిపార్ట్మెంట్ ఉందని ఆమె వివ రించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పాల్గొని మాట్లాడారు.

## 23న శ్రీకుంచుమాంబ అమ్మవారి పండుగ

విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త



23న జరగనున్న శ్రీ కుంచుమాంబ అమ్మవారి పండుగ నిర్వాహణ ఏర్పాట్లు, తద్వారా ఏర్పడే శాంతిభద్రతల సమస్యలను తెలుసు కోవడానికి ఎయిర్పోర్ట్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ శంకర నారాయణ, సబ్ ఇన్స్పెక్టర్ కార్తీక్ మాధవదార గ్రామాన్ని సందర్శించి పరిశీలించారు. మాధవదార పండుగ ఊరేగింపు రూట్, సమయాలను పండగ కమిటీ ఛైర్మన్ పోలీసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ కంచరాన రమేష్, సనపల ఉమాపతి, పూజారి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఆనందపురం, జూన్ 16, ప్రభాతవార్త



విశాఖపట్నం జిల్లా ఆనంద పురం మండలం బోని గ్రామపం చాయతీ పరిధిలోని రాముని పేట గ్రామంలో వెలసిన శ్రీ అభయాం జనేయ స్వామి ఆలయ 16వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. వేడుకల సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో బోని శ్యామ్, జయశ్రీ దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. బోని అప్పలనాయుడు, బోని సన్నాసినాయుడు, సురాల సత్యవర ప్రసాద్, హేమంత్ కుమార్, రామునిపేట గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, పాల్గొన్నారు.

## విశాఖ జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ

### ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ అభిశిక్త్ కిషోర్ -డిఈవోలు, ఎంఈవోలకు స్పష్టమైన ఆదేశాలు -కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేసిన జర్నలిస్ట్ సంఘాల నేతలు

విశాఖపట్నం, జూన్ 16 ప్రభాత వార్త



విశాఖ జిల్లాలో ఉన్న అర్హులైన జర్నలిస్టుల పిల్లలందరికి 50 శాతం ఫీజు రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు మంగళవారం రాత్రి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేరిట ఈ ఉత్తర్వులను విడుదల చేశారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రతీ ఏటా ప్రయివేటు స్కూల్స్‌తో పాటు పలు కళాశాలల్లోనూ ఫీజు రాయితీ కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా ప్రయివేటు స్కూల్స్ యాజమాన్యాలు జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుంది. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా జిల్లాలో జర్నలిస్టుల పిల్లలకు స్కూలు ఫీజులో 50శాతం రాయితీ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ , ఏపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ లుజిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్‌ను కలిసి విజ్ఞప్తి చేయడం జరిగింది. దీంతో జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ మేరకు అన్ని ప్రయివేటు స్కూల్స్ విధిగా జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పించాలని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇందుకు సంబంధించి డిఇవోలు, ఎంఈవోలకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తాజాగా జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం అన్ని ప్రయివేట్ స్కూల్స్ యదాతథంగా జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి , ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు కోరారు. అలాగే తాము కోరిన వెంటనే ఉత్తర్వులు జారీ చేసినందుకు జిల్లా కలెక్టర్‌కు వీరు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు వీరికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యదర్శి జి శ్రీనివాస్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి రవికుమార్,ఉపాధ్యక్షులు శివప్రసాద్ నగేష్, కృష్ణమూర్తి బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వరరావు, మదన్, స్మాల్ పేపర్స్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్మోహన్, శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బొబ్బర్ ప్రసాద్, ఆనంద్, అరుణ్ భాస్కర్, రాజశేఖర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

vsp10:vsp10.qxd 16-06-2026 21:11 Page 1






## విజయభేరి సభ ఏర్పాట్లను పరిశీలించిన కూటమి నేతలు

అనకాపల్లి, జూన్ 16 ,(ప్రభాత వార్త):



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయవంతమైన పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా జూన్ 17 బుధవారం ఉదయం 10 గంటలకు అనకాపల్లి ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న విజయభేరి జిల్లా స్థాయి భారీ బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం కూటమి నేతలు పరిశీలించారు. జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్కీ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు పరిశీలించారు. మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు సభా ప్రాంగణాన్ని సందర్శించి సభకు హాజరయ్యే ప్రజలకు అవస రమైన సౌకర్యాలపై అధికారులను, నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పార్కింగ్, భోజన వసతులు, తాగునీటి సదుపాయాలు, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించి తగిన సూచనలు చేశారు. పట్టణ కూటమి ఇంచార్జులు, నాయకులు పాల్గొని సభ విజయవంతానికి అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు.

## గ్రామాల్లో ఓటర్ల జాబితా పరిశీలన.!



(నక్కపల్లి, ప్రభాతవార్త):

మండలంలోని తాసిల్దార్ చిన్ని కృష్ణ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితా పరిశీలన ఆయా బిఎల్ఓ లు ఇంటింటికి వెళ్లి పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పెద్ద తీనార్ల, రాజయ్యపేట గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో ఈ కార్యక్రమం మంగళవారం మొదలుపెట్టారు. ముందుగా బిఎల్వోలు సమక్షంలో పరిశీలన చేసిన అనంతరం ఇంటింటికి ఓటర్ల జాబితా ఆధారంగా వెళ్తున్నారు. కార్యక్రమంలో భాగంగా రాజయ్యపేట గ్రామంలోని 188 బూత్ నెంబర్ పరిధిలో ఇంటింటికి ఓటర్ పరిశీలన నిర్వహించారు. పెద్ద తీనార్ల గ్రామంలో రెవెన్యూ కార్యదర్శి సమక్షంలో ఓటర్ల జాబితా క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం రాజకీయ పక్షాలు పలు సూచనలు చేశారు. ఇంటింటి పరీక్షల్లో వీఎల్వోలు పిక్కి బుజ్జి, శివాజీ, పిక్కి శ్రీను, పిక్కి చిన్నారి , యజ్జల అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఎంపిటీసీ మెరుగు నాగేశ్వరరావు, గోసల చిన్న తాతారావు, దేవుడు, పిక్కి గంగరాజు, గ్రామ శాఖ అధ్యక్షులు, దైపల్లి శ్రీను, తదితరులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు కాపాడుకోవాలంటే బిఎల్ఓలకు సహకరించాలని ప్రజలను కోరారు.



## అమర్నాథ్ పై విమర్శనలు మానుకోవాలి : వైసీపీ



అనకాపల్లి , జూన్ 16 (ప్రభాత వార్త) :

తాతల నాటి నుంచి రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన నాయకుడు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పై విమర్శనలు మానుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు కు, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీకి వైసిపి నాయకులు తీవ్రంగా హెచ్చరించారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో మంగళవారం వైసీపీ పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుడివాడ అమర్నాథ్ మంత్రిగా ఉన్న సమయంలో అనకాపల్లి ని అందాలపల్లిగా తీర్చిదిద్ది అనేక అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. మంత్రి అనిత ప్రతిపక్ష నాయకులపై వ్యాఖ్యలు చేయకుండా తమ మంత్రి హోదాతో గౌరవంగా మాట్లాడి లాన్‌ఆర్డర్ ను కాపాడాలని సూచించారు. ఒక గ్రామ స్థాయిలో సర్పంచ్‌గా గెలవలేని గల్లి నాయకుడు కోట్ని బాలాజీ కి అమర్నాథ్ ను విమర్శించే స్థాయి లేదన్నారు. చంద్రబాబు వద్ద మార్కులు కొట్టడానికి ఇటువంటి నీచ విమర్శ నలు చేయడం తగదన్నారు. అమర్నాథ్‌పై విమర్శనలు వెనక్కి తీసుకోకపోతే పరిస్థితులు చాలా తీవ్రంగా ఉంటాయని డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీకి హెచ్చరించారు. వైసీపీ పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, వైసిపి నాయకులు గొర్లి సూరిబాబు, కొణతాల మురళీకృష్ణ, దంతులూరి శ్రీధర్ రాజు, జాజుల రమేష్, కెఎం నాయుడు, బొడ్డేటి శివ, గొల్లవెల్లి శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి గోవింద పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న పూర్వ విద్యార్థికి ఆర్థిక సహాయం

అగనంపూడి, ప్రభాత వార్త :



మానవత్వం చాటుకున్న 1993-94 పదో తరగతి బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు. పరవాడ :జూన్ 16:అనకాపల్లి జిల్లా పరవాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1993-94 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు తమ స్నేహ బంధాన్ని మరోసారి చాటుకున్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ సహ విద్యార్థి గుర్రం బాబూరావుకు ఆర్థిక చేయూత అందించి మానవత్వాన్ని చాటారు. 1993-94 బ్యాచ్‌కు చెందిన గుర్రం బాబూరావు ఇటీవల అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు స్పందించారు. బ్యాచ్ మిత్రులు అంతా కలిసి విరాళాలు సేకరించి మొత్తం రూ.35,000 నగదును బాబూరావుకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ, కష్టకాలంలో స్నేహితుడికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావించామని తెలిపారు. భవిష్యత్తులో కూడా అవసరమైతే మరింత సహాయం అందిస్తామని పేర్కొన్నారు. ఆర్థిక సహాయం అందుకున్న గుర్రం బాబూరావు, తనకు అండగా నిలిచిన సహ విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాల తర్వాత కూడా తమ స్నేహాన్ని గుర్తు చేసుకుంటూ సహాయం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.స్కూల్ రోజుల్లో ఏర్పడిన స్నేహం కాలగమనంలోనూ చెదరిపోకుండా, ఆపదలో ఉన్న మిత్రుడికి అండగా నిలిచిన 1993-94 బ్యాచ్ విద్యార్థుల సేవా భావం అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో బుగిడి రామ గోవిందరావు, చిరికి లోకేష్, పైలా రాము, రెడ్డి గోపి, కూతా తిరుపతి అప్పన్నరెడ్డి, బండారు జోగినాయుడు, బండారు సోమునాయుడు, మైలపల్లి నరసింహరాజు, అనకాపల్లి నారాయణరావు, మోటూరు వీరునాయుడు పాల్గొన్నారు.

## అమర్నాథ్ మాట్లాడితే హుందాగా ఉండాలి : ఎంపిటిసి మధు



( నక్కపల్లి రూరల్ ,అడ్డురోడ్డు, ప్రభాతవార్త ) :

ఒక రాష్ట్రానికి మంత్రిగా పనిచేసిన వ్యక్తి దిగజారుడు రాజకీయా లకు వెళ్లి దిగజారుడు వ్యాఖ్యానాలు చేయడం తన హుందాతనానికి మంచిది కాదని ,మహిళలను గౌరవించడం నేర్చుకోవాలని మండలంలోని వేంపాడు ఎంపీటీసీ , న్యాయవాది కుంచె మధు అన్నారు. మంగళవారం వేంపాడు గ్రామంలో రాష్ట్ర హోం మంత్రి అనిత పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తీరు మార్చుకోవాలని కోరుతూ నిరసన తెలిపారు. మధు మాట్లాడుతూ మహిళల పట్ల కనీస గౌరవం లేకుండా,బహిరంగంగా చేతిలో మైకు ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే రాష్ట్రంలో మహిళలు చూస్తూ ఊరుకోరని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి ని చూడలేక ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని, దమ్ముంటే అనిత పై రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ హుందా లేని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.తక్షణమే హోమ్ మంత్రి అనితకు అమర్నాథ్ బహిరం గంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ నక్కపల్లి మండల ఉపాధ్యక్షుడు అయినంపూడి అప్పలరాజు, మండల తెలుగు యువత అధ్యక్షుడు కమ్మిళ శివరామకృష్ణన్ రాజు,గ్రామ శాఖ అధ్యక్షుడు కల్లేపల్లి వెంకటపతి రాజు,పల్లా రాంబాబు, డైరెక్టర్ దారబాల బుజ్జి,పల్లా నాగరాజు,సబ్బు రాజు,కాండ్రకోట చిన్న అప్పన్న,కమిడి వెంకటరమణ,ఇసరపు పాపారావు,కమిడి బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

## అనధికారిక మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

ఎలమంచిలి, జూన్ 16, ప్రభాతవార్త:



పట్టణంలోని పింజేరువు వద్ద అనధికారిక మట్టి తవ్వకాలపై ఇరిగేషన్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం శ్రీ కనకమహాలక్ష్మి పింజేరువు ఆయు కట్టు రైతుసేవా సంఘం సభ్యులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కమిటీ అనుమతులు లేకుండా ధర్మవరం గ్రామానికి చెందిన కొందరు మట్టిని అనధికారకంగా తవ్వుతున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## గత వైసీపీ పాలనలో బీసీలపై అన్యాయాలు జరిగాయి

### టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు

(నక్కపల్లి, ప్రభాతవార్త )జూన్ 16:



గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతి భద్రతలు దెబ్బతిన్నాయని, ప్రశ్నించిన వారిపై దాడులు చేయడంతో పాటు అక్రమ కేసులు నమోదు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు ఆరోపించారు. మంగళవారం రాష్ట్ర హోంమంత్రి క్యాంప్ కార్యాల యం వద్ద బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు విషయాలు చర్చించారు. సభలు, సమావేశాల్లో నా బీసీలు, ఎస్సీలు, ఎస్టీల సంక్షేమం గురించి మాట్లాడినప్పటికీ, ఆ వర్గాలకు న్యాయం చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రేపల్లె నియోజకవర్గానికి చెందిన అమర్నాథ్ గౌడ్ అనే పదో తరగతి విద్యార్థి హత్య ఘటనను ప్రస్తావిస్తూ, ఆ సంఘటన జరిగి మూడేళ్లు పూర్తయ్యాయని గుర్తు చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ అనంతబాబుకు డ్రైవర్‌గా పనిచేసిన సుబ్రహ్మణ్యం హత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిందన్నారు.బీసీ వర్గాలకు చెందిన ప్రముఖ నాయకులు అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు వంటి వారిని రాజకీయంగా ఇబ్బందులకు గురిచేసేందుకు అప్పటి ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు.గత పాలనలో అనేక దారుణ ఘటనలు చోటుచేసుకున్నాయని, ప్రజలు వాటిని మరచిపోలేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. పలువురు బీసీ నాయకులు కురం దాసు నూకరాజు, దేవర సత్యనారాయణ, గింజల లక్ష్మణరావు ,వైబోయిన వెంకటరమణ, గోసల శ్రీకాంత్, తాతారావు ,మునిషా బేగం, కాశీ విశ్వనాథ్, లింగం నాయుడు, మెరుగు నాగేశ్వరరావు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విమర్శలు చేయడానికి హద్దు ఉండాలి

### వ్యక్తిగతంగా విమర్శలు చేస్తే సహించేది లేదు : మాజీ ఎంపిపీ బోదుపు గోవిందు

ఎలమంచిలి, జూన్ 16, ప్రభాతవార్త:



పట్టణంలోని వైఎస్ఆర్పిపి కార్యాలయంలో మంగళవారం మాజీ ఎంపీపీ, వైఎస్ఆర్పిపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ బోదుపు గోవింద్ పత్రికా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోవిందు మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి అనిత మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని వ్యక్తిగతంగా విమర్శించడం తీవ్రంగా ఖండిస్తున్నామని ఇలాంటివి రాజకీయంలో చేయడం చాలా దురదృష్టకరమని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు సంవత్సరాల్లో ప్రజలకు చేసిందేమీ లేదని కనీసం ఉపాధి అవకాశాలు కూడా కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదని, వాటిని అమలు చేసే దిశగా చర్యలు చేపట్టాలని ప్రతిపక్ష నాయకుల మీద ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం ఎంతవరకు సబమని అన్నారు. ఎంతో రాజకీయ అనుభవం గల కుటుంబం నుండి వచ్చిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పట్ల హోం మంత్రి అనిత మాట్లాడదాం దురదృష్టకరమని అన్నారు. వ్యక్తిగత విమర్శలు మానుకుని రాష్ట్ర అభివృద్ధికి మీరు ఏం చేస్తున్నారో దానిని దృష్టిలో పెట్టుకోవాలని, ప్రతిదీ ప్రజలు గమనిస్తున్నారని త్వరలోనే మీకు బుద్ధి చెప్పే రోజులు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, గుప్త, వైఎస్ఆర్పిపి జాయింట్ సెక్రెటరీ బొద్దపు ఎర్రయ్య దొర, వైఎస్ఆర్పిపి మండల పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, నాయకులు డాక్టర్ త్రినాథ్, మండల యూత్ అధ్యక్షులు వర్మ, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రానికి స్టేషనరీ వితరణ

అనకాపల్లి జూన్ 16 (ప్రభాత వార్త):



గరపాలెం శతకం పట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ శాశ్వత చైర్మన్, ప్రముఖ నిర్మాత కాండ్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో తమ సొంత నిధులతో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా జీవీఎంసీ అప్పర్ ప్రైమరీ స్కూల్, పల్లపు వీధి అంగన్వాడి కేంద్రం 50 మంది విద్యార్థిని విద్యార్థులకు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు పునర్ ప్రారంభించిన సందర్భంగా విద్య సంవత్సరం సరిపడ్డ పలకలు, పుస్తకలు, పెన్నులు, పెన్సిల్లు, స్కేలు, అన్నదానం, మొదలు వాటిని మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ గౌరీ పరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ మరిడిమాంబ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు



ఎలమంచిలి, జూన్ 16, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఏపీ సి ఎన్ఎఫ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జిల్లా డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చన్న ఆధ్వర్యంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షులు రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చన్న పకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, పి ఎం డి ఎస్ వినియోగం ద్వారా కలిగే ప్రయోజనాలు, కషాయ ద్రావణాల తయారీ, వినియోగం, బయో రిసోర్స్ సెంటర్లు పాత్ర ఉపయోగాలు గురించి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల ఆరోగ్య పరిరక్షణతో పాటు భూమి సారవంతం అవుతుందని, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలియజేసి రైతులందరూ ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గోపి,వ్యవసాయ శాఖ, ఎంపీడీవో, ఏవో మోహన్ రావు, ప్రకృతి వ్యవసాయ శాఖ, వెలుగు శాఖ, ఉపాధి హామీ పథకం సిబ్బంది మండల నాయకులు జనసేన పార్టీ అధ్యక్షులు అన్నం బాబ్జి, లాలం సోమినాయుడు, కొలగాని భాస్కర్, ఏపీ సీ ఎన్ ఎఫ్ సిబ్బంది, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## గుడివాడ అమర్నాథ్ ఫొటోపై కోడిగుడ్లతో దాడి

అనకాపల్లి , జూన్ 16, (ప్రభాత వార్త):



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర గల పోలమాంబ గుడి జంక్షన్ లో టిడిపి మహిళ రాష్ట్ర కార్యదర్శి కొణతాల రత్నకుమారి ఆధ్వర్యంలో స్థానిక తెలుగు మహిళానాయకులు,కార్యకర్తలతో మాజీమంత్రి అమర్నాథ్ ఫొటోపై గుడ్లుతో దాడి చేశారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ హోమ్ మంత్రి వంగలపూడి అనిత మీద అనుచిత వ్యాఖ్యలు చేసి స్త్రీ జాతి తల దించుకునేట్టు చోడవరం మీటింగ్‌లో పేబ్యాచ్‌తో చప్పట్లు కొట్టించుకొని వెకిలి గా నవ్వుతూ ప్రగల్బాలు పలికారు. దళిత మహిళ, హోమ్ మినిస్టర్, విపత్తుల నిర్వహణ శాఖ మేనేజమెంట్ తెలుగుదేశం పార్టీ నాయకురాలుగా, పాయకరావుపేట శాసనసభ్యురాలుగా మహిళా లోకం గర్వించదగ్గ స్త్రీ శక్తి గా కొనసాగుతున్నటువంటి ఆమె పై ఒక ఫెయిల్యూర్ మినిస్టర్ కేవలం పానీపూరి షాప్ నూడిల్స్ కొట్టు ఓపెనింగ్ లకు మాత్రమే ప్రారంభించిన చేతకాని అమర్నాథ్ నోరుంది కదా అని ఆడవాళ్ల మేకప్ గురించి మాట్లాడుతూ కిలోల కొలది పుట్టీలు వేసుకుని మీటింగ్ లకు వస్తున్నారని అసభ్యకరమైన వాఖ్యలు చేసినందుకు మహిళలు కి వెంటనే క్షమాపణ చెప్పాలి అని డిమాండ్ చేశారు. భారతీయ సాంప్రదాయం పండుగలు, ఫంక్షన్‌లకి వేసుకొని కాళీకామాతకి ఇష్టమైన అలంకరణ ను ప్రతి మహిళా అలంకరణ చేసుకొని అమ్మ వారి కృప కి పాత్రులు కావాలి అని ప్రతి మహిళ ఇష్టపడుతుంది అని రత్నకుమారి తెలిపారు.

## యువత భవిష్యత్తుకు డ్రగ్స్ శాపం

### అనకాపల్లిలో భారీ 'మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన ర్యాలీ



అనకాపల్లి , జూన్ 16 (ప్రభాత వార్త):

సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించి, యువతను వ్యసనాలకు దూరం చేయడమే లక్ష్యంగా అనకాపల్లి జిల్లా పోలీసు యంత్రాంగం , జిల్లా ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా , అనకాపల్లి డి.ఎస్.పి ఎం.శ్రావణి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం వద్ద ప్రారంభమైన ఈ భారీ ర్యాలీ, పట్టణ ప్రధాన వీధుల గుండా సాగుతూ ఫోర్ రోడ్ జంక్షన్ వరకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, టౌన్ సిఐ ప్రేమ కుమార్, సీఐలు వెంకట నారాయణ, అశోక్ కుమార్, గోవింద రావు ఎస్పై శ్రీనివాస రావు లతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ మత్తు పదార్థాల బారిన పడి బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని యువతకు పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని కోరారు. వ్యసనాల నుంచి విముక్తి పొందడానికి జిల్లా ఆసుపత్రిలోని విముక్తి కేంద్రాన్ని (టోల్ ఫ్రీ నెంబర్: 1972) సంప్రదించవచ్చని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## నేడు ఉపమాకలో యోగాంధ్ర

### హోం మంత్రి అనిత, ఎంపీ, కలెక్టర్ రాక ..వెంకన్న ఆలయ ప్రాంగణంలో విస్తృత ఏర్పాట్లు

(నక్కపల్లి/అడ్డు రోడ్డు, ప్రభాతవార్త) జూన్ 16 :



మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో యోగాంధ్రలో భాగంగా బుధవారం ఉదయం సామూహిక యోగాసనాల ప్రదర్శన కార్యక్రమానికి అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపడుతోంది. బుధవారం ఉదయం 5-30 గంటల నుంచి 7 గంటల వరకూ 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలకు పురస్కరించుకుని ప్రొటోకాల్ యోగాసనాలుంటాయని అధికారులు చెప్పారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ తుహీన్ సిన్హా, ఆయుష్ ఆర్డీడీ కె.శ్రీనివాసులు తదితరులు హాజరుకానున్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఉపమాక ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను డీఆర్డీఏ ఇన్చార్జి పీడీ డైజీ, డీఎల్పీవో కొండలరావు, నియోజకవర్గం టీడీపీ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, ఎంపీడీవో కె.చలపతిరావు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, పీఏసీఎస్ చైర్ పర్సన్లు కొప్పిశెట్టి బుజ్జి, వెలగా శ్రీను, ఆయుష్ వైద్యాధికారులు డాక్టర్ కె.రఘు, సుజాత, అనూష తదితరులు పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కొప్పిశెట్టి వెంకటేష్ నియోజకవర్గ ప్రజలకు పిలుపునిచ్చారు.



## అల్లూరి పార్కులో యోగా డే ఏర్పాట్లు

గొలుగొండ జూన్ 16, ప్రభాతవార్త

యోగాంధ్ర కార్యక్రమం ఈనెల 20న శనివారం అల్లూరు పార్కులో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు, తహసిల్దార్ వి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం అల్లూరు పార్కును సందర్శించి యోగ డే నిర్వహణ ఏర్పాట్లను పరిశీలించారు. 500 మందితో యోగా డే నిర్వహిస్తామని అన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు వసతి సౌకర్యాలపై పార్కులో అన్ని ప్రదేశాలను పరిశీలించారు. మండల స్థాయిలో జరిగే యోగ డేకు జిల్లా అధికారులు హాజరయ్యే అవకాశం ఉందని అందుకు తగిన తగిన విధంగానే అన్ని సౌకర్యాలు సమకూర్చి ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

## ఇండియన్ స్టాటిస్టికల్ ప్రవేశ పరీక్షలో సత్తా చాటిన శ్రీ ప్రకాష్ విద్యార్థి మోనిష్ కుమార్

పాయకరావుపేట రూరల్, జూన్ 16, ప్రభాతవార్త :



మంగళవారం ప్రకటించిన ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ (ఐఎస్ఐ) జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థి జె మోనిష్ కుమార్ అల్ ఇండియా లెవెల్ ఓబీసీ క్యాటగిరీలో 15 వ ర్యాంక్ ఓపెన్ క్యాటగిరీలో 107 వ ర్యాంక్ సాధించాడని కళాశాల ప్రిన్సిపాల్ వి.వి.ఎస్.ఎస్ భానుమూర్తి తెలిపారు. తమ కళాశాలలో 6 వ తరగతి నుండి 12 వ తరగతి వరకు ఇస్తున్న 7 సంవత్సరాల క్లాస్ రూమ్ ప్రోగ్రాంతో పాటుగా వివిధ జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు ఇస్తున్న శిక్షణ ద్వారా తమ విద్యార్థులు ఈ విజయాలను సాధిస్తున్నారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

## పాయకరావుపేటలో బిజెపి బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం



పాయకరావుపేట రూరల్, జూన్ 16, ప్రభాతవార్త :

భారతీయ జనతా పార్టీ పాయకరావుపేట మండల ప్రత్యేక సమగ్ర సవరణ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల అధ్యక్షులు మంచాల గాంధీ, అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి బి రత్న భరత్, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీరంగ రమేష్, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సురేంద్ర, సీనియర్ నాయకులు గెద్దం గాంధీ, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కలిగట్ల మూలస్వామి, కిసాన్ మోర్చా సెక్రటరీ దాడి శ్రీను, ఓబిసి మోర్చా సెక్రెటరీ పిల్లి రాంబాబు, పాయకరావుపేట మండలంలోని 18 గ్రామాలకు చెందిన బిఎల్ఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకోవడం జరిగింది. ఎస్ఐఆర్ కార్యక్రమం వల్ల దేశ భవిష్యత్తు ఏరకంగా మారిపోతుందో జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి రత్న భరత్ వివరించారు. బిజెపి పార్టీ కార్యకర్తలందరూ కార్యక్రమంలో పాల్గొని స్పష్టమైన ఓటు జాబితా తయారు అయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## యోగాంధ్ర విజయోత్సవ సభలను విజయవంతం చేయాలి :

### కూటమి నేతల పిలుపు.!



(నక్కపల్లి, ప్రభాతవార్త)

యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉదయం ఉపమాకలో నిర్వహించనున్న సామూహిక యోగా ప్రదర్శనను, కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించే విజయోత్సవ సభలను విజయవంతం చేయాలని కూటమి నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం ఉపమాకలో జరిగే సామూహిక యోగా కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాలు విజయవంతం పై పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయ కమిటీ నాయకత్వం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ , జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు ల సమక్షంలో ప్రత్యేక సమావేశం మంగళవారం మంత్రి క్యాంప కార్యాలయం వద్ద జరిగింది. ఈ సమావేశంలో అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయోత్సవ సభతో పాటు ఈ నెల 19న పాయకరావుపేట నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న విజయోత్సవ సభలను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పాలనలో అనకాపల్లి జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రామ స్థాయిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా వివరించాలని సూచించారు. హోం మంత్రి వంగలపూడి అనిత నాయకత్వంలో పాయకరావుపేట నియోజకవర్గం గణనీయమైన అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయోత్సవ సభలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. హోం మంత్రి అనిత సారథ్యంలో నియోజకవర్గం ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కూటమిలోని మూడు పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవి రాజు మాట్లాడుతూ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని విజయోత్సవ సభల నిర్వహణపై చర్చించారు. మండల పార్టీ అధ్యక్షులు చించెలపు పద్దు, గింజల లక్ష్మణరావు, కమల కంటి అబద్ధం, గుర్రం రామకృష్ణ, కొప్పిశెట్టి బుజ్జి, ప్రగడ వీరబాబు, నానేపల్లి రాఘవులు, కురుందాసు నూకరాజు, వైబోయిన వెంకటరమణ, మెరుగు నాగేశ్వరరావు, పేర్ల శ్రీను, గోసల తాతారావు, శ్రీకాంత్, అయినంపూడి అప్పలరాజు, గొట్టివాడ బాబ్జి, కొప్పిశెట్టి వాసు, జగదీష్, శ్రీను, ఏళ్ల వరహాలు, విలియం కేరి, మల్లపురెడ్డి రమాకుమారి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మున్నిషాబేగం, నక్కపల్లి మహిళా అధ్యక్షురాలు కొమ్మిరెడ్డి నాగలక్ష్మి, ఎస్.రాయవరం మండలం మహిళా అధ్యక్షురాలు, ఎస్.రాయవరం ఎం.పి.పి వెంకటలక్ష్మి , జిల్లా టీడీపీ కార్యదర్శి గుడబంటి శాంతమ్మ, దుబాసి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## అతిసార వ్యాధి నివారణ .. అవగాహన



గొలుగొండ జూన్ 16, ప్రభాతవార్త:

అతి సార వ్యాధి నివారణ అవగాహనతోనే సాధ్యమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శ్యామ్ కుమార్ అన్నారు. అవగాహన కార్యక్రమం గొలుగొండ అంగన్వాడి కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతిశారవ్యాధి లక్షణాలు,వ్యాధి ప్రబలే విధానం పై వివరించారు. జులై 31 వరకు అవగాహన కార్యక్రమం అన్ని అంగన్వాడి కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు కొనసాగితేయని అన్నారు. వ్యాధి లక్షణాలు తరచూ జ్వరం రావడం,వంటి వేడి తగ్గిపోవడం, నీళ్ల విరోచనాలు, అకస్మాత్తుగా స్మారక స్థితి కోల్పోవడం తోపాటు కొన్ని రకాలు లక్షణాలు కనిపిస్తాయి అన్నారు. వ్యాధి నివారణను తెలుసుకోండి అంటూ ప్రచారం చేస్తూ అటువంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్య సదుపాయం కల్పించడమే లక్ష్యంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఫకీర్ నాయుడు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న విశాఖ జిల్లా జడ్జి నాయుడు కుటుంబ సభ్యులు

పాడేరు,జూన్17,ప్రభాతవార్త:



మన్యం ఆరాధ్య దేవత పాడేరు శ్రీ మోదకొండమ్మ వారిని విశాఖ జిల్లా జడ్జి ఎస్. నాయుడు కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. జిల్లా జడ్జికి ఆలయ మ ర్యాదలతో కమిటీ సభ్యుడు రామకృష్ణ ఘనస్వాగతం పలికారు. జిల్లా జడ్జి పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. జడ్జికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి దేవా కప్పు ఘనంగా సత్కరించారు. పాడేరు సిఐ దీనబంధు, ఆలయ కమిటీ సభ్యులు రామకృష్ణ,వంజంగి కాంతమ్మ, లకే రత్నాబాయి పాల్గొన్నారు.

vsp11:vsp11.qxd 16-06-2026 21:47 Page 1






## ఫిన్లాండ్ అంతర్జాతీయ శిక్షణకు సత్యారావు ఎంపిక



**పాడేరు,జూన్17, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులకు అందించే అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమానికి హుకుంపేట మండలం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మత్స్యపురం ఉపాధ్యాయుడు మొష్ప సత్యారావు ఎంపికయ్యారు. విజయవాడలో ప్రారంభమైన ఇంటర్నేషనల్ ప్రొఫెషనల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో సత్యారావు పాల్గొన్నారు. సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఈ శిక్షణ మూడు దశల్లో సాగుతుంది. మొదటి దశలో విజయవాడలో తూర్పు విశ్వవిద్యాలయ సాంకేతిక నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. రెండోదశలో భాగంగా ఆగస్టు 17 నుంచి 26 వరకు ఉపాధ్యాయులు రోమా నగరంలో పర్యటించి అక్కడి విద్యా విధానాలను పరిశీలిస్తారు. మూడో దశలో ప్రాజెక్టు పనులు అమలు కోసం విదేశీ ప్రొఫెసర్లు ఆన్లైన్ ద్వారా మార్గదర్శకత్వం వహిస్తారు.తనకు ఈ అరుదైన అవకాశం కల్పించిన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కి ఉపాధ్యాయుడు సత్యారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు శిక్షణ లక్ష్యాలు సాధనకు నూరు శాతం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. సాల్ట్ కోఆర్డినేషన్ వి. సతీష్ రెడ్డి సమగ్ర శిక్ష సిబ్బంది పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలల్లో 5-10వ తరగతుల్లో సీట్లు పెంచాలి

**పాడేరు,జూన్17,ప్రభాతవార్త:**



గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 5–10వ తరగతుల సీట్లు పెంచాలని, గిరిజన సంక్షేమ స్కూల్స్ విద్యార్థి, విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జీవన్, కార్తీక్ డిమాండ్ చేశారు. ఏజెన్సీ 11 మండలాల్లో గల ప్రతి స్కూలు 5 నుండి 10 తరగతిలో సీట్లు పెంచాలని, గురుకుల కళాశాలలో, కేజీబీవీ లో, గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ప్రతి గ్రూపుకి సీట్లు పెంచాలంటూ మంగళవారం పాడేరు గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ పరిమళ కు అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు విద్యార్థి సమస్యలను పరిష్కరించాలంటూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అల్లూరి జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు జీవన్, కార్తీక్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సునందిని, భూషణం, అనిల్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు చందు, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు

**పాడేరు,జూన్17,ప్రభాతవార్త:**



గిరిజన హారతి దైవం కోరికలు తీర్చే కొంగుబంగారంగా పేరుగాంచిన పాడేరు మోదకొండమ్మ వారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్ , పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు మంగళవారం పాడేరు ఐటిడిఏ రిటైర్డ్ ఉద్యోగి బాదం విశ్వనాథం, సత్యవతి దంపతుల ఆర్థిక సహాయంతో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్పర్సన్ వంజంగి కాంతమ్మ, మాజీ జెడ్పీటీసీ రొబ్బ ఉషారాణి, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లుకోటిబాబు నాయుడు,ఆలయ కమిటీ సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో మణిద్వీప వర్ణన పూజ

**అరకులోయ, జూన్ 16, ప్రభాతవార్త :**



అరకులోయలో నివాసముంటున్న కాపుగంటి హరిబాబు, రాజ్యలక్ష్మి దంపతుల ఇంటి వద్ద మంగళవారం భక్తిశ్రద్ధలతో మణి ద్వీప వర్ణన పూజ వైభవోపేతంగా జరిగింది. అష్టైశ్వర్యాలు మనశ్శాంతి తో పాటు లక్ష్మీదేవి, శ్రీ లలిత దేవి అమ్మవార్ల కరుణాకటాక్షాలు ఉండాలని కోరుతూ భక్తిశ్రద్ధలతో జరిపిన మణిద్వీప వర్ణన పూజా కార్యక్రమంలో అరకులోయ యండపల్లి వలస గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. దీనిలో భాగంగా మణిద్వీప వర్ణన శ్లోకాలను ఆర్యవైశ్య మహిళలు భక్తితో పఠనం చేశారు. సుమారు మూడు గంటలకు పైగా మణి ద్వీప వర్ణన పూజా కార్యక్రమం జరిగింది. ముందుగా శ్రీ లలితా దేవి చిత్రపటానికి, లక్ష్మీదేవి విగ్రహానికి పుష్పాలతో అలంకరణ చేసి, పసుపుతో వినాయకుని తయారుచేసి భక్తితో పూజలు జరిపి మణిద్వీప వర్ణన ను తొమ్మిది సార్లు పఠనం చేశారు.

## పీఎం జన్మన్ బిల్లులు చెల్లించాలని ర్యాలీ

**డుంబ్రిగూడ, జూన్ 16 ప్రభాతవార్త:**



పీఎం జన్మన్ పథకంలో భాగంగా గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు అదనంగా ప్రభుత్వం పెంచిన రూ లక్ష బిల్లులను చెల్లించాలని, పీఎం జన్మన్ 2.0 ద్వారా గృహ నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక గిరిజన సంఘం ఆధ్వర్యంలో పివిటిజి గిరిజనులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం మూడు రోడ్ల జంక్షన్ నుంచి హౌసింగ్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి అనంతరం హౌసింగ్ ఏఈకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడుతూ పీఎం జన్మన్ గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా రూ లక్ష బిల్లులు పెంచిందన్నారు. ప్రసంగం జిల్లా ఉపాధ్యక్షుడు పి సూర్యనారాయణ, మండల అధ్యక్షుడు పి సురేష్ కుమార్, పి సత్యనారాయణ, పివిటిజి గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

## రణజిల్లెడ జలపాతం నుంచి మాలివలస వరకు కొత్త నీటి మళ్లింపు నిర్మాణం

**అరకురూరల్, జూన్ 16, ప్రభాతవార్త:**



జలధార--జలహారత కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చినలబుడు గ్రామపంచాయతీ పరిధిలోని మాలివలస గ్రామంలో రణజిల్లెడ వాటర్ ఫాల్ నుండి మాలివలస వరకు సుమారు 2 వేల మీటర్ల పొడవున కొత్త నీటి మళ్లింపు కాలువ (ఫీల్డ్ ఛానల్) నిర్మాణం చేపట్టడం జరిగింది. ఈ పనికి సుమారు 5 లక్షల 40 వేల రూపాయలు అంచనా వ్యయం కేటాయించబడింది.మాలివలస గ్రామానికి చెందిన వేతనదారుల ద్వారా ఈ పనులను విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది. ఈ కాలువ నిర్మాణంతో గ్రామ ప్రజల ఎన్నో సంవత్సరాల కల నెరవేరినట్టే కాకుండా, సుమారు 2 వందల యాభై ఎకరాల వ్యవసాయ భూమికి సాగునీరు అందే అవకాశం ఏర్పడింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీసం ప్రసాద్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ జె. జగదీశ్వరరావు, ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్ సి హెచ్ జగదీష్, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ బి. మహేష్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ మరియు ఉపాధి కార్మికులు వేతనదారులు (గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## చెరువును కబ్జా చేసి.. అధికారుల ఆదేశాలు బేఖాతరు చేసి..!

### ఉన్నతాధికారులకు మీకోసంలో తాజా మాజీ సర్పంచ్ ఫిర్యాదు

**కొయ్యూరు జూన్ 16 ప్రభాతవార్త**



గత కొన్నేళ్లుగా వ్యవసాయ చెరువును కబ్జా చేయడమే కాక, ఆ భూమిని లీజుకు ఇచ్చిన ఒక ఘరానా ఘనుడిపై మీకోసం లో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు మండలంలోని బీడిపాలెం తాజామాజీ సర్పంచ్ సత్తారు సోమన్న దొర ఒక ప్రకటనలో తెలిపారు. బీడిపాలెం పంచాయితీ సింగవరం రెవెన్యూ గ్రామంలో 37/5 సర్వేనెంబర్ లో ప్రభుత్వ పోరంబోకు రెండు ఎకరాల ఐదు సెంట్లు భూమిలోఉన్న చెరువును సింగవరం గ్రామానికి చెందిన జలుమూరి రాజేశ్వరమ్మ తనయుడైన జలుమూరి గోవిందరావు గత ఎన్నో సంవత్సరాలుగా వేరే వ్యక్తులకు కౌలుకిస్తూ వ్యవసాయం చేయిస్తున్నారని,దీనిపై పాడేరు మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేసినట్లు,ఫిర్యాదును కొయ్యూరు తాసిల్దార్ పరిశీలించి చెరువుగా పరిగణించి అది చెరువు అని ఎండార్స్ మెంట్ ద్వారా తెలియజేసారన్నారు. .కానీ ఆ భూమిలో మళ్లీ వ్యవసాయం చేయడానికి దుక్కి దున్నించడం జరిగిందన్నారు.ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే కాకుండా లీజుకిస్తూ వ్యవసాయం చేయించడం నేరంగా పరిగణించబడుతుందని, గత తాసిల్దారు తెలియజేశారన్నారు. ప్రభుత్వ చెరువును కాపాడాలని, చెరువును అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి ఈ ప్రభుత్వ చెరువుని కాపాడాలని సోమవారం నాడు స్థానిక మండల తాసిల్దారు ఆధ్వర్యంలో జరిగిన గ్రీవెన్స్ నందు మరలా ఫిర్యాదు చేశానని సోమన్న దొర వివరించారు.

## మహిళలను తలదించుకునేలా ముందు వ్యాఖ్యానించింది ఎవరు..!

### హోం మంత్రి అనితను ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి

**పాడేరు,జూన్17,ప్రభాతవార్త:**



రాష్ట్రంలో మహిళా లోకాన్ని , ముఖ్యంగా ఎస్సీ సామాజిక వర్గ మహిళలను తలదించుకునేలా ముందు వ్యాఖ్యానించింది ఎవరని..హోం మంత్రి అనిత ని పాడేరు మాజీ ఎమ్మెల్యే , వైఎస్ఆర్సిపి ఎస్టీ సెల్ అధ్యక్షులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ప్రశ్నించారు.మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ పై అనిత చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. పాడేరులోని ఆమె క్యాంపు కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వ్యక్తులు సమాజ విలువలతో కట్టుబడి మర్యాదపూర్వకంగా సమాజం గౌరవించేలా మాట్లాడాలనే విజ్ఞతను మరిచి అనిత వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారన్నారు. ఈరోజు మహిళా లోకం తలదించుకునేలా గుడివాడ అమర్నాథ్ మాట్లాడా రని టిడిపి సోకాల్డ్ నేతలు అంతా మాట్లాడుతున్నారని వాస్తవానికి మహిళ లోకం తలదించుకునేలా మొదట మాట్లాడింది ఎవరన్నది ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. ఓ మాజీమంత్రి, ఉత్తరాంధ్రలోనే అత్యంత ప్రభావంతమైన నాయకుడు, రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి పట్ల అమర్యాదగా , వ్యక్తిత్వ హననం చేయడం ఎంతవరకు సరైన పద్ధతిని ఆమె ప్రశ్నించారు. కనీసం మర్యాద లేకుండా అమర్నాథ్ ను వాడు వీడు అంటూ సంబోధించడం వలన మహిళలోకానికి గౌరవం పెరుగుతుందా? అని అన్నారు. ఐదేళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్మోహన్ రెడ్డి ని గౌరవించరు... ఆయన పార్టీలో ఉన్న వారినీ గౌరవించరు ...మీరు ఎవరినైనా వ్యక్తిగత దూషణలు చేయొచ్చు కానీ మిమ్మల్ని ఒక మాట అనేసరికి మహిళా లోకం, ఎస్సీ కార్డు గుర్తు వచ్చిందా? అని ఆమె అన్నారు.

## ఆధార్, రేషన్ కార్డు లేక నిలిచిపోయిన వృద్ధాప్య పెన్షన్



**అరకు రూరల్ జూన్ 16: ప్రభాతవార్త:**

ఆధునిక డిజిటల్ యుగంలో ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్నాయని చెప్పినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం కొందరి పరిస్థితి అత్యంత దయానయంగా మారింది. లోతేరు పంచాయతీ పరిధిలో నివసిస్తున్న స్వాభి. పెంటమ్మ, వయస్సు(65) భర్త. (మోస్య, లేటు)ఒంటరి మహిళ పరిస్థితి దీనికి ప్రత్యేక ఉదాహరణగా నిలుస్తుంది. ఆమెకు అండగా నిలిచి కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో పూర్తిగా ఒంటరిగా జీవిస్తుంది. వయస్సు పై బడటంతో కనీసం శ్రమించి పనిచేసుకునే శక్తి కూడా లేదు. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వ పింఛనే ఆమెకు ఏకైక జీవనాధారం కావాలి. కానీ, విధి వచించిన ఆమెను ప్రభుత్వ నిబంధనలు కుంగదీస్తున్నాయి. ఆమెకు కనీస గుర్తింపు కార్డు లేని ఆధార్ కార్డు కానీ, రేషన్ కార్డు, కానీ లేవు. ఈ సాంకేతిక కార్ల వల్ల ఆమెకు రావాల్సిన ప్రభుత్వం ఒంటరి మహిళ పెన్షన్ పూర్తిగా నిలిచిపోయింది. కడుపు నింపుకోవడానికి రేషన్ సరుకులు లేక చేతులు పింఛన్ డబ్బులు లేక ఆదరించే వారు కరువై ఆమె ప్రతిరోజు ఆకలితో అలమటిస్తుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, మానవత దృక్పథంతో ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. తక్షణమే సదరు ఒంటరి మహిళక ఆధార్, రేషన్ కార్డులు మంజూరు చేసి, పింఛన్ వచ్చేలా చూడాలని, ఆమెను ఆకలి కోరల నుండి కాపాడాలని పంచాయతీ ప్రజలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఉనికి కోసమే వైసీపీ నేతల వ్యక్తిగత విమర్శలు

### హోం మంత్రి అనిత పై గుడివాడ విమర్శలను ఖండించిన జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి

**కొయ్యూరు, జూన్ 16 ప్రభాతవార్త :**



చెప్పుకుందామంటే గతంలో చేసిన అభివృద్ధి పనులు లేక, ఇకపై చేస్తామని చెబుదామంటే భవిష్యత్తుపై అవగాహన లేక ఇక ఏదోలా ఉనికి చాటుకునే దురుద్దేశంతోనే కొంతమంది వైసీపీ నేతలు వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని జిసిసి మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎంవివి ప్రసాద్ ఎద్దేవా చేశారు . మం గళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హోం మంత్రి అనిత పై మాజీ మంత్రి వైసిపి నేత గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యక్తిగత విమర్శలపై సభ్య సమాజం తలదించుకునే పరిస్థితి ఏర్పడింద న్నారు.రాజకీయాల్లో విమర్శలు విధానాలపైనే ఉండాలని,వ్యక్తిగత దూషణలకు తావుండకూడదన్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ నాయకుల మధ్య భిన్నాభిప్రాయాలు సహజమేనని,. ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలు, ప్రజా సమస్యలపై విమర్శలు చేయడం ప్రతి రాజకీయ నాయకుడి హక్కు అని,అయితే ఆ విమర్శలు వ్యక్తుల వ్యక్తిత్వం, కుటుంబం లేదా మహిళల కట్టుబొట్టు వంటి వ్యక్తిగత అంశా లపై కాకుండా, పరిపాలన విధానాలు, ప్రజాప్రయోజనాలపైనే కేంద్రీకృతం కావాలన్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితపై మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు, రాజకీయ హుందాతనానికి విరుద్ధంగా కనిపిస్తున్నాయన్నారు. ముఖ్యంగా మహిళల కట్టుబొట్టు, వేషధారణ వంటి అంశాలను ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు చేయడం కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాదు, సమాజంలోని మహిళల గౌరవాన్ని కూడా కించపరచే చర్యగా భావించాల్సి ఉంటుందన్నారు. నేటి సమాజంలో ప్రజలు రాజకీయ నాయకుల ప్రతి మాటను, ప్రతి ప్రవర్తనను నిశితంగా గమనిస్తున్నారని, ప్రజా జీవితంలో ఉన్న నాయకులు తమ వ్యాఖ్యల ద్వారా సమాజానికి మంచి సందేశం ఇవ్వాల్సిన బాధ్యత కలిగి ఉండాలే తప్పా ఇలా చిల్లరగా మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. రాజకీయ విభేదాలు ఎంత ఉన్నా పరస్పర గౌరవం, సంస్కారం, హుందాతనం పాటించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అవసరమన్నారు. అయితే వైసిపి నేతలు మాత్రం వ్యక్తిగత విమర్శల పైనే ఆధారపడుతూ తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడు అనంతరావు మాస్టారుకు మదర్ థెరిస్సా సేవారత్న అవార్డు



**ముంచంగిపుట్టు, జూన్ 16(ప్రభాతవార్త):**



విశాఖపట్నంలో మధర్ థెరిస్సా ట్రస్టు ఆధ్వర్యంలో శెట్టి అనంతరావు మాస్టారు మధర్ థెరిస్సా సేవా రత్న రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు బిజెపి యువ మోర్చా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. గత ఏడాది ధారపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఫ్రీ కోచింగ్ ఉదయం, రాత్రి పూట ఇవ్వటం, చక్కటి విద్యను అందించడంతో ఏకలవ్య పాఠశాల నుండి 8 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాస్తే ఏడుగురు విద్యార్థులు ఏకలవ్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సీట్లు సాధించారు. అదేవిధంగా ఏపీ ఆర్ గురుకుల పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు పరీక్షలు రాస్తే ఇద్దరు విద్యార్థులు సీట్లు సంపాదించారు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చి దిద్దిన అనంతరావు మాస్టర్ కు అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గత ఏడది అందించారు. పిల్లలను ఉత్తములుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయుని గుర్తించి మదర్ థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారు అనంతరావు మాస్టర్ ను విశాఖపట్నంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో మధర్ థెరిస్సా సేవా రత్న రాష్ట్ర అవార్డును అందజేశారు. గతంలో దొడిపుట్టు, సుజనపేట, మేభ తదితర పాఠశాలలో విధులు నిర్వహించినప్పుడు విద్యార్థులకు చక్కటి విద్యా బోధ చేశారు. ప్రస్తుతం దారాపల్లి మోడల్ ప్రైమరీ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తనను గుర్తించి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేయడం, అలాగే విశాఖలో మధర్ థెరిస్సా ట్రస్ట్ వారి ద్వారా రాష్ట్ర సేవా రత్న అవార్డు అందుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. దీంతో విధులు పట్ల మరింత బాధ్యత పెరిగిందని, విద్యార్థులకు చక్కటి విద్యా బోధన చేసి విద్యార్థులు పైచదువులకై ఉన్నత విద్య అందజేస్తానని అనంతరావు మాస్టారు అన్నారు. అవార్డు గ్రహీతకు పాఠశాల తోటి ఉపాధ్యాయులు, కుటుంబీకులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

## మానవత్వానికి మారుపేరు అరుకు : సీఐ హిమగిరి



**దుంబ్రిగూడ, జూన్ 16 ప్రభాతవార్త:**

పోలీసు అంటే జనాలకి భయం కాదు తప్పు చేసిన వాడికి భయం. ఆపదలో ఉన్న వాళ్ళకి ఆపద్బాంధవుడు పోలీస్ అని అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్ హిమగిరి నిరూపించారు. మండలంలోని లైగండ పంచాయతీ సిందిపుట్టు గ్రామంలో అరకు సీఐ ఎల్ హిమగిరి దుంబ్రిగూడ ఎస్ఐ ఎల్ సురేష్ మంగళవారం సందర్శించి సిందిపుట్టు గ్రామ గిరిజన ప్రజలతో సమావేశమై వారి బాగోగులు అడిగి తెలుసుకుని గిరిజన యువతి యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేయడం జరిగింది. అదే గ్రామానికి చెందిన కిల్లో రాంబాబు ఆర్థిక పరిస్థితి చూసి వారి పిల్లలకు అనకాపల్లి లో ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలలో జాయినింగ్ చేసి వారికి హాస్టల్ లో చేర్పించడం జరిగింది. వారికి చదువుకోవడానికి పెన్నులు, ప్లాంక్స్ బట్టలు కూడా ఇవ్వడం అలాగే రాంబాబు వారి పెద్దబ్బాయి అర్జున్ పెద్దమ్మాయి మహేశ్వరి కళ్ళ కంటి చూపు అనారోగ్యంతో బాధపడతుండడం చూసి వారికి విశాఖపట్నం ఆసుపత్రి శంకర్ ఫౌండేషన్ లో స్వయంగా సిఐ తీసుకొని వెళ్లి కళ్ళు చూపుకు సంబంధించి, వైద్య పరీక్షలు అందించి ఆరోగ్యం బాగు చేయడం జరిగిందని, వారి ఆర్థిక పరిస్థితులు ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు వారి బాగోగులను తెలుసుకుంటూ మానవత్వాన్ని సిఐ చాటుకున్నారు.

## యోగాతో శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

### రాజేంద్రపాలెం పీహెచ్సీ వైద్యాధికారులు డా. జగదీష్, డా. సందేశ్

**కొయ్యూరు, జూన్ 16, ప్రభాతవార్త :**



యోగా తోనే శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతత చేకూరుతుందని మండలంలోని రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు డా. జగదీష్, డా. సందేశ్ అన్నారు. మంగళవారం రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోవైద్యాధికారుల ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవర్చుకొని రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. సిహెచ్ ఓ ప్రశాంత్ కుమార్, పిహెచ్ ఎన్ భాగ్యవతి, హెచ్ వి లక్ష్మీ. భూలోక, ఏఎన్ఎంలు ఎం ఎల్ హెచ్ పి లు, హెల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## తాజంగి గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులు వేగవంతం చేయాలి

**పాడేరు,జూన్16, ప్రభాతవార్త:**



అల్లూరి జిల్లా చింతపల్లి మండలం తాజంగిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్గా నిర్మిస్తున్న "గిరిజన స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం" నిర్మాణ పనులను కేంద్ర, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖల ఉన్నతాధికారుల బృందం మంగళవారం క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీ చేసింది. ఈ తనిఖీ, సమీక్షా సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ దీపాలి మాసిర్కర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం. నాయక్, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, మిషన్ డైరెక్టర్ డాక్టర్ మంధా రాణి, గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజనీర్ పాల్గొని పనుల పురోగతిని సమీక్షించారు. భవన నమూనాలు, అంతర్గత లేఅవుట్లను పరిశీలించి, ఇంజనీరింగ్ అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... మ్యూజియం ప్రధాన ఆకర్షణ అయిన డోమ్ పెయింటింగ్ పనులను అత్యంత జాగ్రత్తగా, భద్రతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. డోమ్ భారీ ఎత్తులో ఉన్నందున, పటిష్టమైన స్కాఫోల్డింగ్ (కింది నుండి బేస్ సపోర్ట్) ఏర్పాటు చేసి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలి ఉన్న లేఅవుట్ పనులను తాత్కాలిక షెడ్ల సహాయంతో వాతావరణ పరిస్థితులకు ఆటంకం కలగకుండా వేగవంతం చేయాలని, భవన నిర్మాణంలో అక్కడక్కడా ఉన్న చిన్నపాటి లోపాలను, అసమానతలను తక్షణమే సరిదిద్ది నాణ్యతను కాపాడాలని స్పష్టం చేశారు. గిరిజన వీరుల అపూర్వ చరిత్రను, సంస్కృతిని ప్రతిబింబించేలా క్యురేటెడ్ టీమ్ ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రదర్శన గ్యాలరీలను తీర్చిదిద్దాలని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా చింతపల్లి కాఫీ పల్పింగ్ యూనిట్ పనులు పరిశీలించారు, అలాగే జిమాడుగుల్లో నిర్మించనున్న కాఫీ పల్పింగ్ ప్రదేశాన్ని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేక బృందం, అరకు, పాడేరు గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చింతపల్లి సబ్–డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ ,క్యురేటెడ్ టీమ్ సభ్యులు మరియు నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నాటి వైసిపి అరాచకాలకు పరాకాష్ట అమర్నాథ్ గౌడ్ హత్య

### టిడిపి అరకు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ సియ్యారి దొన్ను దొర

**అరకు రూరల్, జూన్ 16, ప్రభాతవార్త :**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అరాచకాలకు నిలువెత్తు సాక్ష్యం పదో తరగతి చదువుతున్న అమర్నాథ్ గౌడ్ హత్యని తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి , ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డాక్టర్ సియ్యారి దొన్ను దొర పేర్కొన్నారు. 2023 జూలై 16వ తేదీన తన అక్కకు జరిగిన అన్యాయం పై వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు అత్యంత దారుణంగా పెట్రోల్ పోసి హత్య చేసే తన అరాచకత్వాన్ని వైఎస్ఆర్సిపి రాష్ట్రానికి పరిచయం చేసిందని ఆయన పేర్కొన్నారు. అరకులోయ లోని అమర్నాథ్ గౌడ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమర్నాథ్ జోహార్ అంటూ నినదించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దొన్ను దొర మాట్లాడుతూ చిన్న పిల్లాడు అయినా తన అక్కకు జరిగిన అన్యాయంపై ప్రశ్నించాడని అలా ప్రశ్నించినందుకు వైసిపి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి పెట్రోల్ పోసి మరి అత్యంత దారుణంగా హత్య చేసిందన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రశ్నించేందుకు అవకాశం లేదని అధికారం ఉన్నోడిదే రాజ్యమన్న తరహాలో పాలన సాగిందన్నారు. 2023 లో తన అక్కను వేధిస్తున్న వారిని సామాజిక మాధ్యమాల వేదికగా నిలదీసినందుకు అమర్నాథ్ గౌడ్ వైసీపీ అరాచకత్వానికి బలైపోయారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ధైర్యాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో హత్యకు గురైన అమర్నాథ్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని చెప్పారు. అమర్నాథ్ గౌడ్ అక్క హేమశ్రీ ఉన్నత విద్యకు ప్రభుత్వమే అన్ని విధాలా సహకార అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ప్రకటించి వారికి అండగా నిలిచారన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో బాధితులు అందరికీ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, ఏఎంసి చైర్మన్ బొరి బొరి లక్ష్మి, శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు బేతాళ నీరజ లక్ష్మి కుమారి,మాజీ ఎంపీటీసీ కుమార్, మరియు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన 'ప్రాజెక్ట్ సేఫ్ ఫుడ్' శిక్షణ

### హాజరైన సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసి నాయుడు, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ

### ఉచిత హైజీన్ కిట్లు, సర్టిఫికెట్ల పంపిణీ



**పాడేరు, జూన్16, ప్రభాతవార్త,:**



నేస్లే ఇండియా నేషనల్ స్ట్రీట్ ఫుడ్ వెండర్స్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా చేపట్టిన 'ప్రాజెక్ట్ సేఫ్ ఫుడ్' లో భాగంగా అల్లూరి జిల్లా ఆహార భద్రతా విభాగం సహకారంతో పాడేరులోని కాఫీ హౌస్లో మంగళవారం నాడు వీధి ఆహార వ్యాపారులకు, అంగన్వాడీ వంట మనుషులకు ఐదు రోజుల 'ఫాస్టాక్' శిక్షణా కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. రోజుకు 100 మంది చొప్పున ఐదు రోజుల పాటు ఈ శిక్షణ అందించనున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లీగల్ సర్వీసెస్ సీనియర్ సివిల్ జడ్జి ఆర్. సన్యాసి నాయుడు ,జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి తిరుమాని శ్రీపూజ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు ఉచిత హైజీన్ కిట్లను, సర్టిఫికేట్లను అందజేశారు.ఆహార భద్రత చట్టాలపై అవగాహన అవసరం: కార్యక్రమంలో జిల్లా జడ్జి ఆర్.సన్యాసి నాయుడు మాట్లాడుతూ ఆహార భద్రత చట్టాలపై ప్రతి ఒక్క వ్యాపారస్తునికి అవగాహన అవసరమని, ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఆహార భద్రత పై ఫాస్టాక్ శిక్షణ ఎంతో అవసరం. సంతల్లో జరిగే ఆహార కల్తీల పట్ల, ఎఫ్ఎస్ఎస్ఏఐ చట్టాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడేలా ఆహార కల్తీలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.ప్రతి వినియోగదారుల నమ్మకమే వ్యాపార అభివృద్ధి, అని జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ పేర్కొన్నారు. అల్లూరి జిల్లా ప్రముఖ పర్యాటక ప్రాంతం, ఇక్కడి బాంబూ బిర్యానీ, బెంబూ చికెన్, అరకు కాఫీలకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందని పర్యాటకులకు, వినియోగదారులకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడం ద్వారా వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను మరింత వృద్ధి చేసుకోవచ్చు. ఈ ఫాస్టాక్ సర్టిఫికేషన్ అనేది వినియోగదారులలో నమ్మకాన్ని పెంచేందుకు ఎంతగానో దోహదపడుతుందని ఆమె తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో పాల్గొన్న వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఫుడ్ తయారీ లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ ఏఎఫ్సీ అండ్ డీఓ కల్యాణ చక్రవర్తి అన్నారు. ఆహార భద్రత ప్రమాణాల చట్టం-2006 ప్రకారం నిబంధనలు పాటించని ఆహార వ్యాపారులపై భారీ జరిమానాలు, కఠిన చర్యలు ఉంటాయని, ఈ 5 రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను వ్యాపారులు తమ దైనందిన జీవితంలో అమలు చేస్తూ ఆహార నాణ్యతను, శుభ్రతను పెంపొందించుకోవాలన్నారు. నేస్లే ఇండియా సీనియర్ మేనేజర్ డాక్టర్ వసీం అహ్మద్, నాస్వి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధి ఎమ్. సత్యనారాయణ, జిల్లా ఆహార భద్రతాధికారి ముత్యాల గ్రీష్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## అమర్ దిష్టిబొమ్మకు గుడ్లు, చెప్పులతో కొట్టి నిరసన

**అరకు రూరల్, జూన్ 16, ప్రభాతవార్త :**



ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ పై అరకు లోయలో తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గం ఇన్చార్జి ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డా. సియ్యారి దొన్ను దొర ఆధ్వర్యంలో బుధవారం అరకు లోయలో మహిళలతో కలిసి వినూత్న నిరసన తెలిపారు. అమర్నాథ్ దిష్టిబొమ్మను చెప్పులు, గుడ్లతో కొట్టి క్షమాపణ చెప్పాలని వెంటనే అరెస్టు చేయాలంటూ డిమాండ్ చేశారు.అమర్నాథ్ దిష్టిబొమ్మను దహనం చేసి మహిళా నేతలు చెప్పులతో కొట్టి అనంతరం గుడ్లు పగలగొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అమర్నాథ్ డౌన్ డౌన్ అంటూ నినదించారు. అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలపై దొన్ను దొర మాట్లాడుతూ సమాజం తలదించుకునేలా మహిళలు ఒక మహిళా సమాజాన్నీ కించపరిచేలా అమర్నాథ్ వ్యాఖ్యానించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొడాలి నాని ఈ తరహా వ్యాఖ్యలే చేసే వారిని అందుకే ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. అనిత చేసిన అభివృద్ధి గురించి మాట్లాడకుండా వ్యక్తిత్వహననం చేయడం ఎంతవరకు సరైన పద్ధతిని ప్రశ్నించారు. గుడివాడ అమర్ లా పెత్తందారుల కుటుంబం నుంచి రాలేదని అట్టడుగు ఓ సామాన్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వృత్తి నుంచి శ్రమించి ఎటువంటి బ్యాగ్రౌండ్ లేకుండా పాయకరావుపేట నియోజకవర్గం నుంచి 47 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొంది ఈరోజు ఆంధ్రప్రదేశ్లో మహిళలకు ఆంధ్రప్రదేశ్ కే ఒక రక్షణ కవచంలా పనిచేస్తున్న మంత్రి పట్ల అనుచిత వ్యాఖ్యలు తగదన్నారు. గుడివాడ అమర్ ఇంట్లో కూడా భార్య, పిల్లలు, తల్లి చెల్లి అందరూ ఉంటారని ఆ విషయాన్ని విస్మరించి అనిత మేకప్ గురించి మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. దమ్ముంటే ఆమె చేస్తున్న అభివృద్ధి గురించి ఆమె నియోజకవర్గంలో తీసుకువచ్చిన మెటల్ స్లేల్ ప్లాంట్ గురించి శాంతి భద్రతల రక్షించడం గురించి పోలీస్ డిపార్ట్మెంట్లో తన హయాంలో తీసుకొచ్చిన ఉద్యోగాలు నియామకం గురించి మాట్లాడాలి తప్ప మహిళల అలంకరణ గురించి అనుచితంగా మాట్లాడ్డం సరికాదని సూచించారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లోకోయి మహాదేవ్, ఏఎంసీ చైర్మన్ బోరి బోరి లక్ష్మి, శ్రీ వరహా లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు బేతాళ నీరజ కుమారి మాజీ ఎంపీటీసీ కుమార్ మరియు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన బలోపేతానికి వంశీకృష్ణ కృషి ఫలితం

## పార్టీలో చేరికలకు ఊతమిచ్చే జాయినింగ్ కమిటీలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యేకు చోటు

(ప్రభాతవార్త -విశాఖపట్నం)



జనసేన పార్టీ విస్తరణ, బలోపేతం దిశగా కీలక అడుగులు వేస్తున్న తరుణంలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మరో కీలక బాధ్యత దక్కింది. ఇతర రాజకీయ పార్టీల నేతలు, మేధావులు, సామాజిక వేత్తలు, యువ నాయకులను జనసేనలోకి ఆహ్వానించే లక్ష్యంతో పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియమించిన 14 మంది సభ్యుల ఆంధ్రప్రదేశ్ జాయినింగ్ కమిటీలో వంశీకృష్ణ శ్రీనివాస్‌కు స్థానం కల్పించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, విశాఖపట్నంలో జనసేన ను మరింత బలోపేతం చేయడంలో వంశీకృష్ణ శ్రీనివాస్ చురుకైన పాత్ర పోషిస్తున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. యువత, మేధావులు, వివిధ రంగాల ప్రముఖులతో ఆయనకు ఉన్న అనుబంధం పార్టీకి కొత్త శక్తిని తీసుకు రావడంలో దోహదపడుతుందని భావిస్తున్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి, ప్రజాసేవలపై దృష్టి సారిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఈ బాధ్యత దక్కడం ఆయన నాయకత్వ సామర్థ్యానికి గుర్తింపుగా పార్టీ శ్రేణులు అభివర్ణిస్తున్నాయి. పార్టీ విస్తరణలో కీలక పాత్ర పోషించే ఈ కమిటీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా జనసేన ప్రభావం మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. జన సేన అధినేత పవన్ కళ్యాణ్ నేరుగా నియమించిన ఈ కమిటీలో చోటు దక్కడం వంశీకృష్ణ శ్రీనివాస్‌పై పార్టీ నాయకత్వానికి ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని కార్యకర్తలు చెబుతున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో జనసేన ను మరింత బలోపేతం చేసే దిశగా ఆయన సేవలు కీలకంగా నిలుస్తాయని వారు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# అనకాపల్లి జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణస్వీకారం

## ముఖ్య అతిథిగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి, ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన జిల్లా కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్ర మాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అసోసియేషన్ సభ్యులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడిగా కర్రి భాస్కరరావు, కార్యదర్శిగా చెన్నా మూర్తి, కోశాధికారిగా పెదపాటి రాజా ప్రమాణస్వీకారం చేశారు. ఈ వేడుకలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వి. వి.ఎస్ ప్రసాద్, పోసిన వీరేంద్ర, రాష్ట్ర కార్యదర్శి మద్దాల శేఖర్, రాష్ట్ర కోశాధికారి నాయుడు రాజన్‌లతో పాటు జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన పలువురు ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు. అనంతరం సభను ఉద్దేశించి స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, సమాజంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలకమైనదని, మనిషి పుట్టుక నుంచి తుదిశ్వాస వరకు ప్రతి ముఖ్యమైన ఘట్టాన్ని తమ కెమెరాల్లో బంధిస్తారని కొని యాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ ఎంతగానో అభివృద్ధి చెందిందని, ప్రపంచంలో ఎక్కడ ఏ జరిగినా క్షణాల్లో ఇక్కడ చూసే స్థాయికి సాంకేతికత చేరుకుందని ఆయన గుర్తుచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 70 వేల నుంచి లక్ష మంది వరకు ప్రత్యక్షంగా ఫోటోగ్రఫీ రంగంపై ఆధారపడి జీవిస్తు న్నారని, వీరంతా కలిసికట్టుగా ఒక అసోసియేషన్‌గా ఏర్పడి, ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు నిధిని ఏర్పాటు చేసుకోవడం ఎంతో అభినందనీయమని ఆయన ప్రశంసించారు. మారుతున్న టెక్నాలజీకి అను గుణంగా ఫోటోగ్రాఫర్లకు ఎప్పటికప్పుడు మెరుగైన శిక్షణ అందించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమం, నైపుణ్యాల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని స్పీకర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. రాష్ట్ర రాజధాని ప్రాంతంలో ఫోటోగ్రాఫర్ల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలాన్ని కేటాయించేలా తాను బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. అలాగే, కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే విగ్రహాన్ని విశాఖ బీచ్ రోడ్డులో ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు ఇప్పించే బాధ్యతను కూడా తాను వ్యక్తిగతంగా తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ రంగంలో ఉన్న వారందరూ ఆధునిక సాంకేతికతను ఒడిసిపట్టుకుని, తమ నైపుణ్యాలను మరింత మెరుగు పరచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆకాంక్షించారు.

# మహానాడు విజయంపై హర్షం వ్యక్తం

మాధవధార, జూన్ 16 ప్రభాతవార్త



మహానాడు విజయవంతంగా జరిగిందని సనపల వరప్రసాద్ విశాఖ ఎంపీ శ్రీ భరత్ తో కలిసి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం ఎంపీని వరప్రసాద్ ఆయన బృందంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహానాడు ప్రతి ఏడాది ఘనంగా నిర్వహిస్తున్నారని ఈ ఏడాది కూడా విజయవంతంగా నిర్వహించడం కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొందని తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు..

## అధికారులపై జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆగ్రహం -జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశంలో పలు శాఖల పనితీరుపై సుదీర్ఘ సమీక్ష.. -వైద్యం, ఉపాధి, విద్య, గృహ నిర్మాణ అంశాలపై కీలక చర్చ

విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త



ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, జవాబుదారీతనంతో అందేలా అధికారులు పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర స్పష్టం చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్దేశిత గడువులో పరిష్కరించి పరిపాలనపై విశ్వాసాన్ని పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పరిషత్ 1 నుంచి 7వ స్థాయి సంఘాల (స్టాండింగ్ కమిటీలు) సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన జెడ్పీటీసీ సభ్యులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ఉపాధి హామీ, వైద్య ఆరోగ్య శాఖ, విద్య, గృహ నిర్మాణం, మౌలిక సదుపాయాలపై విస్తృతంగా చర్చ జరిగింది. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు తీరును జెడ్పీ సీఈఓ పి. నారాయణమూర్తి సభకు వివరించారు.

### ఉపాధి హామీ పనుల్లో సాంకేతిక లోపాలపై ఆందోళన

ఉపాధి హామీ పథకం కింద ఫేస్ రికగ్నిషన్ హాజరు నమోదులో సాంకేతిక సమస్యల కారణంగా కూలీలు పూర్తి రోజులు పనిచేసినా తక్కువ రోజులు మాత్రమే నమోదు అవుతున్నాయని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల వేతనాలు తగ్గిపోతున్నాయని పేర్కొన్నారు. జూలై నుంచి అమలుకానున్న కొత్త మార్గదర్శకాల ప్రకారం గరిష్టంగా 125 పనిదినాలు కల్పిస్తామని అధికారులు వెల్లడించారు. పనిస్థలాల్లో తాగునీరు, ఓఆర్ఎస్, ఫస్ట్ ఎయిడ్ కిట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని చైర్‌పర్సన్ ఆదేశించారు. అదేవిధంగా హుకుంపేట, దుంబ్రిగూడ, పాడేరు ప్రాంతాల్లో పనులు జరగకపోయినా మాస్టర్ రోల్స్ సృష్టించి బిల్లులు చేసిన ఘటనలపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పూర్తి స్థాయి విచారణకు డిమాండ్ చేశారు.

### వైద్య శాఖ అధికారుల గైర్హాజరుపై మండిపాటు

వైద్య, ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశానికి సంబంధిత ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పాడేరు జిల్లా ఆసుపత్రిలో తగిన వైద్య సేవలు లేకపోవడంతో అత్యవసర కేసులను నేరుగా కేజీహెచ్‌కు తరలిస్తున్నారని, అంబులెన్స్ ఆలస్యం వల్ల ప్రాణనష్టం సంభవించిందనే ఆరోపణలు వినిపించాయి. దీనిపై సమగ్ర నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపాలని నిర్ణయించారు. అనకాపల్లి, నర్సీపట్నం ప్రాంతాల్లో డయాలసిస్ కేంద్రాల నిర్వహణ, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం, మృతదేహాల రవాణాకు మరిన్ని 'మహాప్రస్థానం' వాహనాల ఏర్పాటు, ఆన్‌లైన్ పోస్టుమార్టం ప్రక్రియలో జాప్యాల నివారణ వంటి అంశాలపై కూడా చర్చ జరిగింది. నర్సీపట్నం మోడల్ స్కూళ్లలో సీట్లకు భారీ డిమాండ్ ఉండగా, ఏజెన్సీ ప్రాంతాల్లోని బీసీ, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ప్రవేశాలు తగ్గిపోవడంపై సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పాతరపల్లి మోడల్ స్కూల్ హాస్టల్‌లో బియ్యం అక్రమ రవాణా వ్యవహారంపై విచారణను వేగవంతం చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు. వికలాంగుల వరల్డ్ కప్‌లో విజేతలుగా నిలిచిన సాగర్‌నగర్ అంధుల పాఠశాల విద్యార్థులను సభ అభినందించింది. వారికి ఇళ్ల స్థలాల కేటాయింపుపై కూడా సానుకూల చర్చ జరిగింది. సంపతపురం, కొత్తూరు, దార్లపూడి తదితర జగనన్న కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ వంటి కనీస సదుపాయాలు లేకపోవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఎం జన్మన్ గృహాల బిల్లుల చెల్లింపులు మ్యాపింగ్ జాప్యంతో నిలిచిపోవడాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. స్థాయి సంఘాల సమావేశాలకు జిల్లా స్థాయి అధికారుల బదులుగా కింది స్థాయి సిబ్బందిని పంపడం వల్ల సమావేశాల ఉద్దేశం దెబ్బతింటోందని సభ్యులు మండిపడ్డారు. భవిష్యత్తులో శాఖాధిపతులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. పాడేరు-అరకు, అనంతగిరి తదితర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ రహదారులు లేకపోవడంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సభ్యులు పేర్కొన్నారు. టోల్ గేట్లకు సమీపంలోని 12 కిలోమీటర్ల పరిధిలో నివసించే స్థానికులకు టోల్ ట్యాక్స్ నుంచి మినహాయింపు కల్పించాలని కోరుతూ ఎన్‌హెచ్ఏఐ, ఐటీడీఏ అధికారులకు లేఖ రాయాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా పరిషత్ సమావేశం స్పష్టం చేసింది.

# వర్షాకాలానికి ముందే సాగు సన్నాహాలు వెల్లంకిలో 30 ఎకరాల్లో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్

ఆనందపురం, జూన్ 16, ప్రభాతవార్త :



వర్షాకాలం ప్రారంభానికి ముందే సాగు పనులను వేగవంతం చేస్తూ ఆనందపురం మండలం వెల్లంకి గ్రామంలో రైతులు ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహానికి మరో అడుగుగా నిలిచింది. గ్రామానికి చెందిన రైతులు విష్ణు కుమార్ రాజు, మురళీ మహేశ్వర రాజు, సత్య నారాయణ రాజు తమ 30 ఎకరాల వ్యవసాయ భూమిలో ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ విత్తనాల విత్తకాన్ని ప్రారంభించారు. రైతు సాధికార సంస్థ సిబ్బంది ప్రత్యక్షంగా పొలాల్లో పాల్గొని రైతులకు సాంకేతిక సూచనలు అందిస్తూ విత్తనాల విత్తకాన్ని పర్యవేక్షించారు. వ్యవసాయ నిపుణుల ప్రకారం, ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో వర్షాలు ప్రారంభమయ్యే ముందే విత్తనాలను భూమిలో నాటడం వల్ల తొలి వర్షపు తేమను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం లభిస్తుంది. దీంతో మొలక శాతం పెరగడంతో పాటు పంట ఎదుగుదల మెరుగుపడుతుంది. వర్షాభావ పరిస్థితులను తట్టుకుని నిలదొక్కుకునే సామర్థ్యం కూడా ఈ విధానంలో ఎక్కువగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సాధికార సంస్థ సిబ్బంది మాట్లాడుతూ, వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రైతులకు భరోసానిస్తున్నాయని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించేందుకు, నేల సారాన్ని కాపాడేందుకు మరియు స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రీ-మాన్సూన్ డ్రై సోయింగ్ వంటి పద్ధతులు ఎంతో ఉపయోగకరమని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ రైతు సాధికార సంస్థ సిబ్బంది పాల్గొని ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకున్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతుల్లో పెరుగుతున్న ఆసక్తికి వెల్లంకి గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కోర్టు సంచలన తీర్పు: ఒకరికి నెల రోజులు జైలు

గాజువాక, జూన్ 16,ప్రభాతవార్త

మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడటమే కాకుండా, తనిఖీలు చేస్తున్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించిన ఒక లారీ డ్రైవర్‌కు కోర్టు నెల రోజుల సాధారణ జైలు శిక్ష విధించింది. గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మొత్తం ఎనిమిది మంది పట్టుబడ్డారు. వీరిని గాజువాకలోని తృతీయ అదనపు ప్రత్యేక జుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కె. భారతి ఎదుట హాజరుపరిచారు. నిందితుల్లో ఏడుగురికి కోర్టు మొత్తం రూ. 70,000 జరిమానా విధించింది. కాగా, జార్ఖండ్ రాష్ట్రం గర్వా ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ కృష్ణ యాదవ్ (23) మద్యం తాగి పట్టుబడటమే కాకుండా, పోలీసులకు సహకరించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేయడంతో న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న పోలీసులను ఇబ్బంది పెట్టినందుకు గానూ అతనికి 30 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

# నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాలు నడిపితే చర్యలు

## పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

విశాఖపట్నం, జూన్ 16 ప్రభాతవార్త



నగరవాసులను ఇబ్బందులు పెడుతూ ద్విచక్ర వాహనాలు భారీ శబ్దంతో సైలెన్సర్లు పెట్టి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని విశాఖ నగర్ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. మంగళవారం ద్విచక్ర వాహన సైలెన్సర్లను రోడ్ రోలర్ కింద పెట్టి క్రషింగ్ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలను మార్పులు చేస్తూ, ఇతర వాహన చోదకులకు, పాద చారులకు, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విశాఖ నగర్ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. వాహనాలలో వివిధ మార్పులు చేస్తూ భారీ శబ్దాలు కలగజేస్తు ఉండటంవల్ల పిల్లలు, స్త్రీలు ,వృద్ధులు, గుండె జబ్బులు కలిగిన వారు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. హై- బీమ్ లైట్లను, మొబైల్ స్టాండ్లను వాహనాలలో అమర్చి డ్రైవింగ్ చేయడం వలన పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రమాదాల వల్ల వాహనాలు నడిపేవారు మాత్రమే కాకుండా ఎదురుగా ఉన్న వాహనదారులు అలాగే రోడ్డు దాటుతున్న పాదచారులు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలు పాలవుతున్నారని వెల్లడించారు. ఇలా వాహనాలు మార్పులు చేసి నడిపే వారి వలన ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు స్పందించి ప్రత్యేక పోలీసు బృందాలతో నగరంలోని పలు ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, అటువంటి వాహనాలను స్వాధీనం చేసుకొని, సదరు వాహనదారులపై కేసులు నమోదు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నగరంలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో నిర్వహించి వాహనాల నుంచి 142 సైలెన్సర్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అలాగే రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాలకు ఇబ్బందిని కలిగించి ప్రమాదాలకు కారణమయ్యే కార్లు, ఆటోలకు అనధికారికంగా అమర్చిన 89 హై-బీమ్ లైట్ లను తొలగించడం జరిగిందన్నారు. అదేవిధంగా ద్విచక్ర వాహనాలకు మొబైల్ స్టాండ్ లను అమర్చడం వలన సదరు వాహనదారుని దృష్టి రోడ్డు పైన ప్రయాణించే వాహనాలపై కాకుండా, మొబైల్ ఫోన్ పై దృష్టి పెట్టడం వలన రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయన్నారు. అటువంటి 270 మొబైల్ స్టాండ్ లను వాహనాలనుండి తొలగించడమైనదని పేర్కొన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు ఇటీవల బీచ్, ఇతర రోడ్ల పై బైక్ రేసింగ్ చేయగా దఫా దపాలు గా 73 ద్విచక్ర వాహనాలు అదుపులోకి తీసుకొని, వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు.వారి లైసెన్స్ లను సస్పెండ్ చేయమని డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమీషనర్(డిటిసి)కు సిఫార్సు చేసామని వెల్లడించారు. మోడిఫైడ్ సైలెన్సర్లను 190, ఎం.వి.యాక్ట్ 1988 మొదటిసారి ఉల్లంఘనకు 3 నెలల జైలు శిక్ష లేదా రూ.10,000ల జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ జప్తు చేయడం జరుగుతుందన్నారు. రెండవసారి ఉల్లంఘనకు 6 నెలల జైలు శిక్ష లేదా రూ. 10,000 ల జరిమానాతో పాటు వాహనం స్వాధీనం, లైసెన్స్ మరో 3 నెలల పాటు జప్తు చేయడం జరుగుతుందని చెప్పారు. హై-బీమ్ లైట్ 190 ఏం. వి.యాక్ట్ 1988 మొదటిసారి ఉల్లంఘనకు 3 నెలల జైలు శిక్ష లేదా రూ. 10,000 ల జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ జప్తు చేయడం జరుగుతుందని తెలిపారు. రెండవసారి ఉల్లంఘనకు 6 నెలల జైలు శిక్ష లేదా రూ. 10,000 ల జరిమానాతో పాటు వాహనం స్వాధీనం, లైసెన్స్ మరో 3 నెలల పాటు జప్తు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మొబైల్ స్టాండ్ 184 ఎం.వి.యాక్ట్ 1988 ఒక సంవత్సరం జైలు శిక్ష లేదా రూ. 1,000 లనుండి రూ. 10,000 ల వరకు జరిమానా, 3 నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ జప్తు చేయడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే బైక్ రేసింగ్ కేసులకు సంబంధించి ఆరు నెలల వరకు పొడిగించగల ఏదైనా ఒక రకమైన కారాగార శిక్షతో గానీ, వెయ్యి రూపాయల వరకు జరిమానాతో గానీ, లేదా ఆ రెండింటితో గానీ శిక్షించబడతారని తెలిపారు.

# జివిఎంసీ అన్ని జోన్లలో జూన్ 18 నుంచి 24 వరకు రెవెన్యూ మేళాలు

విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ (జీవీఎంసీ) పరిధిలో ఆస్తి పన్ను సంబంధిత సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు అన్ని జోన్లలో ప్రత్యేకంగా "రెవెన్యూ (ట్యాక్స్) మేళాలు" పార్లమెంటు సభ్యులు / శాసనసభ్యులు / ప్రజా ప్రతినిధుల సమక్షంలో జూన్ 18 నుండి 24వ తేదీ వరకు జోన్ల వారీగా నిర్వహించనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఏప్రిల్ 25 నుండి 30వ తేదీ వరకు నిర్వహించిన రెవెన్యూ మేళాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించడంతో పాటు అనేక సమస్యలు నిర్ణీత కాలంలో పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మరోసారి ప్రజలు కొరకు ఈ అవకాశాన్ని కల్పిస్తూ 2026 జూన్ 18 నుండి జూన్ 24 వరకు ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జోన్ల వారీగా రెవెన్యూ (ట్యాక్స్) మేళాలు నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. 18.06.2026 (గురువారం) : మధురవాడ జోన్, నార్త్ జోన్ 19.06.2026 (శుక్రవారం) : భీమిలి జోన్, అగనంపూడి జోన్ 20.06.2026 (శనివారం) : ఈస్ట్ జోన్, అనకాపల్లి జోన్ 23.06.2026 (మంగళవారం) : సౌత్ జోన్,వెస్ట్ జోన్ 24.06.2026 (బుధవారం) : గాజువాక జోన్,పెందుర్తి జోన్ కొత్త ఆస్తి పన్ను అసెస్మెంట్, భవనాల తొలగింపు, చేర్పులు, మార్పులు, ఆస్తి విభజన, రివిజన్ పిటిషన్లు, జనరల్ రివిజన్ పిటిషన్లు, పన్ను మినహాయింపులు, టైటిల్ ట్రాన్స్ఫర్, ఆస్తుల విలీనం, యజమాని పేరు సవరణ, డోర్ నంబర్ సవరణ తదితర సేవలు ఈ మేళాలో అందించబడతాయని కమిషనర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు, అవసరమైన పత్రాలతో సంబంధిత జోన్లలో నిర్వహించే మేళాలకు హాజరై సేవలను పొందవచ్చని తెలిపారు. అందిన దరఖాస్తులను అదే రోజు నమోదు చేసి, నిర్ణీత సేవా ప్రమాణాల ప్రకారం త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు పాల్గొను ఈ మేళాలకు సంబంధించి .., వార్డు సచివాలయాలు, నివాసిత సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ మేళాలపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. ఆస్తి పన్ను సంబంధిత సమస్యల పరిష్కారానికి జీవీఎంసీ నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక రెవెన్యూ (ట్యాక్స్) మేళాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను సులభంగా పరిష్కరించుకోవాలని జీవీఎంసీ కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# డేటా సెంటర్‌పై దుష్ప్రచారం ఎందుకు?

## అభివృద్ధి జరిగేటప్పుడు చిన్న చిన్న ఇబ్బందులు సహజం: ఎంపీ శ్రీ భరత్ -గూగుల్ డేటా సెంటర్‌కు అన్ని అనుమతులు ఉన్నాయి.. పెట్టుబడులను అడ్డుకునే కుట్రలు జరుగుతున్నాయి

విశాఖపట్నం, జూన్ 16, ప్రభాతవార్త :



అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేటప్పుడు చిన్న చిన్న ఇబ్బందులు రావడం సహజమని, వాటిని భూతద్దంలో చూపిస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదని విశాఖ ఎంపీ శ్రీ భరత్ అన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, డేటా సెంటర్ల వల్ల విశాఖ భవిష్యత్తుకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన భరత్, డేటా సెంటర్ల కారణంగా నీటి, విద్యుత్ కొరత ఏర్పడుతుందని ప్రచారం చేయడం పూర్తిగా అసత్యమన్నారు. భవిష్యత్తులో విశాఖలో నీటి, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు ఎంపికైన ప్రాంతాలకు ఇప్పటికే పర్యావరణ అనుమతులు ఉన్నాయని, అనుమతులు లేకుండా పనులు జరుగుతున్నాయంటూ కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రావడం ఇష్టం లేని వర్గాలే ఈ దుష్ప్రచారానికి పాల్పడుతున్నాయని ఆరోపించారు. డేటా సెంటర్ల వల్ల విశాఖలో ఐటీ, కార్పొరేట్ రంగాలు మరింత విస్తరించే అవకాశం ఉందని, వేలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయని భరత్ పేర్కొన్నారు. ఒకవైపు పర్యావరణ వేత్తలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, మరోవైపు ఈ ప్రాజెక్టులు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంపై కూడా ఆయన స్పందించారు. జూలైలో విమానాశ్రయ ప్రారంభోత్సవానికి సంబంధించిన ప్రధానమంత్రి షెడ్యూల్ ఖరారైందని వెల్లడించారు. బీచ్ షాక్ పాలసీపై వస్తున్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. పర్యాటక అభివృద్ధి లక్ష్యంగానే ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకువచ్చిందని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ఆదాయ వనరుల పెంపు, పర్యాటక రంగ అభివృద్ధి కోసం ఈ విధానం ఉపయోగపడుతుందని వివరించారు. రుషికొండ భవనాల వినియోగంపై కూడా ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, వాటి నిర్వహణకు సరైన మార్గాలను అన్వేషిస్తున్నామని తెలిపారు. విశాఖను దేశంలోనే ప్రముఖ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ శ్రీ భరత్ స్పష్టం చేశారు.

# ముస్సోరీ హోమ్‌స్టేలో యువతి మృతి

7వ తరువాయి ..



ఉద్యోగం చేస్తున్నాడు. జూన్ 14 రాత్రి ఇద్దరూ ముస్సోరీలోని టిప్రిధార్ ప్రాంతంలోని కియానా హోమ్‌స్టే లోని 'బ్లిస్' గదిలో బస చేశారు. భర్త తెలిపిన వివరాల ప్రకారం, ఆ రాత్రి ఇద్దరూ భోజనం అంతరం తెల్లవారుజామున నిద్ర పోయారు. ఉదయం లేచినప్పుడు గాయత్రి నగ్నంగా నేలపై అపస్మారక స్థితిలో కనిపించిందని, ముక్కు నుంచి రక్తం కారుతుండగా పడివున్నట్లు గుర్తించినట్లు చెప్పినట్లు తెలుస్తుంది. సమాచారం అందుకున్న ముస్సోరీ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని 108 అంబులెన్స్ సిబ్బందితో పరిశీలించారు. వైద్య సిబ్బంది ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గదిలో రక్తపు మరకలు ఉన్న బెడ్‌షీట్, రెండు ఖాళీ మద్యం సీసాలు, ఆహార పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత ఏడాది నవంబర్ 8న గాయత్రి, శ్రీచరణ్ వివాహం జరిగినట్లు సమాచారం. ఇద్దరూ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందిన వారే. మృతదేహాన్ని డెహ్రాడూన్‌లోని కారోనేషన్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కేసు స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్యుల బృందంతో పోస్టుమార్టం నిర్వహించి, మొత్తం ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయాలని పోలీసులు ఆదేశించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాతే మృతి కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

# క్షణం క్షణం భయం..

గాజువాక,జూన్ 16,ప్రభాతవార్త

గాజువాకలో ప్రయాణమంటేనే వాహనదారులు వణికిపోతున్నారు. 'క్షణ క్షణం.. భయం భయం' అన్నట్లుగా సాగుతోంది ఇక్కడి ట్రాఫిక్ తంతు. పనులు ముగించుకుని ఇళ్లకు చేరాలంటే గగనమవుతోంది. జింక్ ప్రధాన ద్వారం నుంచి పాత గాజువాక వరకు, అలాగే వంటిల్లు జంక్షన్ నుంచి జగ్గు జంక్షన్, కణితి రోడ్డు మార్గాల్లో రాకపోకలు సాగించాలంటే నరకప్రాయంగా మారుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతుండటంతో తలప్రాణం తోకకు వస్తోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్డే మార్కెట్.. తోపుడు బండ్లదే రాజ్యం!...

కొత్త గాజువాక మజీద్ వద్ద తెల్లవారుజాము నుంచే కూరగాయలు, పండ్ల భారీ వాహనాలు తిష్ట వేస్తున్నాయి. వాటిని తరలించే ఆటోల రద్దీకి తోడు, రోడ్డుపైనే ఆకుకూరలు, పూల అమ్మకాలు సాగిస్తుండటంతో అడుగు ముందుకు పడని పరిస్థితి నెలకొంది. ఇక వంటిల్లు నుంచి పాత గాజువాక వెళ్లే రహదారికి ఇరువైపులా ఫాస్ట్ ఫుడ్, ఫ్రూట్ జ్యూస్, బజ్జీల దుకాణాలు వెలిశాయి. వీటికి వచ్చే కస్టమర్లు వాహనాలనురోడ్డుపైనే పార్క్ చేస్తుండటంతో ట్రాఫిక్ 'చాంతాడంత' తయారవుతోంది. కొత్త గాజువాక మార్కెట్‌కు వచ్చే వాహనాల కోసం ట్రాఫిక్ పోలీసులు రహదారి మధ్యలో పార్కింగ్ సదుపాయం కల్పిస్తే.. దాన్ని అరటిపళ్లు, సుగంధి మారేడు, లస్సీ తోపుడు బండ్లు ఆక్రమించేయడం గమనార్హం.

### ఆ సమయాల్లో అరాచకమే..

ఉదయం 4.00 నుంచి 9.00 గంటల వరకు, సాయంత్రం 6.00 నుంచి రాత్రి 9.00 గంటల వరకు, ఈ పీక్ అవర్స్‌లో గాజువాక రోడ్లపై వాహనాల రద్దీ విపరీతంగా ఉంటోంది. కనీసం నడవడానికి కూడా స్థలం లేని పరిస్థితి కనిపిస్తోంది.

### చలానాలపై ఉన్న శ్రద్ధ.. ట్రాఫిక్‌పై లేదా?

ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు ఆ పనిని గాలికొదిలేశారని వాహనదారులు మండిపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే సమయాల్లో ట్రాఫిక్ క్లియర్ చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పోలీసుల ఫోకస్ అంతా కేవలం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చలానాల వసూళ్లపైనే ఉంటోందని, ఖజానా నింపడంపై ఉన్న శ్రద్ధ వాహనదారుల కష్టాలను తీర్చడంపై లేదని విమర్శిస్తున్నారు. ట్రాఫిక్ వలయంలో చిక్కుకున్న గాజువాకను కాపాడాలని, తక్షణమే ఆక్రమణలు తొలగించి రాకపోకలు సులువు చేయాలని ప్రజా సంఘాలు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కోడిగుడ్డు అమర్‌నాథ్‌కు గూబ గుయ్యిమనేలా సమాధానం

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్



విశాఖపట్నం, జూన్ 16,ప్రభాతవార్త

వైసీపీ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఏపీ స్టేట్ ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టర్ కోంద్రు మరిదయ్య తీవ్రంగా ఖండించారు. నర్సీపట్నంలో మీడియా సమావేశంలో మరిదయ్య మాట్లాడుతూ దళిత మహిళా మంత్రిపై బాడీ షేమింగ్ చేస్తూ కించపరిచేలా మాట్లాడిన అమర్‌నాథ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే కస్టడీలోకి తీసుకోవాలని రాష్ట్ర డీజీపీని ఆయన మీడియా ముఖంగా డిమాండ్ చేశారు. గన్‌మెన్లు లేనిదే హోంమంత్రి బయటకు రాలేరన్న అమర్‌నాథ్ వ్యాఖ్యలకు ఆయన ఘాటుగా బదులిచ్చారు. వైసీపీ నాయకులకు గన్‌మెన్లతో పనిలేదని, చేతిలో గొడ్డలి ఉంటే చాలు దాన్ని పట్టుకునే బయటకు వస్తారని ఆయన ఎద్దేవా చేశారు. తాము వాడిన బుల్లెట్ ప్రూఫ్ కార్లనే ఇప్పుడు వాడుతున్నారని అమర్‌నాథ్ అనడం హాస్యాస్పదమని, 2019లో మాత్రమే వైసీపీ అధికారంలోకి వచ్చిందని, అంతకుముందు అనేకసార్లు అధికారంలో ఉన్న టీడీపీ వాడిన కార్లనే వైసీపీ నాయకులు సైతం ఉపయోగించారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. గతంలో నిండు శాసనసభలో నారా భువనేశ్వరిని వైసీపీ నాయకులు అవమానించారని, అలా మహిళల జోలికి వెళ్లిన పాపానికే ఆ పార్టీ కేవలం 11 సీట్లకు పరిమితమైందని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు మళ్లీ హోంమంత్రి అనితను బాడీ షేమింగ్ చేసి అదే తప్పు చేస్తున్నారని, ఈ తీరు మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ఆ 11 సీట్లు కూడా మిగలవని హెచ్చరించారు. మిస్టర్ అమర్‌నాథ్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని, లేకపోతే మర్యాద దక్కదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆడవాళ్లను అవమానించినందుకు చట్టంలో ఉన్న అన్ని సెక్షన్లను ఉపయోగించడంతో పాటు, సుమోటోగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి గుడివాడ అమర్‌నాథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని అనకాపల్లి జిల్లా ఎస్పీని, రాష్ట్ర పోలీసు అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తుని రైల్వే జెడ్ఆర్‌యూసీ మెంబర్, టీడీపీ దళిత నాయకుడు బోడపాటి శ్రీనివాస్, అనకాపల్లి జిల్లా వెలమ సంఘం సహాయ కార్యదర్శి అనిమిరెడ్డి నాగు తదితరులు పాల్గొన్నారు.


వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, MOHEMMED NASEEM S/O HAFIZULLAH KHAN previously called MOHAMMAED NASIM R/O 44-27-12, RLY NEW COLONY, THATICHETLAPALEM, VISAKHAPATNAM, now changed my name from MOHAMMAED NASIM to MOHEMMED NASEEM. Henceforth I will be called as MOHEMMED NASEEM for all purposes.

(Ro.No.10764)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

17skl13:17skl13.qxd 16-06-2026 22:33 Page 1



## రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన దళిత నాయకులు

**సంతబొమ్మాళి, జూన్ 16 ప్రభాతవార్త:**




రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్‌ని అమరావతిలో టెక్కలి నియోజకవర్గానికి చెందిన దళిత నాయకులు చింతాడ శ్రీనివాస్, చింతాడ చిన్నారావు (రాష్ట్ర దళిత దండోరా అధ్యక్షులు) మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గ పరిధిలో దళితులు ఎదుర్కొంటున్న పలు భూ సమస్యలు, సామాజిక ఇబ్బందులు, ఇతర స్థానిక సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సమస్యల పరిష్కారం కోరుతూ ఒక సమగ్ర వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులు వినతిపత్రంలో వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లాలోని దళిత వర్గాల హక్కుల రక్షణకు, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కమిషన్ ప్రత్యేక చొరవ చూపాలని కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దళితుల భూ సమస్యలను పరిష్కరించాలని, అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని చైర్మన్‌ను అభ్యర్థించినట్లు పేర్కొన్నారు. దళితులపై జరుగుతున్న అన్యాయాలపై తక్షణమే స్పందించి, బాధితులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. వినతిపత్రంలో పేర్కొన్న ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారని దళిత నాయకులు వెల్లడించారు.

## టీకాలతోనే పాడి పశువులకు రోగ నిరోధక శక్తి : డాక్టర్ అనిల్



**పాతపట్నం, జూన్ 16 ప్రభాతవార్త:**

టీకాలు వేయించడం ద్వారా పాడి పశువులలో రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటాయని కొరసవాడ పశుచికిత్సాలయం పశు వైద్యాధికారి అనిల్ తెలియజేశారు. మంగళవారం మండలంలోని బూరగాంలో జబ్బవాపు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాడిపశువులలో వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను పాడి రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నర్సునాయుడు, పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

## ఒకే కుటుంబంలో ముగ్గురు ట్రిపుల్ ఐటీలోకి..

**సంతబొమ్మాళి, జూన్ 16 ప్రభాతవార్త**



కృషి, తపన, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని నిరూపించారు ఒకే కుటుంబంలో ముగ్గురు అక్కా చెల్లెళ్లు. ఈ ముగ్గురు ఒకే పాఠశాల నుంచి వరుసగా ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించి పలువురిని అబ్బురుపరిచారు. ప్రతిభకు పట్టుదల తోడైతే విజయాలు సాధ్యమవుతాయని నిరూపించారు. సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర గ్రామానికి చెందిన చక్క రామారావు, లక్ష్మి దంపతులకు ముగ్గురు అమ్మాయిలు. ఈ ముగ్గురు అమ్మాయిలు దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నారు. వీరిలో మొదటి అమ్మాయి చెక్క అనిత 2021-22లో పదో తరగతిలో 560 మార్కులతో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి చదువుతుంది . రెండో కుమార్తె చక్క సమాగ్న గత ఏడాది టెన్త్ లో 584 మార్కులు సాధించి ప్రస్తుతం నూజివీడులో చదువుతుంది. ఈ ఏడాది చిన్న కుమార్తె చక్క శరణ్య పదిలో 577 మార్కులు సాధించి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించారు. వీరు ముగ్గురు దండు గోపాలపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదవడం విశేషం. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వరుసగా ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడంతో ఆ పాఠశాలకు స్థానికులలో మంచి పేరుతో పాటు నమ్మకం కలిగింది. ఒకే కుటుంబం నుంచి ముగ్గురు అమ్మాయిలు ట్రిపుల్ ఐటీలో సీట్లు రావడంతో ఆ విద్యార్థినిలతో పాటు తల్లిదండ్రులను కూడా పలువురు అభినందనలు తెలియజేసారు.

## సెప్టిక్ ట్యాంకర్ ఢీకొని బైక్‌పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలు



**సీతంపేట, జూన్ 16 ప్రభాతవార్త**

సెప్టిక్ ట్యాంకర్ ఢీకొన్న సంఘటనలో బైక్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలు తగిలినట్లు సీతంపేట ఎస్సై వై.అమ్మన్నారావు మంగళవారం తెలిపారు. నాయుడు మల్లికి చెందిన పాలక నాగేశ్వరరావు తన కుమారుడు రోహిత్ కలిసి ద్విచక్ర వాహనంపై సీతంపేట వైపు వస్తుండగా కొండపల్లి సమీపంలో సెప్టిక్ వ్యాను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు తగిలాయి. వీరిని సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఎస్ఐఆర్‌లో సమగ్ర వివరాలను అందించాలి

**ఇచ్ఛాపురం, జూన్ 16 ప్రభాతవార్త:**



మున్సిపాలిటీ పరిధిలో సోమవారం ప్రారంభమైన ఓటర్ల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా మంగళవారం 23వ వార్డు బెల్లుపడ కాలనీలో బీఎలఓ తారకేశ్వరరావుతో కలిసి టీడీపీ పట్టణ కార్యదర్శి శాసన శేఖర్, వార్డు ఇన్‌చార్జ్ సంతోష్ రథో, పార్టీ నేత బచ్చు శంకర్ ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ పత్రాలను పంపిణీ చేశారు. వాటిని ఎలా పూరించి ఇవ్వాలో వారికి వివరించారు. ఏమైనా సందేహాలు ఉంటే బూత్ లెవెల్ అధికారులను, తమను సంప్రదించాలని వారికి సూచించారు. ఎన్యుమరేషన్ పత్రాలలో అవసరమైన అన్ని వివరాలను రాసిన అనంతరం తిరిగి వాటిని బీఎలఓలకు అందజేయాలని చెప్పారు. ప్రతి ఇంటికి బీఎలఓ మూడు సార్లు వస్తారని, ఈలోగా ఎన్యుమరేషన్ పత్రాలను పూరించి ఇవ్వాలని కోరారు.

## ఉపాధ్యాయులకు టెట్ మినహాయించాలి



### ఉపాధ్యాయులు ప్లకార్డుల ప్రదర్శన

**కంచిలి, జూన్ 16 ప్రభాతవార్త**

ఫోర్టో (ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రాష్ట్ర ఫోర్టో సంయుక్త కార్యదర్శి బృందావన్ దోళాయి అధ్వర్యంలో ఎమ్.ఎస్.పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విరామ సమయంలో ఉపాధ్యాయులు ప్లకార్డు ప్రదర్శన చేసి ప్రభుత్వానికి డిమాండ్ చేసారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని, 2009 విద్యా హక్కు చట్టంలో సవరణలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అవసరం లేకుండా చట్టం తెచ్చేలా కృషి చేయాలని ప్లకార్డులతో శాంతియుత ప్రదర్శన చేయడం జరిగింది. కార్యక్రమంలో ప్రమోద్ కుమార్ పాఢి, కే.క్రిష్ణారావు, కే.సురేష్, రమేష్ దొర, అశోక్ కుమార్ ప్రధాన్, బి.గాయాత్రి, రాజేశ్వరి పాఢీ, బి.సంతోషి, యశోద దోళాయి, బి.ప్రతాప్, బి.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలి

**ఇచ్ఛాపురం, జూన్ 16, ప్రభాతవార్త:**



పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్.అప్పలరాజు ఇచ్ఛాపురం తహసీల్దార్ కార్యాలయంలో అగ్రికల్చర్ మరియు ఫర్టిలైజర్స్‌కు సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్, నరసింహమూర్తి ఇచ్ఛాపురం, వ్యవసాయ శాఖ అధికారులు, అజయ్ కుమార్ తహసీల్దార్ వెంకటరావు, ఉపాధ్యక్షులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పథకాల అమలు, ఎరువుల సరఫరా, రైతులకు అందిస్తున్న సేవలు, వ్యవసాయ శాఖ చేపడుతున్న కార్యక్రమాల పురోగతి తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రైతులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అధికారులు తమ శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించగా, సంబంధిత అంశాలపై ఆర్డీఓ ఆర్.అప్పలరాజు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

## రైతులు విత్తనాలను సద్వినియోగం చేసుకోండి



**వీరఘట్టం, జూన్ 16 ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ ముద్ద వెంకటరమణ అన్నారు. పాలకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని నడిమికెళ్లలోని సచివాలయంలో రైతులకు విత్తనాలను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతుని రారాజుగా చూడాలన్నదే కూటమి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు రైతులకు సరిపడే వరి విత్తనాలతో పాటు ఎరువులను కూడా అధికారులు సిద్ధం చేశారన్నారు. కార్యక్రమంలో స్థానిక అగ్రికల్చర్ అసిస్టెంట్ దేవి, గ్రామ పెద్దలు శివున్నాయుడు, గౌరీశంకరరావు, దాలి నాయుడు, సాయి గణేష్ మరియు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### టీడీపీ మండల అధ్యక్షులు సుగ్గు

**సంతబొమ్మాళి, జూన్ 16 ప్రభాత వార్త**



రైతుల సంక్షేమాన్ని కోరి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న పలు రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకుని లాభసాటి వ్యవసాయం చేసుకోవాలని సంతబొమ్మాళి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగ్గు స్వరూప్ రెడ్డి రైతులకు సూచించారు. మండల కేంద్రంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రాయితీ వరి విత్తనాలను పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు మాట్లాడుతూ మండలంలోని వివిధ రైతుసేవా కేంద్రాల పరిధిలోని రైతులు కోరిన వంటి వివిధ రకాల వరి విత్తనాలు 1125 క్వింటాళ్లు అందుబాటులో ఉంచామని, అవసరమైతే అదనంగా ఆయా రకాల వరివిత్తనాలు రప్పించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి పిఎసియస్ చైర్మన్ కూచెట్టి కాంతారావు, తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త రెడ్డి అప్పన్న, తెదేపా నాయకులు మాజీ ఎం పి పి కర్రి విష్ణుమూర్తి, ఏ ఎం సి డైరెక్టర్ ధనరాజు, చిన్నతుంగామ్, డి జి పురం సర్పంచులు సిమ్మ గోవిందరావు, ఆరంగి వసంతరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు పుక్కళ్ళ శ్రీనివాసరావు, మెండ అప్పారావు, దామోదరరావు, అరుణకుమార్, వ్యవసాయ విస్తరణాధికారి గొండు శ్రీధర్, వి వి ఏ లు శశిభూషణరావు, మోహిని, బాలచంద్ర, ధర్మారావు, భీమారెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ వేదిక ఆధ్వర్యంలో శ్రీశ్రీ వర్ధంతి సభ



**పాతపట్నం, జూన్ 16 ప్రభాతవార్త:**

మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) 43వ వర్ధంతిని స్థానిక గ్రంథాలయంలో సాహితీ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా అధ్యక్షులు శంకర నారాయణ మరియు సభ్యులు పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. అనంతరం అధ్యక్షులు శంకర నారాయణ, కార్యదర్శి ఎల్లెన్ కొల్లి శ్రీశ్రీ రచనా ప్రస్థానంపై ప్రసంగించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొని శ్రీశ్రీ కవితా విధానంపై ఆసక్తికర ప్రసంగం చేశారు. అనంతరం గాయనీ, గాయకులు తూలుగు తిరుపతి రావు, గీతాంజలి, కృష్ణ మరియు క్రాంతి శ్రీశ్రీ రచించిన సినీ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో కాళ్ల రాజు, యస్.చిరంజీవి, ఎల్.శ్రీనివాసరావు, ఎంఈవో రాంబాబు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ వైకుంఠరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే.చక్రపతి, పి రామరాజు, వై వీ రమణ, ప్రదీప్, కె.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు బిటివాడ ఫీడర్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం

**వీరఘట్టం, జూన్ 16 ప్రభాతవార్త:**

11కేవీ బిటివాడ ఫీడర్ నందు ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ, చెట్లు తొలగించుట మరియు ఇతర పనుల నిమిత్తం కడకెళ్ళ ఫీడర్ పరిధిలో పనులు చేయుట వలన ఈ నెల 17వ తేదీ బుధవారం ఉదయం 8 నుండి 2 గంటల వరకు విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.విష్ణుమూర్తి మంగళవారం విలేకరులకు తెలిపారు. దీని పరిధిలో ఉన్నటువంటి చిదిమి యు.వెంకంపేట సి ఎస్ ఆర్ పేట, కొట్టుగుమ్మడ గడగమ్మ తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు.

**వీరఘట్టం ఫీడర్ నందు కూడా...**

వీరఘట్టం ఫీడర్ నందు కూడా బుధవారం వీరఘట్టం టౌన్, కనోసా హాస్పిటల్ ,విశాఖ డెయిరీలకు కూడా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ విష్ణుమూర్తి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

## నేటి నుంచి గుంజిలోవలో వెంకటేశ్వరస్వామి చతుర్థ వార్షికోత్సవ వేడుకలు

**కోటబొమ్మాళి, జూన్ 16 ప్రభాతవార్త:**

మండలం గుంజిలోవ గ్రామంలోని శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి దేవాలయం చతుర్థ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 17 నుంచి 21వ తేదీవరకు ఘనంగా నిర్వహించబడుతుందని ఆలయ ధర్మకర్త పేడాడ చిరంజీవులు మంగళవారం తెలిపారు. ఈనెల 17న ఉదయం సుప్రభాతం, నిత్యారాధన, అఖండదీపారాధన, అష్టోతర శతకలశ జలాభిషేకము, నూతన వస్త్రాలంకరణ, మహానైవేద్యం, 18వ తేదీన సుప్రభాతం, ద్రావిడ దివ్యప్రబంధ సేవాకాలం బాలభోగం, ధ్వజరోహణము, నిత్యహోమం, బలిప్రధానము, 19వ తేదీన సమూహిక కుంకవ ర్చనలు తీర్థగోష్టి, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నిత్యహోమం. 20వ తేదీన శ్రీ స్వామి వారి కళ్యాణం, తీర్థప్రసాదాలు, స్వామివారి నగర తిరువీధి ఊరేగింపు, 21వ తేదీన మండలారాధన , శ్రీపుష్పయాగము, ద్వాదశారాధన, ఊంజలసేవ, దేవతోద్వాసన తదితర ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు నంబాల కుమార్ బాబు ఆధ్వర్యంలో జరగనున్నాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వైద్యుల పర్యవేక్షణలో నేత్ర పరీక్షలు చేసుకోండి

**రాజాం, జూన్ 16 ప్రభాతవార్త**




వృద్ధులు, 40 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ వైద్యుల పర్యవేక్షణలో నేత్ర పరీక్షలు చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బొద్దాం వైద్యాధికారిణి డాక్టర్ సిద్ధేశ్వరీ అన్నారు. జిల్లా అందత్వ నివారణ సంస్థ, విజయనగరం సౌజన్యంతో పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరం సహకారంతో వైద్యాధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో ఆమె మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కంటి ముందు రంగు రంగు వలయాలు, నల్లని మచ్చలు వంటి లక్షణాలు కనిపించినపుడు ఏ మాత్రం నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. అంతకు ముందు వైద్యాధికారి లెఫ్టినెంట్ కర్నల్ డాక్టర్ కె.చరణ్ శిబిరాన్ని ప్రారంభించి, నేత్ర వైద్య నిపుణుల పర్యవేక్షణలో సమగ్ర నేత్ర పరీక్షలు చేసుకోవాలని పేషెంట్‌ను కోరారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన స్థానిక టీడీపీ నాయకులు మద్దు హరి మాట్లాడుతూ, ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆప్తలమిక్ ఆఫీసర్ మరియు ఏపీ స్టేట్ అల్లైడ్ హెల్త్ కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్ మెంబర్ ఎస్.వసంతరావు ఈ నేత్ర శిబిరంలో 55 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 17 మందికి సమగ్ర నేత్ర పరీక్షలు, శస్త్ర చికిత్సల కొరకు పుష్పగిరి కంటి ఆసుపత్రి విజయనగరంనకు తరలించారు. పేషెంట్స్‌కు ప్రభావతి జాగృతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్పహారం అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సెస్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొని సేవలు అందించారు.

## సీతారామ పామాయిల్ మిల్లులో అగ్నిప్రమాదం

**రాజాం, జూన్ 16 ప్రభాతవార్త**

సోపేరు దగ్గర ఉన్న సీతారామ పామాయిల్ మిల్లులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పేలడంతో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ విధంగా మిల్లులో అగ్ని ప్రమాదం సంభవించడం వలన సుమారుగా 2.0 కోట్లు నష్టం వాటిల్లందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.

## అమర్‌నాథ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే శిరీష

**పలాస, జూన్ 16 ప్రభాతవార్త:**



పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠిన శిక్షలు పడాల్సిందే. వైకాపా నాయకుల వ్యాఖ్యల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడిన గౌతు శిరీష. సోషల్ మీడియా వేదికగా మహిళల గౌరవానికి భంగం కలిగిస్తే సహించేది లేదంటూ ఎమ్మెల్యే శిరీష హెచ్చరించారు. అమర్‌నాథ్ గారు... మీ ఇంట్లో మహిళలు లేరా? అమర్నాథ్ చేసి వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి. వెంటనే క్షమాపన చెప్పాలి. ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు గౌరవాన్ని కాపాడే చట్టాన్ని తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న ప్రతీ ఒక్క మహిళ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలు ఖండించాలని ఎమ్మెల్యే శిరీష అన్నారు.

## స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర అందరి లక్ష్య సాధన కావాలి : ఎమ్మెల్యే



**పలాస, జూన్ 16 ప్రభాతవార్త**

పలాస మండలంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన రథాలను పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ద్వారా గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా మారడంతో పాటు ప్రజల్లో పరిశుభ్రత పట్ల అవగాహన పెంపొందుతుందని తెలిపారు. స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిశుభ్రమైన పరిసరాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ రథాల ద్వారా గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో స్వర్ణ ఆంధ్ర లక్ష్య సాధన దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, ప్రజలందరూ ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## చర్యలు తీసుకోవాల్సిన ఆక్రమణలకు రెండేళ్లు చాల్లేదా ?.. సామాన్యుని ప్రశ్న

**శ్రీకాకుళం, జూన్ 16, ప్రభాతవార్త:**

రెండేళ్లు విజయవంతంగా పూర్తయ్యిందని విజయోత్సవ సభలు జరుపుకొంటున్న వేళ ఒక సామాన్యునికి అనుమానం వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన చెరువులు, కాలువల ఆక్రమణలపై ఈ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా గణ్యబంధ, కుంకుమసాగరం, మిగిలిపాడు, నెమలివూరు, ఉదయపురం చెరువుల విషయంలో ఎటువంటి చర్యలు కనిపించడం లేదు. ఇది ఒక వైపు అయితే, ఎర్రచెరువు కాలువ, మార్కెట్ యార్డ్ సమీప రహదారి, డబ్బాల చెరువు, కుంకుమసాగరం, శనీశ్వరుడు మెట్ట ప్రాంతం సత్యసాయి హాస్టల్ ఎదురు, జగన్నాథసాగరం వంటి ప్రాంతాల్లో కొత్తగా ఆక్రమణలు, నిర్మాణాలు ఏదేచ్ఛగా కొనసాగుతుండటం మరో వైపు ఆలోచించదగ్గ విషయం. ప్రభుత్వాలకు కాలపరిమితి ఉంటుంది. పదవులకు గడువు ఉంటుంది కానీ కబ్జాలకు మాత్రం ఎలాంటి వాలిడిటీ ఉండదా? ఒక ప్రభుత్వం హయాంలో జరిగిన తప్పును మరో ప్రభుత్వం సరిదిద్దకపోతే ప్రజలు మార్పును ఎందుకు నమ్మాలి అనే భావం రాదా? విచిత్రం ఏమిటంటే, ప్రజా సమస్యల దగ్గర వేర్వేరు జెండాలు కనిపించే రాజకీయపక్షాలు, చెరువులు-కాలువల కబ్జాల దగ్గరకు వచ్చేసరికి మాత్రం ఒకే పక్షంగా మారిపోతున్నాయి. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా కబ్జాల విషయంలో అధికారుల మౌనం అంతా ఒక్కటే అనే సందేశం ఇస్తోంది. చెరువులు ప్రజల ఆస్తి. కాలువలు ప్రజల హక్కు. వాటిని కాపాడటం ప్రభుత్వాల బాధ్యత. ఆక్రమణదారుల ప్రయోజనాల కోసం ప్రకృతిని, ప్రజల భవిష్యత్తును తాకట్టు పెట్టే రాజకీయాలకు ప్రజలు హర్షించరు అని చరిత్ర చెబుతున్న పాఠం.

## జిల్లాలో రెవెన్యూ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



### ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసుల సంఘం

**శ్రీకాకుళం, జూన్ 16 ప్రభాతవార్త**

జిల్లాలోని అన్ని రెవెన్యూ కార్యాలయాలలో ఉద్యోగులందరినీ భాగస్వామ్యం చేస్తూ ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనే విధంగా జూన్ 20న నిర్వహించనున్న రెవెన్యూ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసుల సంఘం ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించడంలో సహకరించినందుకు సంఘం తరఫున జిల్లా కలెక్టర్‌ను సత్కరించారు. అనంతరం రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా ఉద్యోగులపై పెరుగుతున్న పని భారాన్ని తగ్గించడం, అన్ని పనులను ఏకకాలంలో నిర్వహించాల్సిన పరిస్థితికి బదులుగా ప్రభుత్వ ప్రాధాన్యతా క్రమంలో విధులను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవడం, రోజువారీ పరిపాలనా కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన బడ్జెట్‌ను కేటాయించడం, కోర్టు కేసుల నిర్వహణకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడం వంటి అంశాలను ప్రతిపాదించారు. రీ-సర్వే కార్యక్రమం అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో ఎదురయ్యే సమస్యలు, రీ-సర్వే ఉప తహసీల్దార్ పోస్టుల కొనసాగింపునకు ఉత్తర్వులు జారీ చేయడం, జూనియర్ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులకు సర్వే శిక్షణ కల్పించేందుకు ప్రతిపాదనలు పంపడం, ప్రతి నెల ఒకరోజు ఉద్యోగుల గ్రీవెన్స్ సమావేశం నిర్వహించడం, ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఉద్యోగ సంఘాలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించడం తదితర అంశాలపై చర్చించారు. ఈ అంశాలన్నింటిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.వి.వి.యెన్. రాజు, తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు సరఫరా లేదంటే కదం తొక్కిన మల్లికార్జున కాలనీవాసులు



**రాజాం, జూన్ 16 ప్రభాతవార్త:**

రాజాం పట్టణంలో మల్లికార్జున కాలనీలో కరెంటు లేకపోవడంతో కాలనీవాసులు ఎలక్ట్రికల్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ మధ్యకాలంలో కురిసిన వర్షాలకు చెట్లు విరిగిపోవడంతో అంతరాయం వాటిల్లిందంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా కరెంటు లేకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని వాపోతున్నారు. తక్షణమే కరెంటు పునరుద్ధరణ పనులు చేపట్టి కరెంటు అంతరాయం లేకుండా చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## సర్వీసులో ఉండే టీచర్లకు టెట్ రద్దు చేయాలి

### ఎ పి టి ఎఫ్ కార్యవర్గ సమావేశంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి




**కోటబొమ్మాళి, జూన్ 16, ప్రభాతవార్త:**

స్థానిక ఎం.పి.పి.ఎస్. కోటబొమ్మాళి బీసీ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపిటిఎఫ్) కోటబొమ్మాళి మండల శాఖ కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తిరుమలరావు ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయుల సమస్యలు, విద్యా రంగంలో జరుగుతున్న పరిణామాలపై సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే సేవలో ఉన్న (ఇన్-సర్వీస్) ఉపాధ్యాయులకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) తప్పనిసరి చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే చట్ట సవరణ (అమెండిమెంట్) తీసుకురావాలని, అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని ఎ పి టి ఎఫ్ తరఫున ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, విద్యా ప్రమాణాల అభివృద్ధి కోసం ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఉపాధ్యాయులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సూచించారు. సమావేశంలో ఏపిటిఎఫ్ మండల శాఖ కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయ ప్రతినిధులు పాల్గొని పలు అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. సమావేశం విజయవంతంగా ముగిసింది.

## 30 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్ట్




**ఇచ్ఛాపురం, జూన్ 16 ప్రభాతవార్త:**

ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా టౌన్ ఇన్‌ఛార్జ్ ఎసఐ అర్.జనార్దనరావు 30.210 కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు సిఐ ఎం.చిన్నంనాయుడు చెప్పారు. మహారాష్ట్రకి చెందిన విశాల్ యస్వంత్ కంబ్లే, అర్పిత వర్మ అలియాస్ జరా ఫాతిమాలు 30.210 కీలోల గంజాయి తరలిస్తుండగా సీజ్ చేసి కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి ఆర్థిక పరిస్థితి బాగులేని కారణంగా మహమ్మద్ షరీఫ్ అనే వ్యక్తితో ఒప్పందం కుదుర్చుకుని 10 వేలు రూపాయలు కిరాయికి మాట్లాడి రోషన్ అలియాస్ సాల్మన్ మజ్జి అనే వ్యక్తి వద్ద గంజాయి తీసుకుని తరలిస్తుండగా పట్టుబడినట్లు చెప్పారు.

# ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా రామకృష్ణ మాస్టారు ఎన్నిక



నెల్లిమర్ల, జూన్ 16, ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు మాత రామకృష్ణ ఎన్నికయ్యారు. 2002 అక్టోబర్ 17వ తేదీన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా ఉపాధ్యాయ వృత్తి లోకి ప్రవేశించిన రామకృష్ణ మాస్టారు బానాది, పారసాం, పాలవలస తదితర ఉన్నత పాఠశాలల్లో పని చేశారు. ఐదేళ్లపాటు విజయనగరం డైట్ కళాశాలలో కూడా అధ్యాపకు డిగా పనిచేశారు. ప్రస్తుతం ఈయన చింతలపేట ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు. సాంఘిక శాస్త్ర బోధనలో తనదైన శైలిలో సేవలు అందించి అధికారులతోనూ, ప్రజా ప్రతినిధులతో ప్రశంసలు అందుకున్నారు. జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు కూడా అందుకున్నారు. ఉపాధ్యాయ సమూహాల్లో చురుగ్గా వ్యవహరించడంతోపాటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా తన వంతు కృషి చేస్తున్న రామకృష్ణ మాస్టార్‌ని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా తాజాగా ఎన్నుకున్నారు. రామకృష్ణ మాస్టారు ఎన్నిక పట్ల ఆ సంఘం జిల్లా నాయకులు, మండల నాయకులు ఉండ్రు శ్రీనివాసరావు, బాలకృష్ణ, వెంకటరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుని డి. గౌరీదేవి, సహచర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు,

# సర్ ప్రక్రియను పక్కాగా చేయాలి



నెల్లిమర్ల, జూన్ 16, ప్రభాతవార్త :

'సర్' ప్రక్రియను విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కీర్తన సూచించారు. సోమవారం ప్రారంభమైన సర్ ప్రక్రియ పై ఆమె పలు గ్రామాలు పర్యటించి ఖచ్చితమైన ఓటర్ల నమోదు, తొలగింపులు తదితర అంశాలపై ఆరా తీశారు. సర్ ప్రక్రియ నిర్వహిస్తున్న ఉద్యోగులతో మాట్లాడారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబం లోని ఓటర్ల వివరాలు తెలుసుకొని జాబితాను సవరించాలని అన్నారు. మృతి చెందిన, శాశ్విత వలస వెళ్లిన ఓటర్ల పేర్లను తొలగించాలని, కొత్తగా 18 ఏళ్ల వయసు నిండిన యువతి యువకుల పేర్లను నమోదు చేయాలని ఆమె సూచించారు. ఆమె వెంట రెవెన్యూ ఇన్స్పెక్టర్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# పోయిన సెల్ ఫోన్లు బాధితులకు అప్పగించిన సీఐ

శృంగవరపుకోట,జూన్16,ప్రభాతవార్త



పోగొట్టుకున్న సెల్ ఫోన్లలను బాధితులకు సీఐ వివిఎన్.మూర్తి మంగళవారం అప్పగించారు.సెల్ ఫోన్లు పోయినట్లు ఇటీవల ఏడుగురు బాధితులు పిర్యాదు చేశారని ఈమేరకు దర్యాప్తు చేపట్టి వాటిని రికవరీ చేసి బాధితులకు అందజేశామని తెలిపారు.ఎవరివైనా సెల్ ఫోన్లు పోయినట్లు అయితే వెంటనే సియర్ అప్లికేషన్ లో పిర్యాదు నమోదు చేసుకోవాలన్నారు.సదరు ఫోన్ ఆన్ అయిన వెంటనే పోలీసులకు మెసేజ్ వస్తుందని దాని ఆధారంగా సెల్ ఫోన్ రికవరీ చేయడం సులువుగా ఉంటుందని సీఐ మూర్తి తెలిపారు.

# కోటమ్మ ఆలయంలో సేవాహీ స్వచ్ఛత కార్యక్రమం



శృంగవరపుకోట,జూన్16,ప్రభాతవార్త

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న సేవాహీ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉత్తరాంధ్ర ఇలవేల్పు భక్తులకు కొలువై ఉన్న కోటమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో బీజేపీ నాయకులు దొడ్డి సూర్యారావు మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు సూర్యారావు స్వచ్ఛందంగా తన సొంత నిధులతో నాలుగు వేల రూపాయలు విలువ చేసే 35లీటర్లు అలాగే 50లీటర్ల సామర్థ్యం గల పది డస్ట్ బిన్(బకెట్స్)లను తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ అర్చకులు, సిబ్బందికి అందజేశారు.నరేంద్ర మోడీ దేశ ప్రధానమంత్రిగా 12ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పిలుపు మేరకు సేవాహీ స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బీజేపీ నాయకులు సూర్యారావు తెలిపారు.

# పెరటి తోట పెంపకంపై అవగాహన కల్పించాలి

## ఎంపీడీవో సూర్యనారాయణ



వేపాడ ,జూన్ 16, ప్రభాతవార్త :

మహిళలకు పెరటి తోట పెంపకం పై వెలుగు సిబ్బంది అవగాహన కల్పించాలని ఎంపీడీవో సిహెచ్ సూర్యనారాయణ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛభారత్ మిషన్ , కిచెన్ గార్డెన్ ( పెరటి తోట) అనే అంశంపై ఎస్ హెచ్ జి సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వెలుగు సిబ్బంది అందరూ గ్రామంలో ఉన్న ప్రతి మహిళకు రెండు అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వంట గది నుండి , స్నానాల గది నుండి, ఇల్లు శుభ్రపరచినప్పుడు వచ్చిన నీరు ను పెరట్లోకి మళ్లించి మొక్కలకు నీరు అందించడం ద్వారా కూర కాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు పెంచుకోవచ్చని తెలియజేయాలని కోరారు . వంటగది నుండి వచ్చే తడి చెత్తను ఎరువుగా మార్చి మొక్కలకు వేస్తే మంచి ఫల సాయం రావడమే కాకుండా ఆర్థికంగా లాభం పొందవచ్చునని తెలిపారు. పొడి చెత్తను స్వచ్ఛరథమ్ నకు ఇవ్వడం ద్వారా ఇంట్లో ఉపయోగపడే నిత్యవసర సరుకులు తీసుకోవడం ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. పెరటి కోళ్లను పెంచడం ద్వారా కలుషితం లేని ఆహారం పొందడమే కాకుండా ఆదాయం వస్తుందని తెలిపారు. బహిరంగ మలవిసర్జన చేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్, ఎంఎస్‌జీవో శైలజ , ఏపీఎం సూర్యనారాయణ, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ రాంబాబు,పీడీవో అనిల్ పాల్గొన్నారు.

# చురుకుగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం

గరివిడి, జూన్ 16, ప్రభాత వార్త

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్)కార్యక్రమం మండలం లో చురుకుగా సాగుతోంది. ఎన్యుమరేషన్ ఫారాలు పట్టుకొని ఇంటి ఇంటికి వెళ్లి బి ఎల్ ఓ లు, బి ఎల్ ఏలు ఓటర్లు ని కలుస్తూ ఓటు నమోదు ,మ్యాపింగ్ అంశాలు వారికి వివరిస్తూ సమగ్ర సమాచారం పొందుపరుస్తూ ఉన్నారు. చీపురుపల్లి నియోజ కవర్గ ఎలెక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ , ఆర్ డి ఓ సుధారాణి నేతృత్వంలో, సహాయ ఎలెక్ట్రోల్ అధికారి, గరివిడి తహసీల్దార్ చింత బంగారాజు పర్యవేక్షణలో ,పది మంది సూపర్ వైజర్ల ఆధ్వర్యంలో సర్ కార్యక్రమం చురుకుగా ప్రారంభమైంది.69 వేల ఓటర్లుకి గాను 69 మంది బూత్ లెవెల్ ఆఫీసర్లు కార్యక్రమంలో పాల్గొంటుండగా, టీడీపీ నుండి 69 మంది ,వైకాపా నుండి 69 మంది, జనసేన నుండి 69 మంది బూత్ స్థాయి ఏజెంట్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా వచ్చేనెల 14 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ప్రతీ ఓటరు సర్ కార్యక్రమం సద్వినియోగ పరచు కోవాలని గరివిడి మండల ఏ ఈ ఓ చింత బంగారాజు కోరారు.పారదర్శకంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఓటర్లు ఎటువంటి అపోహలకు పాల్పడవద్దని తహసీల్దార్ పేర్కొన్నారు. ప్రతీ ఓటు నమోదు చేస్తామన్నారు.

# అమర్నాథ్ గౌడ్ హత్యకు మూడేళ్లు

## తీవ్ర నేరాల్లో భాగస్వాములైతేనే వైసీపీ మెంబర్ షిప్

## జగన్ పాలనపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే కోళ్ల



లక్కవరపు కోట, జూన్ 16 ప్రభాత వార్త

వైసీపీ పాలన లో అభం శుభం తెలియని పదవ తరగతి విద్యార్థి అమర్నాథ్ గౌడ్ హత్య జరిగి మూడేళ్లు పూర్తి అయ్యింది అని ఎమ్మెల్యే కోళ్ల అన్నారు మంగళవారం ఎల్ కోటలో ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అరాచక పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శాంతిభద్రతలు క్షీణించి ఒక రావణ కాష్టంగా మారిందని . ఎక్కడ ఏ సభ పెట్టినా నా బీసీలు, నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి, అధికారం చేపట్టాక ఆ వర్గాలపైనే దారుణమైన దాడులకు తెగబడ్డారు అని ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎల్.కోటలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆమె మాట్లాడుతూ.. రేపల్లె నియోజకవర్గంలో తన అక్కను వేధిస్తున్నారని ప్రశ్నించినందుకు పదో తరగతి చదువుతున్న అమర్నాథ్ గౌడ్ అనే బీసీ బాలుడిని వైసీపీ నేతల ప్రోద్బలంతో పెట్రోల్ పోసి దారుణంగా తగులబెట్టి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణ సంఘటన జరిగి నేటికి మూడేళ్లు పూర్తి కా వస్తున్నా బాధితులు తీరని దుఃఖంలో మునిగిపోతే, బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితులు వినాయక చవితి ఉత్సవాల్లో దర్జాగా డాన్సులు వేస్తూ విర్రవీగడమే కాకుండా, బాధితుల ఇంట్లోకి చొరబడి హత్యాప్రయత్నానికి ఒడిగట్టడం ఆ పార్టీ నేతల బరితెగింపునకు పరాకాష్ట అని మండిపడ్డారు. నాడు డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన మాజీ ఎమ్మెల్సీ అనంతబాబుకు, సొంత చిన్నాన్న వివేకానంద రెడ్డిని హత్య చేసిన నిందితులకు కొమ్ముకాసిన జగన్ రెడ్డి, తీవ్ర నేరాల్లో భాగస్వాములైన వారికే తన పార్టీలో మెంబర్‌షిప్‌లు, పదవులు ఇచ్చి ప్రోత్సహించారని ఆమె విమర్శించారు.

# ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లక్క వరపు కోట, జూన్ 16 ప్రభాత వార్త

మండలం లోని జమ్మదేవిపేట గ్రామ కేంద్రం గా నడపబడుతున్న బీసీ సంక్షేమ శాఖ కి చెందిన మహాత్మా జ్యోతి భా పూలే బాలికల పాఠశాల ను +వా మీ చీశీ. 6, తేదీ: 16.06.2026 ప్రకారం రాష్ట్రంలోని అరు సంక్షేమ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేయడం జరిగింది.దీనిలో జమ్మదేవి పేట పాఠశాల కూడా ఉందని ప్రిన్సిపాల్ యూ విజయ్ కుమార్ పాత్రో తెలిపారు. దీని ప్రకారం ప్రారంభించిఎంజెపి బీసీ సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ , బైపీసీ గ్రూపుల్లో ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాలకు అర్హులైన బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. అని దీనివల్ల ఈ ప్రాంత బాలికలకు ఎంతో మేలు జరుగుతుంది.అని ప్రిన్సిపాల్ తెలిపారు పదో తరగతి రెగ్యులర్‌గా ఉత్తీర్ణులై ఉండి - కనీసం 500 మార్కులు సాధించిన వారు తేదీ జూన్ 22 లోపు దరఖాస్తు చేసుకోవాలి అని రిజర్వేషన్ ప్రకారం ప్రాధాన్యత కల్పించడం జరుగుతుంది అని తెలిపారు. దరఖాస్తు సమయం లో 10వ తరగతి మార్క్స్ లిస్ట్ కుల ధృవీకరణ పత్రం ఆధార్ కార్డు తెల్ల రేషన్ కార్డు 1 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తో నేరుగా కళాశాలలో సంప్రదించాలి అని ప్రిన్సిపాల్ తెలిపారు. ఉచిత హాస్టల్ సదుపాయం ఉందని తెలిపారు.

# టౌన్‌లో కుళ్లిన నిల్వ ఉన్న మేక మాంసం విక్రయాలు

సాలూరు, జూన్ 16 ప్రభాతవార్త :



సాలూరు పట్టణ మాంసాహార దుకాణాల్లో నిల్వఉన్న కుళ్ళిన మేక మాంసం జోరుగా అమ్మకాలు జరుగు తుండడంతో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సచివాలయ పర్యావరణ కార్యదర్శులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మంగళవారం అందులో భాగంగా పలు మాంసహార దుకాణాలలో పాడైన మాంసం గుర్తించి దుకాణ యజమానులకు ఫైన్ విధించారు.అలాగే ఆ మాంసాన్ని పారిశుధ్య కార్మికులు భూమిలో పాతి పెట్టారు.ఇంకా మాంసాహార దుకాణాలను శుభ్రత పాటించాలని అలాగే మెస్సలు ఏర్పాటు చేసి,బ్లీచింగ్ పౌడర్ చుట్టు పక్కల చల్లలని పలు సూచనలు చేశారు. అంతేకాకుండా నిబంధనలో పాటించని యెడల గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బ్యాంకు ద్వారా వచ్చే రుణాలు మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

రామభద్రపురం, జూన్ 16, ప్రభాత వార్త:



బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళలు తప్పనిసరిగా యూనిట్లు నెలకొల్పాలని వెలుగు ఏపీఎం సూరెడ్డి సత్యవతి తెలిపారు. వ ఎండల వెలుగు కార్యాలయంలో సోమవారం ఆమె విలేఖర్లతో మాట్లాడారు. ఈ యూనిట్లు నెలకొల్పడం ద్వారా వారి జీవనోపాధి మెరుగవ్వడమే కాకుండా రుణాలు సక్రమంగా చెల్లించడా నికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే చాలా మంది డ్వాక్రా మహిళలు, గొర్రెలు, కోళ్లు, ఆవులు పెంపకంతోపాటు విస్తరాకులు, పేపరేట్లు, కూరగాయల అమ్మకాలు ఈ ర ణాలతో వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. గడిచిన మూడు నెలల్లో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి కింద రూ.7.11 కోట్లు బ్యాంకు రుణాలు అందించామని తెలిపారు. అలాగే అక్షరాంధ్రలో భాగంగా మండలంలో 2వేల 500 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వీరిలో 1500 మంది డ్వాక్రా మహిళలు ఉపాధిహామీ పథకం కింద వెయ్యి మంది మహిళలను అక్షరాస్యులను చేస్తామని తెలిపారు. దీనిపై గ్రామాల్లో ఇప్పటికే నిరక్షరాస్యుల గుర్తింపు కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ప్రతీ డ్వాక్రా మహిళను అక్షరాస్యులు చేయడమే లక్ష్యంగా చేస్తున్నామని, దీనివలన డ్వాక్రా పథకాలపై డ్వాక్రా మహిళల్లో అవగాహన పెంపొందించుకుంటారని అన్నారు.

# మాజీ మంత్రి అమర్నాథ్ తీరు మార్చుకోవాలి



## టిడిపి రాష్ట్ర కార్యదర్శి సువ్వాడ వనజాక్షి

నెల్లిమర్ల, జూన్ 16, ప్రభాతవార్త

రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పై మేకప్ మంత్రి అంటూ వ్యక్తిగత దూషణలకు దిగిన వైసిపి నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కు మహిళలు తగిన బుద్ధి చెప్పక తప్పదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సువ్వాడ వనజాక్షి అన్నారు. అమర్నాథ్ వ్యాఖ్యలకు నిరసనగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వనజాక్షి ఆధ్వర్యంలో తెలుగు మహిళలు స్థానిక రామతీర్థం జంక్షన్లో మంగళవారం సాయంత్రం నిరసన కార్యక్రమం చేపట్టారు. మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ ఫ్లెక్సీ చిత్రపటానికి కోడిగుడ్లు, టమోటా లతో కొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వనజాక్షి మాట్లాడుతూ వైసీపీ నాయకులు గత ఎన్నికల్లో తీరని పరాభవం చవిచూసినప్పటికీ వారు తీరులో మార్పు రాకపోవడం గమనారామని అన్నారు. మహిళా మంత్రి అనితను వ్యక్తిగతంగా దూషించడం అమర్నాథ్ కు తగదని వనజాక్షి విమర్శించారు. అమర్నాథ్ కు మహిళలు పట్ల గౌరవం లేదనే విషయం స్పష్టమైందని, రాష్ట్రంలోని మహిళలు ఆయనకు తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని ఆమె ఘాటుగా విమర్శించారు. తన విమర్శలను అమర్నాథ్ తక్షణమే ఉపసహరించుకొని, మంత్రి అనితకు క్షమాపణ చెప్పాలని వనజాక్షి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మహిళా విభాగం నాయకురాలు కాళ్ల సత్యవతి, కింతాడ కళావతి, చీకటి సుహాసిని, చిల్లా పద్మావతి, బొంతు ఉమా, మంగమ్మ, రెడ్డి సంతోషి, సుంకర లక్ష్మి, ఎడ్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు అంగన్వాడిలలో చేర్పించండి : ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి

కురుపాం, జూన్ 16, ప్రభాతవార్త :



అంగన్వాడి కేంద్రాలలో పిల్లలను చేర్పించాలని కురుపాం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి రజినీ దుర్గ అన్నారు రాష్ట్రవ్యాప్తంగా ప్రీ ప్రైమరీ విద్యా విధానంలో భాగంగా కురుపాం ప్రాజెక్టు పరిధిలో ప్రతిరోజు తల్లిదండ్రులకు అవగాహన కలిగే విధంగా ర్యాలీ లు నిర్మిస్తున్నట్లు ఆమె తెలిపారు. అందులో భాగంగా కురుపాం మండలం గుమ్మిడిగూడ పంచాయతీ దండుసూర గ్రామంలో గల అంగన్వాడి కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. మూడు నుంచి నాలుగు సంవత్సరాల పిల్లలకు ప్రీ ప్రైమరీ విద్యా విధానంలో భాగంగా పిల్లలకు చేర్పించాలని సూపర్వైజర్ రమాలక్ష్మి కోరారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జోగలత , ఆయాలు,పిల్లల తల్లులు పాల్గొన్నారు.

# కోటమ్మ ఆలయంలో సేవాహీ స్వచ్ఛత కార్యక్రమం



శృంగవరపుకోట,జూన్16,ప్రభాతవార్త

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న సేవాహీ స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉత్తరాంధ్ర ఇలవేల్పు భక్తులకు కొలువై ఉన్న కోటమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో బీజేపీ నాయకులు దొడ్డి సూర్యారావు మంగళవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈమేరకు సూర్యారావు స్వచ్ఛందంగా తన సొంత నిధులతో నాలుగు వేల రూపాయలు విలువ చేసే 35లీటర్లు అలాగే 50లీటర్ల సామర్థ్యం గల పది డస్ట్ బిన్(బకెట్స్)లను తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ అర్చకులు, సిబ్బందికి అందజేశారు.నరేంద్ర మోడీ దేశ ప్రధానమంత్రిగా 12ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన పిలుపు మేరకు సేవాహీ స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బీజేపీ నాయకులు సూర్యారావు తెలిపారు.

# గాండ్ల తెలకుల రాష్ట్ర ఉపాధ్యక్షునిగా "మొల్లేటి"

లక్కవరపుకోట, జూన్ 16 (ప్రభాత వార్త) :



రాష్ట్ర గాండ్ల (గానుగ)తెలకుల సంఘ ఉపాధ్యక్షునిగా జిల్లాకు చెందిన కల్లేపల్లి గ్రామస్తుడు మొల్లేటి శ్రీను ను నియమిస్తూ ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు వాకాటి హరికృష్ణ ఓ ప్రకటన విడుదల చేసారు. విజయవాడలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. తెలకుల అభ్యున్నతి, అభివృద్ధికి కార్యవర్గ సభ్యులు నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. రాష్ట్ర సంఘంలో అన్ని జిల్లాలకు సమాన ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. విజయనగరం జిల్లాకు చెందిన ఎల్. కోట మండలం కల్లేపల్లి గామస్తుడు మొల్లేటి శ్రీను ని ఎంపిక చేసి జిల్లాకు ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు.కూటమీ ప్రభుత్వం తెలకులకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. శ్రీను నియామకం పట్ల జిల్లా (గానుగ)గాండ్ల తెలకుల కులస్తులంతా అభినందనలు తెలిపారు.

విజయనగరం పార్వతీపురం మన్యం 25 వార్త

# రెండేళ్లలో సంక్షోభం నుంచి సంక్షేమం, అభివృద్ధి

## మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



పార్వతీపురం, జూన్ 16, ప్రభాతవార్త :

ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిందని, ఈ రెండేళ్లల్లో రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం సంక్షోభం నుంచి సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేయిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి , జిల్లా ఇంచార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రెండు సంవత్సరాల కాలంలో ఊహించని విధంగా అనేక సంక్షేమ పథకాలను అందించడంతో పాటు సమాంతరంగా అభివృద్ధిని కూడా ముందుకు తీసుకువెళ్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభ - తల్లికి వందనం కార్యక్రమం మంగళవారం విద్యా శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఇంచార్జి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూన్ 12, 2024న తమ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించే సమయానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెంటిలేటర్ మీద ఉందని, చంద్రబాబు నాయుడు సీనియారిటీ, కేంద్ర సహకారంతో ప్రస్తుతం కోలుకుంటూ ఆక్సిజన్ తీసుకునే స్థాయికి చేరిందని అన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.10.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని, ప్రభుత్వ ఆస్తులు సైతం తాకట్టు పెట్టారని విమర్శించారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా, తల్లికి వందనం కింద ఒకే రోజున ఏకంగా ?10,000 కోట్ల రూపాయలను తల్లుల ఖాతాల్లో జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. గత ప్రభుత్వం అరకొరగా లబ్ధిచేకూర్చితే ప్రస్తుత ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా ఇచ్చిన మాట ప్రకారం 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేసి శభాష్ అనిపించుకుందని అన్నారు. గిరిజనులు ఎక్కువగా ఉండే మన్యం జిల్లా, ప్రభుత్వం విద్యా రంగానికి ఇచ్చిన ప్రాధాన్యత వల్ల వరుసగా రెండు సంవత్సరాలు ఉత్తీర్ణతలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు. ఉత్తరాంధ్ర ఇరిగేషన్ ప్రాజెక్టుల (తోటపల్లి, వంశధార, మద్దువలస మొదలైనవి) కోసం ?2,500 కోట్లు కేటాయించామని, రాబోయే రెండేళ్లలో వీటిని పూర్తి చేయడానికి స్పష్టమైన టైం టేబుల్ రూపొందించామన్నారు. విజయోత్సవ సభలో స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర, కృప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తోక జగదీశ్వరి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు , వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తల్లులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిర కరపత్రం ఆవిష్కరించిన వాకాడ

గరివిడి, జూన్ 16,ప్రభాత వార్త:



ఈ నెల 19 న గరివిడి లో సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే స్వచ్ఛంద రక్త దాన శిబిర కరపత్రాన్ని గర్భాము శ్రీ మహాలక్ష్మీ స్మెల్టర్స్ అండ్ అల్లాయిస్ పరిశ్రమ యూనిట్ హెడ్ వాకాడ గోపి ఆవిష్కరించారు. సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో,ఏ ఎస్ రాజా వాలంటీర్ బ్లడ్ బ్యాంక్ నిర్వహణ లో ఈ నెల 19 న స్వచ్ఛంద రక్త దాన శిబిరం గరివిడి లో నిర్వహిస్తున్నట్లు సహాయ్ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు రక్త దాన శిబిర కరపత్రాన్ని వాకాడ గోపి ఆవిష్కరించి రక్త దాన శిబిరాన్ని విజయవంతం చేయాలని విన్నవించారు. ప్రతీ ఒక్కరూ ఏడాదికి రెండుసార్లు రక్త దానం చేయాలని ఆయన కోరారు. కరపత్ర ఆవిష్కరణలో అధ్యక్షుడు ఉప్పు శ్రీనుతో పాటు సహాయ్ ప్రతినిధులు బడిగంటి సీతారాం,బమ్మిడి కార్తీక్, ఆలమూరు సత్య శ్రీనివాస్, మేదరమెట్ల వెంకటేశ్వర రావు,తదితరులు పాల్గొన్నారు.

# పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పించాలి



దత్తిరాజేరు జూన్ 16 ప్రభాతవార్త

గ్రామాల్లో డ్వాక్రా గ్రూప్ సభ్యులకు పెరటి తోటల పెంపకం పై అవగాహన కల్పించాలని ఎంపీడీవో కిషోర్ కుమార్ తెలిపారు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ మిషన్ కిచెన్ గార్డెన్ పెరటి తోట అనే అవసరం పై ఎస్ హెచ్ జి సభ్యులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ వంటగది ప్రక్కన ఖాళీ స్థలం పెరట్లో కూరగాయలు ఆకుకూరలు పండ్లు మొక్కలు పువ్వు మొక్కలు పెంచుకోవాలని తెలియజేశారు. తడి చెత్త పొడి చెత్త ఎరువుగా మార్చి మొక్కలకు వేస్తే మంచి పలసయం రావడమే కాకుండా ఆర్థికంగా లాభం పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు తాత రవి ఏ.వో శివాజీ ఎస్ హెచ్ జి గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

# సంక్షోభం నుంచి స్వర్ణాంధ్ర వైపు ప్రభుత్వం అడుగులు

## ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



పార్వతీపురం, జూన్15, ప్రభాతవార్త:

ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు, సంక్షోభం నుంచి స్వర్ణాంధ్ర నిర్మాణం లోకి అడుగులు వేసిందని స్థానిక శాసనసభ్యులు బోనెల విజయచంద్ర అన్నారు. ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ సభ మరియు 'తల్లికి వందనం' కార్యక్రమంలో ఇంచార్జ్ మంత్రితో పాటు ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాల విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకం సరిగ్గా అందని పరిస్థితి ఉండేదన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ పేరుపేరునా రూ. 15 వేలు చొప్పున అందిస్తూ సరికొత్త చరిత్ర సృష్టించిందని కొనియాడారు. తమ ఏజెన్సీ పరిధిలో ఒకే ఇంట్లో ఎనిమిది మంది పిల్లలు ఉన్నా, వారందరికీ ఈ పథకాన్ని వర్తింపజేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుదేనని ఆయన కొనియాడారు. రాష్ట్రానికి రూ. 23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని, దేశంలోనే పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిందని అన్నారు. నారా చంద్రబాబు నాయుడు కేవలం ఒక పేరు మాత్రమే కాదు, అదొక అంతర్జాతీయ బ్రాండ్ అని ప్రశంసించారు. దీపం 2.0' పథకం ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు ప్రయోజనం పొందారని అన్నారు. ప్రతి నెల 1వ తేదీన తెల్లవారక ముందే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్.టి.ఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేస్తున్నామని అన్నారు.

# హోం మంత్రిపై గుడివాడ వ్యాఖ్యలు దారుణం

విజయనగరం, జూన్ 16, ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై జనసేన పార్టీ విజయనగరం నాయకురాలు గురాన రాధిక తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరనాథ్ తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, హోం మంత్రికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ మేరకు గురాన రాధిక ఒక ప్రకటన విడుదల చేస్తూ, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఒక మహిళా మంత్రిని లక్ష్యంగా చేసుకుని, వ్యక్తిగత విమర్శలు , వ్యంగ్యాస్త్రాలు సంధించడం అత్యంత దారుణమని మండిపడ్డారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజమే అయినప్పటికీ, ఒక మహిళను వ్యక్తిగతంగా అవమానించేలా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసేటప్పుడు మీ ఇంట్లో ఉన్న మహిళలు కానీ, మీ సొంత పార్టీలోని మహిళా నాయకులు కానీ మీకు గుర్తుకు రాలేదా అని ఆమె నిలదీశారు.

# భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

విజయనగరం, జూన్ 16: ప్రభాతవార్త

జిల్లాలో ప్రాజెక్టుల స్థాపనకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రాజెక్టుల కొరకు చేపట్టిన భూసేకరణ పురోగతిపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవిన్యూ , ఎ పి ఐ ఐ సి, సర్వే, రైల్వే, పంచాయతీ రాజ్, ఉద్యానవన శాఖ, అటవీ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని రైల్వే, రహదారులు, పారిశ్రామిక పార్కులు, సాగునీటి ప్రాజెక్టులు మరియు ఇతర ప్రభుత్వ ప్రాధాన్యతా ప్రాజెక్టులకు అవసరమైన భూముల సేకరణ స్థితిగతులను శాఖల వారీగా సమీక్షించారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ, ఒబేరాయ్ గ్రూప్ ఽ మేఫైర్ హోటల్స్, గిగా ఎఐ డేటా సెంటర్ నిర్మాణం, తారకరామ తీర్థసాగర్, తోటపల్లి సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారి 130సిడి, విజయనగరం - కుర్ధా రోడ్డు, విజయనగరం - సంబల్ పూర్ మూడో రైల్వే లైన్, కొత్తవలస-- విజయనగరం నాలుగో రైల్వే లైన్ ,వివిధ రైల్వే ప్రాజెక్టులు,ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్, మా మహా మాయ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తదితర ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిని కలెక్టర్ సమీక్షించారు.

